www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 26-12-2024 | పేజీలు: 12 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume): 65 | సంచిక (Issue): 251

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 12.44 తదుపరి ద్వాదశి; నక్షత్రం: స్వాతి రా. 6.09 తదుపరి విశాఖ; వర్జ్యం: రా. 12.17-2.02; దుర్ముహూర్తం: ఉ. 10.26-11.09, మ. 2.49-3.33; అమృతఘడియలు: ఉ. 8.19-10.06; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 5.44

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కజకిస్థాన్‌లో కుప్పకూలిన విమానం

38 మంది ప్రయాణికుల మృతి

రష్యాకు వెళ్తున్న అజర్‌బైజాన్ విమానంలో సాంకేతిక లోపం

అత్యవసర ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తున్న క్రమంలోనే ఘోరం

2



అక్టౌ విమానాశ్రయం సమీపంలో కుప్పకూలిన విమానం

● ప్రధానితో భేటీ ఫలవంతం

ప్రధాని మోదీతో సమావేశం ఫలప్రదంగా జరిగింది. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను తిరిగి గాడిలో పెట్టేందుకు చేసిన సాయానికి ధన్యవాదాలు తెలియజేశాను. గత ప్రభుత్వం 94 కేంద్ర పథకాల నిధులు దారిమళ్లించడాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లాను. వీటిని మళ్లీ ప్రారంభించడానికి మా ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించాను. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను, కేంద్రం సాయం చేయాల్సిన అవసరాన్ని తెలియజేశాను. రాష్ట్ర పర్యటనకు రానున్న ఆయనకు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్నాను.

-'ఎక్స్'లో సీఎం చంద్రబాబు ట్వీట్



బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన సీఎం చంద్రబాబు

ప్రత్యేక సాయంతో ఆదుకోండి

స్వర్ణాంధ్రకు చేయూతనివ్వండి

మోదీకి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

ఏపీ విజన్ డాక్యుమెంట్ ప్రధానికి అందజేత

ఐదేళ్ల రెవెన్యూ లోటు గ్రాంటును జగన్ సర్కారు మూడేళ్లలోనే వాడేసింది

94 కేంద్ర పథకాల నిధులు దారి మళ్లించారు

మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ముడి ఖనిజం ఇవ్వండి

సీఎం విన్నపాలు.. పోలవరం, అమరావతికి నిధులిచ్చినందుకు ప్రధానికి ధన్యవాదాలు

వచ్చే నెలలో మోదీ రాష్ట్ర పర్యటనపై చర్చ

అమిత్‌షా, నిర్మల, నడ్డా, కుమారస్వామి, అశ్వినీ వైష్ణవ్‌తో వేర్వేరుగా భేటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047ను సాకారం చేసేందుకు అన్ని విధాలా సాయం అందించాలని ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందన్నారు. ఐదేళ్లలో రావలసిన రెవెన్యూ లోటు గ్రాంటును మూడేళ్లలోనే వాడేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేకంగా ఆర్థిక సాయం అందించాలని అభ్యర్థించారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా... తమ వంతుగా రాష్ట్రప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను, వాటిని చేరుకునేందుకు సిద్ధం చేసిన ప్రణాళికలను, ఆలోచనలను ప్రధానికి వివరించారు. వచ్చే నెలలో మోదీ చేతుల మీదుగా రాష్ట్రంలో భారీగా తలపెట్టిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపే ప్రాజెక్టులపై

మిగతా 11వ పేజీలో...



ఎన్డీఏ పక్షాల సమావేశంలో చంద్రబాబు, నడ్డా, అమిత్‌షా

అంబేడ్కర్‌పై తప్పుగా మాట్లాడలేదు

నా వ్యాఖ్యలను కాంగ్రెస్సే వక్రీకరించింది

ఎన్డీయే నేతలకు అమిత్ షా వెల్లడి.. నడ్డా నివాసంలో కూటమి భేటీ

మరింత సమన్వయంతో ముందుకెళ్లడంపై చర్చలు

న్యూఢిల్లీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురించి తానేమీ తప్పుగా మాట్లాడలేదని, కాంగ్రెస్సే తన మాటలను వక్రీకరించిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. మాజీ ప్రధాని

మిగతా 2వ పేజీలో...



నవ్యాంధ్రలో నవ శకం!

ఏపీ వైపు సౌదీ చూపు

బీపీసీఎల్‌తో కలిసి భారీ రిఫైనరీకి రెడీ!

రామాయపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ - పెట్రో కాంప్లెక్స్

జాయింట్ వెంచర్ కింద నెలకొల్పేందుకు సుముఖత

గ్రీన్‌ఫీల్డ్ విధానాలపై 'సౌదీ అరాంకో' ఆసక్తి

ప్రపంచ అగ్రగామి చమురు ఉత్పాదక సంస్థ ఇది

మహారాష్ట్ర, యూపీలను కాదని ఏపీ వైపు మొగ్గు

ప్రాజెక్టు కోసం పలుదఫాలు ఢిల్లీకి బాబు

బీపీసీఎల్, కేంద్ర పెద్దలతో విస్తృత చర్చలు

ఎట్టకేలకు రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు

మోదీ సౌదీ పర్యటనలో ప్రస్తావించే వీలు

త్వరలో దావోస్‌లో సౌదీ బృందంతో బాబు భేటీ!

12

లక్ష కోట్ల రూపాయల పెట్టుబడి

10 మిలియన్ టన్నుల సామర్థ్యం



A ఫర్ ఆంధ్రా
P ఫర్ ప్రోగ్రెస్

కూటమి ప్రభుత్వం రావడంతో ఏపీ పెట్టుబడుల గమ్యస్థానంగా మారుతోంది. చమురు దిగ్గజ సంస్థ 'సౌదీ అరాంకో'.. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. రామాయపట్నంలో బీపీసీఎల్ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ-పెట్రో కాంప్లెక్స్ నిర్మాణంలో ఈ సంస్థ కీలక భాగస్వామి కానుంది. ఈ ప్రాజెక్టు రూపంలో రూ.లక్ష కోట్ల మేర పెట్టుబడులు రానున్నాయి. మరోవైపు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మరో ఫార్మా సెజ్‌ను కేంద్రం మంజూరు చేసింది.

విశాఖలో మరో ఫార్మా సెజ్

నక్కపల్లి వద్ద 1,800 ఎకరాల్లో ఏర్పాటు

8న శంకుస్థాపన చేయనున్న ప్రధాని

ధ్రువీకరించిన ఎంపీ సీఎం రమేశ్

ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు, విశాఖ రైల్వే జోన్‌కూ పునాదిరాళ్లు

పూడిమడక లేదా విశాఖలో సభ!

అమరావతి.. ఆకర్ష్!

ప్రైవేటు పెట్టుబడుల కోసం పీజీఎంసీ ఏర్పాటు

కన్సల్టెంట్ కోసం టెండర్లు పిలిచిన సీఆర్‌డీఏ

సేవా రంగాన్ని భారీగా పెంచే దిశగా ప్రణాళికలు

విద్య, వైద్యం, పర్యాటక రంగాలకూ ప్రాధాన్యం

● మీసాల తాతే మిస్టర్ కూల్



భార్య సాక్షి, కుమార్తె జివాతో ధోనీ

క్రిస్మస్ వేడుకల్లో ధోనీ

శాంటాక్లాజ్ వేషధారణలో టీమిండియా మాజీ కెప్టెన్

కుమార్తె జివా కోరిక మేరకే..

10

దిశ మార్చుకున్న తీవ్ర అల్పపీడనం

నేడు బలహీనపడుతుందన్న వాతావరణ శాఖ

సముద్ర గాలులతో పెరిగిన చలి

6

శ్రీతేజ్ కుటుంబానికి 2 కోట్ల సాయం

అల్లు అర్జున్ రూ.కోటి, నిర్మాతలు రూ.50 లక్షలు, పుష్ప దర్శకుడు సుకుమార్ రూ.50 లక్షలు

ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు చెక్కుల అందజేత

వెంటిలేటర్, ఆక్సిజన్ లేకుండా శ్రీతేజ్ శ్వాస

నేడు టీ-సీఎం రేవంత్‌తో సినీ ప్రముఖుల భేటీ

సినీ పరిశ్రమ తరఫున చిరంజీవి, అల్లు అరవింద్, నాగవంశీ, సురేష్‌బాబు పాల్గొనే అవకాశం!



హైదరాబాద్‌లో దిల్‌రాజుకు చెక్కులు అందజేస్తున్న అల్లు అరవింద్, పుష్ప నిర్మాత రవిశంకర్

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబానికి ఆ చిత్ర యూనిట్ రూ.2 కోట్ల సాయం అందజేసింది. చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్ రూ.కోటి, నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ రూ.50 లక్షలతోపాటు ఆ సినిమా దర్శకుడు సుకుమార్ మరో రూ.50 లక్షలు ఇచ్చారు. ఈ మేరకు అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్, సుకుమార్ తరఫున ఆయన కుటుంబ సభ్యులు సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు అందజేశారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో

మిగతా 6వ పేజీలో...

'పొరుగు' మద్యం.. అదే జోరు

పక్క రాష్ట్రాల నుంచి వచ్చిపడుతున్న బాటిళ్లు


కొత్త పాలసీ వచ్చినా అడ్డుకట్ట పడలేదు

ఈ ఏడాది పట్టుబడింది 1.89 లక్షల లీటర్లు

గతేడాది పట్టుబడింది 71,365 లీటర్లే

ప్రభావం చూపుతున్న ధరలు, నాణ్యత

కొన్ని బ్రాండ్లపై ఇప్పటికీ అనుమానాలే



(అమరావతి, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ప్రైవేటు మద్యం షాపుల పాలసీని ప్రవేశపెట్టాక పక్క రాష్ట్రాల మద్యానికి (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్) పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని అంతా అనుకున్నారు. ప్రభుత్వం కూడా తనకు ఆదాయం పెరుగుతుందని భావించింది. కానీ దానికి విరుద్ధంగా జరుగుతోంది. ఇప్పటికీ సరిహద్దు ప్రాంతాల్లోకి భారీగా ఎన్‌డీపీఎల్ వచ్చిపడుతోంది. కొత్త ప్రైవేటు మద్యం పాలసీ వచ్చిన తర్వాత కూడా పలు జిల్లాల్లో ఎన్‌డీపీఎల్ భారీగా దొరుకుతోంది. ఈ నెలలో ఒక్క అనంతపురంలోనే 30 వేల సీసాల గోవా మద్యం పట్టుబడింది. అక్టోబరు నెలలో ఆదోనిలో కర్ణాటక మద్యం 14 కేసులు దొరికింది. అలాగే అటు చిత్తూరు జిల్లాకు తమిళనాడు మద్యం వస్తోంది. ఇటు తెలంగాణ

మిగతా 12వ పేజీలో...



గమ్యంలేని పయనం!

ఆర్టీసీలో ఎండీ నుంచి డీఎం వరకూ ఇన్‌చార్జిలే దిక్కు

ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ దాకా ఈడీల్లేరు

సీఎం సొంత జిల్లా చిత్తూరులో ఆర్ఎం లేని దుస్థితి

40 డిపోల్లో మేనేజర్లు ఇన్‌చార్జిలే.. భారీగా డ్రైవర్ల కొరత

పర్యవేక్షణ కరువై ఆక్యుపెన్సీపై ప్రభావం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌లో ప్రగతి రథచక్రం దారి తప్పింది! డ్రైవర్ లేని బస్సు తరహాలో గమ్యంలేని ప్రయాణం చేస్తోంది!! కదల్లేని స్థితిలో డిపోల నుంచి బయటికి రాలేక బస్సులు ఆపసోపాలు పడుతున్నాయి. కొత్త బస్సులు వస్తున్నాయని

మిగతా 11వ పేజీలో...



స్వదేశీ విమాన ఇంజన్ 'కావేరీ' సిద్ధం!

న్యూఢిల్లీ, డిసెంబరు 25: గగనతల సాంకేతికతకు సంబంధించిన స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధిలో డీఆర్‌డీవో కీలక మైలురాయిని దాటింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న కావేరీ ఇంజన్ ప్రాజెక్టు ఒక కొలిక్కి వచ్చిందని, పరీక్షలకు కావేరీ ఇంజన్ సిద్ధమైందని ప్రకటించింది. డీఆర్‌డీఓ పరిధిలోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఈ ఇంజన్‌ను అభివృద్ధి చేసింది. యుద్ధవిమానాలకు అవసరమైన ఇంజన్లను స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించుకోవాలన్న లక్ష్యంతో కావేరీ ప్రాజెక్టు 1980ల చివర్లలో ప్రారంభమైంది. ఆ తర్వాత నాలుగు దశాబ్దాల కాలంలో అనేక సవాళ్లను ఎదుర్కొంది. వాటన్నింటినీ అధిగమించి ఎట్టకేలకు స్వదేశీ విమాన ఇంజన్ రూపుదాల్చింది. తదుపరి దశలో భాగంగా కావేరీ ఇంజన్‌ను పలు విమానాల్లో, పలు రకాల వాతావరణ పరిస్థితుల్లో పరీక్షించనున్నారు. వాటిలో కూడా విజయవంతమైతే విమాన ఇంజన్ల కోసం విదేశాల మీద ఆధారపడాల్సిన పరిస్థితి తప్పుతుంది.

శబరిమలలో నేడే మండల పూజ

శబరిమల, డిసెంబరు 25: శబరిమలలో మండల పూజోత్సవానికి సర్వం సిద్ధమైంది. గురువారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నందున వర్చువల్ బుకింగ్‌లో 50 వేల మంది.. స్పాట్ బుకింగ్‌లో 5 వేల మంది భక్తులకు మాత్రమే దర్శనానికి అవకాశం కల్పిస్తామని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) వెల్లడించింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో మండల పూజోత్సవం ప్రారంభమవుతుందని, ఆ తర్వాత నెయ్యాభిషేకం జరిపి.. దర్శనానికి అనుమతిస్తామని, రాత్రి 11 గంటలకు 'హరివరాసనం'తో ఆలయం తలుపులను మూసివేస్తామని తెలిపింది. మకర విళక్కు సీజన్ సందర్భంగా ఈ నెల 30న సాయంత్రం 5 గంటలకు అయ్యప్ప స్వామి సన్నిధానాన్ని తిరిగి తెరుస్తామని చెప్పారు. జనవరి 14న మకర విళక్కు పూజలు ఉంటాయని, 18వ తేదీ వరకు ఆలయం తెరిచి ఉంటుందని వివరించారు. కాగా.. ఆదివారం అరన్ముల పార్థసారథి ఆలయం నుంచి బయలుదేరిన 'తంగ అంకి'(వస్త్రాలంకరణ) ఊరేగింపు బుధవారం మధ్యాహ్నం పంపాబేస్‌కు.. సాయంత్రం సన్నిధానానికి చేరుకుంది.

తెలుగు భక్తులకు గాయాలు

పునలూర్-మువత్తుపుళ రాష్ట్ర రహదారిపై జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో తెలంగాణకు చెందిన 11 మంది భక్తులు గాయపడ్డారు. ఎరుమేళి నుంచి పంపాకు బయలుదేరిన భక్తుల కారు అదుపుతప్పి ఫుట్‌పాత్‌పైకి ఎక్కిన ఘటనలో ముగ్గురు హైదరాబాద్ భక్తులు గాయపడ్డారు. కోన్ని ప్రాంతంలో ఓ పికప్ వ్యాన్‌ను ఇన్నోవా ఢీకొన్న ఘటనలో హైదరాబాద్‌కు చెందిన 8 మంది భక్తులకు గాయాలైనట్లు రాణి జిల్లా పోలీసులు తెలిపారు. ఇదే ప్రాంతంలో జరిగిన మరో ప్రమాదంలో తమిళనాడుకు చెందిన నలుగురు గాయపడ్డారు.

మోదీ, యోగిపై కుంభమేళాలో దాడి చేస్తాం: పన్నూ

న్యూఢిల్లీ, డిసెంబరు 25: ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగిలపై దాడి చేస్తామంటూ ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ బెదిరించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల ముగ్గురు ఖలిస్థానీ ఉగ్రవాదులను ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు. ఇందుకు తన ఉగ్రవాద సంస్థ సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) కుంభమేళా సందర్భంగా ప్రతీకారం తీర్చుకుంటుందన్నాడు. నకిలీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు సిక్కు యువతను చంపినట్టు ఆ వీడియోలో పన్నూ ఆరోపించాడు. చనిపోయిన ఉగ్రవాదుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్టు హామీ ఇచ్చాడు. కుంభమేళాలలో భాగంగా షాహి స్నానాలకు శుభప్రదమైన జనవరి 14, 29, ఫిబ్రవరి 3వ తేదీల్లో దాడులు చేయనున్నట్టు చెప్పాడు. ఆ రోజుల్లో ప్రధాని మోదీ, సీఎం యోగిలు ప్రయాగ్‌రాజ్‌లో ఉంటారని నొక్కిచెప్పాడు.

జగ్జీత్ పేరుతో మా సైన్యంలో ఎవరూ లేరు: బ్రిటన్

న్యూఢిల్లీ, డిసెంబరు 25: పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో ఇటీవల ఓ పోలీసు పోస్టుపై జరిగిన ఉగ్రదాడి వెనుక బ్రిటిష్ సైనికుడు జగ్జీత్ సింగ్ హస్తం ఉందన్న ఆ రాష్ట్ర పోలీసుల ప్రకటనను బ్రిటన్ ఖండించింది. జగ్జీత్ సింగ్ పేరుతో తమ సైన్యంలో ఎవరూ లేరని పేర్కొంది. ఈ మేరకు బ్రిటన్ రక్షణశాఖ ప్రతినిధి రియాన్ షిల్లాబీర్ ఓ ప్రకటన చేశారు. ఈ ఘటనకు సంబంధించి తమను భారత అధికారులెవరూ సంప్రదించలేదని తెలిపారు. మరోవైపు, దర్యాప్తు అధికారుల ప్రకటనకు తాము కట్టుబడి ఉన్నామని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. ఈ కేసు వ్యవహారాన్ని సంబంధిత అధికారుల ద్వారా బ్రిటన్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

అఫ్ఘాన్‌పై పాక్ దాడులు..46 మంది మృతి

కాబూల్, డిసెంబరు 25: అఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడుల్లో 46 మంది మరణించినట్లు తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడినట్లు తెలిపింది. ఈ దాడులకు తప్పక ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. మంగళవారం అర్ధరాత్రి సరిహద్దుల్లో ఉండే పక్తికా ప్రావిన్స్‌లోని బార్మల్ జిల్లాలో నాలుగు గ్రామాలే లక్ష్యంగా పాక్ వైమానిక దాడులు చేసింది. ఇందులో ఒక ఇంటిపై జరిగిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మరణించారు. 2021లో తాలిబన్ సర్కారు అధికారం దక్కించుకున్నప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగాయి.

ప్రపంచంలో శాంతి పరిఢవిల్లాలి: పోప్ ఫ్రాన్సిస్



వాటికన్ సిటీ, డిసెంబరు 25: ప్రపంచంలో శాంతి పరిఢవిల్లాలని, ఆయుధాలు మౌనం పాటించాలని, శత్రువులు సైతం మిత్రత్వం అనే బంధంలోకి రావాలని పోప్ ఫ్రాన్సిస్ ఆకాంక్షించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియాలని, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంతో ఇరువైపులా క్రైస్తవులు ఇబ్బందులకు గురవుతున్నారని, వీటికి ముగింపు పలకాలని అభిలషించారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం ఆయన వాటికన్‌సిటీలోని 'హోలీ డోర్ ఆఫ్ సెయింట్ పీటర్' ప్రార్థన మందిరం వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబరు 7న హమాస్ అపహరించిన ఇజ్రాయెలీలను బేషరతుగా వదిలిపెట్టాలని సూచించారు.

నేవీలో హెలికాప్టర్ తొలి మహిళా పైలట్‌గా అనామిక

విశాఖ ఐఎన్ఎస్ డేగలో తొలి పోస్టింగ్



విశాఖపట్నం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళంలో హెలికాప్టర్ తొలి మహిళా పైలట్ లెఫ్టినెంట్ అనామిక రాజీవ్ బుధవారం విశాఖపట్నంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి నేవీ వైమానిక స్థావరం ఐఎన్ఎస్ డేగలో ఆమె విధులు నిర్వహించనున్నారు. నేవీ హెలికాప్టర్లలో సీ కింగ్, ఏఎల్‌హెచ్ ధ్రువ్, చేతక్, ఎంహెచ్-60ఆర్ సీ హాక్స్‌కు ఆమె సారథ్యం వహిస్తారు. నాలుగేళ్ల క్రితం నిఘా విమానం డార్నియర్‌లో తొలి మహిళా పైలట్‌గా శుభాంగి స్వరూప్ బాధ్యతలు చేపట్టారు. ఈసారి హెలికాప్టర్లను నడిపే బాధ్యత మహిళలకు అప్పగించారు. అందులో అనామికకు మొదటి అవకాశం లభించింది. అనామిక రాజీవ్ స్వస్థలం కేరళలోని తిరువనంతపురం. ఆమె తమిళనాడులోని ఐఎన్ఎస్ రజాలీలో హెలికాప్టర్ శిక్షణ పొందారు. అక్కడ ప్రతిభా పాటవాలు ప్రదర్శించి ఆరు నెలల క్రితం తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ చేతులు మీదుగా 'గోల్డెన్ వింగ్స్'ను పొందారు. ఆమెకు తొలి పోస్టింగ్ విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగలో ఇచ్చారు.

కోచింగ్ 'కోట'కు బీటలు

కోటాలోని కోచింగ్ సెంటర్లలో 40% మేర తగ్గిన ప్రవేశాలు

- తీవ్ర సంక్షోభంలోకి హాస్టళ్లు
- చిరు వ్యాపారులపైనా ప్రభావం
- ఐదో వంతుకు పడిపోయిన అద్దెలు

కోటా.. జాతీయస్థాయిలో పేరొందిన కోచింగ్ సెంటర్ల కేంద్రం! నీట్, యూపీఎస్సీ, ఐఐటీ జేఈఈ.. తదితర ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలనుకునే విద్యార్థుల తొలి గమ్యస్థానం!! కానీ.. లక్షలాది మంది విద్యార్థులతో కళకళలాడిన కోటా ఇప్పుడా పూర్వవైభవాన్ని కోల్పోయింది! విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య పెరుగుతుండడంతో.. అక్కడి శిక్షణ కేంద్రాల్లో కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది ఆ సంఖ్య 30-40% మేర పడిపోయింది. ఆ ప్రభావం.. హాస్టళ్లు, మెస్‌లు, ఇతర చిరువ్యాపారాలపై తీవ్రంగా పడుతోంది!! రద్దీ లేని రోడ్లు.. ఎటు చూసినా 'అద్దెకు', 'అమ్మకానికి' అనే బోర్డులు.. ఇదీ ఇప్పుడు అక్కడి పరిస్థితి!!



కోటా, డిసెంబరు 25: విద్యార్థులను వారి జ్ఞానంతో కాకుండా.. బట్టీపట్టడం ద్వారా వచ్చే మార్కులతో, ర్యాంకులతో మాత్రమే కొలిచే సమాజం మనది. అలాంటి చదువుల'బట్టీ'లకు పేరొందిన నగరం.. రాజస్థాన్‌లో మూడో అతిపెద్ద నగరమైన కోటా. కండరాలు క్షీణించే (మస్క్యులర్ డిస్ట్రోఫీ) వ్యాధితో చక్రాల కుర్చీకే పరిమితమైన వినోద్ కుమార్ బన్సల్ అనే ఐఐటీ పట్టభద్రుడు.. 1991లో ఎనిమిది మంది విద్యార్థులకు తన ఇంట్లో డైనింగ్ టేబుల్ వద్ద మొదలుపెట్టిన శిక్షణ కోటాలో కోచింగ్ కేంద్రాల విస్ఫోటానికి కేంద్ర బిందువు. ఆయన దగ్గర శిక్షణ పొందిన ప్రమోద్ మహేశ్వరి అనే మరో ఐఐటీ పట్టభద్రుడు 'కెరీర్ పాయింట్' పేరుతో మరో కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించాడు. అలా ఒకదాని తర్వాత ఒకటిగా వందల సంఖ్యలో కోచింగ్ సెంటర్లు పుట్టుకురావడంతో కోటా దేశంలోనే అతిపెద్ద 'ప్రవేశ పరీక్షల శిక్షణ కేంద్రం'గా మారిపోయింది. ఎలెన్, రెజొనెన్స్, మోషన్, అన్‌అకాడమీ, ఫిజిక్స్‌వాలా, ఆకాశ్, సర్వోత్తమ్.. ఇలా జాతీయస్థాయిలో పేరొందిన కోచింగ్ దిగ్గజాలతోపాటు చిన్నాచితకా శిక్షణ కేంద్రాలతో దాదాపు రెండున్నర దశాబ్దాలుగా కళకళలాడుతూ వస్తున్న కోటా నగరం ఈ ఏడాది చిన్నబోయింది. కోటాలో విద్యార్థుల ఆత్మహత్యల గురించి విస్తృతంగా ప్రచారం జరగడం, కోచింగ్ సెంటర్లను నియంత్రిస్తూ ఈ ఏడాది జనవరిలో కేంద్ర సర్కారు తీసుకొచ్చిన కొత్త మార్గదర్శకాలు, ప్రముఖ కోచింగ్ సెంటర్లు దేశవ్యాప్తంగా తమ శాఖలను విస్తరించడం.. ఇలా రకరకాల కారణాల వల్ల కోటాకు వచ్చే విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది బాగా తగ్గిపోయింది. అంకెల్లో చెప్పాలంటే.. సాధారణంగా కోటాకు ఏటా దాదాపు లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా విద్యార్థులు.. వివిధ ప్రవేశపరీక్షలకు సంబంధించిన శిక్షణ నిమిత్తం వస్తుంటారు. కానీ, ఈ ఏడాది ఆ సంఖ్య దాదాపు 85 వేల నుంచి లక్ష దాకా మాత్రమే ఉన్నట్టు సమాచారం. కోచింగ్ సెంటర్ల వల్ల అక్కడ జరిగే వ్యాపారం కిందటి సంవత్సరంగా దాకా ఏడాదికి రూ.6,500 కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల దాకా ఉండేది. అది ఈ ఏడాది రూ.3,500 కోట్లకు పడిపోయింది!! కోచింగ్ సెంటర్లే కాదు.. విద్యార్థుల కోసం నిర్మించిన వేలాది హాస్టళ్లు సైతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కోటా నగరం మొత్తమ్మీదా ఇలా విద్యార్థుల కోసం నిర్మించిన హాస్టళ్లు 4,500 దాకా ఉంటాయని అంచనా. ఒకప్పుడు విద్యార్థులతో నిండిపోయి కళకళలాడిన ఈ హాస్టళ్లన్నీ.. ఇప్పుడు 40-50 శాతం ఆక్యుపెన్సీ కూడా లేక వెలవెలబోతున్నాయి. బ్యాంకుల్లో అప్పులు తీసుకుని హాస్టళ్లు నిర్మించి వాటిని నడిపినవారు.. ఇప్పుడు విద్యార్థులు లేక, రాబడి రాక.. బ్యాంకులకు నెలవారీ చెల్లింపులు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. కిందటి సంవత్సరం దాకా నెలకు రూ.15 వేలు వసూలు చేసిన హాస్టళ్లు.. ఇప్పుడు రూ.9 వేలకే అన్ని సౌకర్యాలూ కల్పించడానికి సిద్ధమైనా పూర్తిగా నిండని పరిస్థితి నెలకొంది. అలాగే.. ఈ కోచింగ్ సెంటర్లపై ఆధారపడి జీవనం సాగించే జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలవారు, ఆటో డ్రైవర్లు, హోటళ్లు, మెస్‌ల యజమానులు, వాటిలో పనిచేసే సిబ్బంది.. ఇలా లక్షలాదిమందిపై ఈ సంక్షోభం తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాగే దుకాణాల అద్దెలు రూ.15 వేల నుంచి రూ.3 వేలకు పడిపోయాయి. అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కోటాకు విద్యార్థుల రాక తగ్గిపోయి ఆ ప్రభావం స్థానిక ఆర్థిక వ్యవస్థపై పడడంతో.. అక్కడి వ్యాపారులు ఐటీ పరిశ్రమపై దృష్టి సారించారు.

24

రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం కోటాలో 2023లో ఆత్మహత్య చేసుకుని చనిపోయిన విద్యార్థుల సంఖ్య ఇది. 2022లో ఈ సంఖ్య 15 కాగా.. 2019లో 18 మంది, 2018లో 20 మంది, 2017లో ఏడుగురు, 2016లో 17 మంది, 2015లో 18 మంది చనిపోయారు. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా కోటాలోని కోచింగ్ సెంటర్లన్నీ మూతపడడంతో ఆ రెండేళ్లు విద్యార్థులు క్షేమంగా ఉన్నారు.

అలా మొదలైంది..

1994లో.. కోటాలోని కోచింగ్‌సెంటర్లకు చెందిన 15 మంది విద్యార్థులకు ఐఐటీల్లో ప్రవేశం లభించడంతో ఆ నగరం పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. ఆ తర్వాత ఏడాది ఏకంగా 51 మంది ఐఐటీల్లో సీట్లు సాధించడంతో.. అందులో ఐదుగురు టాప్100లో చోటు సాధించారు. 2000 సంవత్సరంలో.. ఐఐటీల్లో సీట్లు సాధించిన టాప్-10లో ముగ్గురు (1, 2, 7 ర్యాంకులు) కోటా విద్యార్థులే కావడంతో.. అక్కడి కోచింగ్ సెంటర్లకు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు వెల్లువెత్తడం మొదలైంది.

పోల్ డేటాలో పొరపాట్లు జరగవు

ఓటింగ్ లెక్కల్లో వ్యత్యాసం వట్టి మాట.. కాంగ్రెస్ నేతలకు ఈసీ స్పష్టం

చండీగఢ్, డిసెంబరు 25: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడా ఉన్నదంటూ కాంగ్రెస్ పార్టీ వ్యక్తంచేసిన అనుమానాలను భారత ఎన్నికల సంఘం(ఈసీ) తోసిపుచ్చింది. ఓటింగ్ డేటాలో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయన్న ఆ పార్టీ వాదనను కొట్టి వేసింది. మహారాష్ట్రతోపాటు హరియాణా ఎన్నికల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని అనుమానిస్తున్న కాంగ్రెస్.. దీనిపై పార్టీ స్థాయిలో కరణ్ దలాల్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ సోమవారం భారత ఎన్నికల సంఘాన్ని కలిసి తన అభ్యంతరాలను వెల్లడించింది. అయితే, కాంగ్రెస్ వాదనలను ఈసీ కొట్టిపడేసింది. పోల్ గణాంకాలను మార్పు చేయడానికి వీలుఉండదని తెలిపింది. మొత్తం ఎంత ఓటింగ్ జరిగిందో తెలిపే 17-సీ ఫామ్, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ ముగిసిన తర్వాత పార్టీల అభ్యర్థుల ఏజెంట్లకు అందుబాటులో ఉంటుందని వివరించింది. "పోలైన ఓటింగ్ వివరాలను ప్రచురించాల్సిన చట్టబద్ధ బాధ్యత మాపై లేదు. అదంతా పోలింగ్ స్టేషన్ల పరిధిలోని వ్యవహారం" అని వివరించింది. కొన్ని సందర్భాల్లో.. మొత్తం ఓటింగ్‌కు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఉండే అవకాశం ఉందని ఈసీ అంగీకరించింది.







కజకిస్థాన్‌లో కుప్పకూలిన విమానం

38 మంది ప్రయాణికుల మృతి

మాస్కో, డిసెంబరు 25: కజకిస్థాన్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. అజర్‌బైజాన్ నుంచి రష్యా వెళుతున్న విమానం అక్టౌ విమానాశ్రయానికి 3 కి.మీ. దూరంలోని భూముల్లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో 38 మంది మరణించారు. మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. విమానంలో ఐదుగురు సిబ్బంది సహా 67 మంది ఉన్నారు. అజర్‌బైజాన్‌కు చెందిన ఈ విమానం రాజధాని బాకూ నుంచి రష్యాలోని గ్రోజ్నీకి వెళుతోంది. అక్కడ మంచు వల్ల దారి మళ్లించారు. కూలిపోవడానికి ముందు అక్టౌలో అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. విమానం పక్షుల గుంపును ఢీకొందని, దాంతో పైలట్లు 'డిస్ట్రెస్ సిగ్నల్' పంపారని సమాచారం. అక్కడ దిగే క్రమంలోనే కీలక వ్యవస్థలు విఫలమయ్యాయి. విమానం అకస్మాత్తుగా కిందకు వచ్చేయడం, అంతలోనే కూలి మంటలు రేగిన దృశ్యాలు ఓ వీడియోలో కనిపించాయి.



అతీశీని త్వరలో తప్పుడు కేసులో అరెస్టు చేస్తారు

ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో కేజ్రీవాల్ జోస్యం

ఢిల్లీ, డిసెంబరు25: ఓ తప్పుడు కేసులో ఢిల్లీ సీఎం అతీశీని త్వరలో అరెస్టు చేస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ జోస్యం చెప్పారు. అంతకంటే ముందే ఆప్ సీనియర్ నేతల ఇళ్లపై కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు దాడులు జరుపుతాయని ఎక్స్‌లో పోస్టు చేశారు. మహిళలకు నెలకు రూ.2,100 మహిళా సమ్మాన్ యోజన కింద ఇచ్చే పథకంతో పాటు వృద్ధులకు ఉచిత వైద్యం అందించే సంజీవని యోజన పథకానికి అనూహ్య స్పందన వస్తుండటంతో బీజేపీ అధిష్ఠానం బెంబేలెత్తిపోతోందన్నారు. అందుకే ఈడీ, సీబీఐ, ఐటీ ద్వారా అతీశీని తప్పుడు కేసులో అరెస్టు చేయించే యోచనలో ఉన్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. మరోవైపు తనను తప్పుడు కేసులో అరెస్టు చేసినా.. తర్వాత నిజమేంటో అందరికీ తెలుస్తుందని అతీశీ చెప్పారు. మరోవైపు, 2013లో ఆమ్ ఆద్మీ పార్టీకి 40 రోజుల పాటు మద్దతు ఇవ్వడం వల్లే ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడిందని, అదే తాము చేసిన పొరపాటని కాంగ్రెస్ పార్టీ నేత మాకెన్ అన్నారు.


కేజ్రీవాల్ శాంటాకారం



న్యూఢిల్లీ, డిసెంబరు 25: క్రిస్మస్ సందర్భంగా కేజ్రీవాల్ శాంటాక్లాజ్(క్రిస్మస్ తాత) అవతారమెత్తారు. ఆయన 'శాంటా' కారం దాల్చి మెర్రీ క్రిస్మస్ సందేశం ఇస్తున్నట్లు కృత్రిమ మేధ(ఏఐ)తో రూపొందించిన వీడియోను ఆప్ ఎక్స్‌లో షేర్ చేసింది. 'ఢిల్లీ సొంత శాంటా.. ఏడాది పొడవునా వరాలిస్తున్నారు' అని దానికి శీర్షిక పెట్టింది. రూ.2100 అని రాసి ఉన్న గిఫ్ట్ బాక్సును ఒక మహిళకు కేజ్రీవాల్ ఇస్తున్నట్లు ఆ వీడియోలో చూపారు. 'కేజ్రీవాల్ నెలనెలా రూ.2100 ఇస్తారు. ఆనందం తెస్తారు'.. అని అర్థం వచ్చే నేపథ్యంలో పాట ఈ వీడియోకే హైలైట్‌గా నిలిచింది.

తప్పుగా మాట్లాడలేదు

(మొదటి పేజీ తరువాయి)



వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారమిక్కడ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన ఆయన నివాసంలో జరిగిన ఎన్డీయే నేతల భేటీలో అమిత్ షా మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు, కేంద్ర మంత్రులు కుమారస్వామి(జేడీఎస్), జితిన్ మాంఝీ(హెచ్ఏఎం) లలన్‌సింగ్(జేడీయూ), అనుప్రియా పటేల్(అప్నాదళ్-ఎస్), పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ), ఆర్ఎల్ఎం అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా తదితరులు పాల్గొన్నారు. ఇటీవలి పార్లమెంటు సమావేశాలు, రాజ్యాంగంపై జరిగిన చర్చ, అంబేడ్కర్ అంశం, సుపరిపాలన, రాజకీయ వ్యూహాలపై చర్చించారు. పార్లమెంటు లోపల, బయట మరింత సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అంబేడ్కర్‌పై తన వ్యాఖ్యలను కాంగ్రెస్ వివాదం చేస్తోందని షా నేతలతో అన్నారు. వాజపేయి జయంతిని పురస్కరించుకుని సమావేశాలు ఏర్పాటుచేసి ఆయన వారసత్వాన్ని స్మరించుకోవాలని ఎన్డీయే నిర్ణయించింది. సమావేశంపై నడ్డా 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అపూర్వ మైలురాళ్లను చేరుకుంటూ ప్రపంచ సూపర్ పవర్‌గా తనను తాను నిలబెట్టుకుందన్నారు.

10వేల పీఏసీలను ప్రారంభించిన షా

అమిత్‌షా 10వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీల)తో పాటు పాడి మత్స్య సహకార సంఘాలను ప్రారంభించారు. రానున్న ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 2 లక్షల పీఏసీలను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని ఆయన తెలిపారు. సహకార సంఘాలలోని రైతులకు రూపే కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మైక్రో ఏటీఎమ్‌లను పంపిణీ చేశారు. ప్రతి సహకార సంఘానికి ఒక మైక్రో ఏటీఎమ్‌ను సమకూరుస్తామన్నారు.

కేంద్ర గ్రాంట్ల దుర్వినియోగం

గ్రామీణాభివృద్ధి నిధుల పక్కదారిపై రాష్ట్రాలను తప్పుబట్టిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 25: గ్రామీణాభివృద్ధి కోసం పంచాయతీరాజ్ సంస్థలకు కేంద్రం మంజూరుచేసిన గ్రాంట్ల వినియోగంలో రాష్ట్రాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని పార్లమెంటరీ కమిటీ తప్పుబట్టింది. రాష్ట్రాల్లో గ్రాంట్ల నిర్వహణ, నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణ, ఆర్థిక నివేదికల రూపకల్పనలో తీవ్రమైన లోపాలున్నాయని కమిటీ గుర్తించింది. ఈ మేరకు రూపొందించిన నివేదికను కమిటీ ఇటీవల కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖకు సమర్పించింది. ఈ నెల మొదట్లో ఆ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అప్రాధాన్య అంశాలకు నిధులను మళ్లించడం, నిధుల వినియోగంలో పారదర్శకత లేకపోవడంపై కమిటీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. 15వ ఆర్థిక సంఘం(2021-2026) సిఫారసుల ఆధారంగా కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీరాజ్ సంస్థలు టైడ్, అన్‌టైడ్ గ్రాంట్లు పొందుతున్నాయి. 2026 మార్చి 31 నాటికి ఈ గ్రాంట్లు మురిగిపోతాయి. టైడ్ గ్రాంట్లను శానిటేషన్, తాగునీటి సరఫరా, వర్షం నీటి సేకరణ, నీటి రీసైక్లింగ్, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం తదితర నిర్దిష్ట ప్రాథమిక పనులకు వినియోగిస్తారు. అన్‌టైడ్ గ్రాంట్లను రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 రకాల పనులకు వినియోగిస్తారు. అయితే, టైడ్ గ్రాంట్ల కింద విడుదలైన నిధుల్లో గతనెల 21 నాటికి దాదాపు 45% వరకు యూపీ వినియోగించుకోలేకపోయిందని కమిటీ తెలిపింది. అలాగే, మహారాష్ట్రకు విడుదలైన రూ.7,276 కోట్లలో రూ.5,023 కోట్లు ఇంకా వినియోగం కాలేదని తెలిపింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు నిధులను భారీగా అప్రాధాన్య అంశాలకు మళ్లించేశాయని తెలిపింది. ఆడిట్‌లలో తెలంగాణ(12,129 కేసులు), యూపీ(19,732 కేసులు) వెలుగుచూడటం పారదర్శకత లేమిని ఎత్తిచూపుతోందని పేర్కొంది.

కాంగ్రెస్.. శంకుస్థాపనల స్పెషలిస్ట్!



- ప్రాజెక్టులు 35-40 ఏళ్లు ఆలస్యం
- మధ్యప్రదేశ్‌లో ప్రధాని మోదీ ధ్వజం
- నదుల అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన

ఖజురహో, డిసెంబరు 25: గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడంలో ఆ పార్టీ స్పెషలిస్టు అని ఎద్దేవా చేశారు. పునాది రాళ్లు వేసినా.. ప్రాజెక్టులను 35-40 ఏళ్లు ఆలస్యం చేసిందని.. ఉత్తుత్తి ప్రకటనలు మాత్రమే చేస్తుందని.. ప్రజాప్రయోజనాలు దానికి పట్టవని ధ్వజమెత్తారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో కెన్-బెత్వా నదుల అనుసంధానానికి ఆయన శంకుస్థాపన చేశారు. దేశంలో జలసంరక్షణ చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని.. ముఖ్యంగా బుందేల్‌ఖండ్ వంటి ప్రాంతాల్లో రైతుల అవసరాలను గుర్తించడంలో విఫలమయ్యాయని ఈ సందర్భంగా జరిగిన సభలో చెప్పారు. అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారంటూ ఉద్యమిస్తున్న కాంగ్రెస్‌పై మండిపడ్డారు. దేశ జలసంరక్షణ విధానాల రూపకల్పనలో అంబేడ్కర్ పాత్ర చాలా ఉందని, నేడు కేంద్ర జలసంఘం ఉనికి ఉందంటే ఆయన చొరవ, దూరదృష్టే కారణమని చెప్పారు. ఆయన కృషిని కాంగ్రెస్ ఏనాడూ గుర్తించలేదని, ఆయనకు ఇవ్వాల్సినంత క్రెడిట్ ఇవ్వలేదని ఆక్షేపించారు. 'అధికారం తన జన్మహక్కు అని కాంగ్రెస్ భావిస్తుంది. కానీ సత్పరిపాలన అందించడంలో విఫలమైంది. శంకుస్థాపనలు చేసిన తర్వాత దశాబ్దాలపాటు ప్రాజెక్టుల జోలికి వెళ్లలేదు. కాంగ్రెస్, ప్రభుత్వం కలిసి సాగవు' అని వ్యాఖ్యానించారు. నీటి కొరతను నివారించడానికి నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ 21వ శతాబ్దిలో సమృద్ధిగా నీరు, నీటి ప్రాజెక్టుల సమర్థ నిర్వహణ ఉన్న దేశాలే ముందుకెళ్తాయన్నారు. మధ్యప్రదేశ్‌లో గ్రామీణాభివృద్ధి కోసం 1,153 అటల్ గ్రామ సేవాసదన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ బెత్వా, కెన్ నదుల జలాలను రెండు కలశాల్లో ఆయనకు అందజేశారు. ఆ నీటితో అనుసంధాన ప్రాజెక్టు నమూనాను ఆయన అభిషేకించారు.

వాజపేయికి ప్రధాని నివాళి

మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలోని 'సదైవ్ అటల్'(వాజపేయి స్మారకం పేరు) వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ తదితర ప్రముఖులు నివాళులర్పించారు. వాజపేయి రాజ్యాంగ విలువలకు కట్టుబడిన తీరు ఎల్లకాలం గుర్తుండిపోతుందని మోదీ ఈ సందర్భంగా అన్నారు. సదైవ్ అటల్ వద్ద వాజపేయికి నివాళులర్పించిన వారిలో ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఉన్నారు. వాజపేయి దూరదృష్టి వల్లే భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని ఆయన అన్నారు.

కెనడా కాలేజీలపై ఈడీ దర్యాప్తు

మహారాష్ట్ర, గుజరాత్‌లోని 8 చోట్ల సోదాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 25: కెనడా సరిహద్దుల మీదుగా అమెరికాలోకి భారతీయులను అక్రమంగా తరలిస్తున్న వ్యవహారంపై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఇందులో కొందరు భారత్‌కు చెందిన వ్యక్తులు, సంస్థలతో పాటు కెనడాలోని కొన్ని కాలేజీల పాత్ర ఉందని చెబుతోంది. గుజరాత్‌లోని డింగుచా గ్రామానికి చెందిన నలుగురు సభ్యుల కుటుంబం 2022 జనవరి 19న కెనడా-అమెరికా సరిహద్దును అక్రమంగా దాటడానికి ప్రయత్నించింది. అక్కడ చలి తీవ్రతకు తట్టుకోలేక వారంతా మృత్యువాత పడ్డారు. ఈ కేసులో భవేశ్ అశోక్‌భాయ్ పటేల్‌తో పాటు మరికొందరిపై మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ముంబై, నాగ్‌పూర్, గాంధీనగర్, వడోదరల్లోని ఎనిమిది ప్రాంతాల్లో ఈ నెల 10, 19 తేదీల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. కెనడియన్ కాలేజీల్లో అడ్మిషన్ల నెపంతో నిందితులు మానవ అక్రమ రవాణాకు పాల్పడే సంస్థలతో చేతులు కలిపి, భారతీయులను కుట్రపూరితంగా దేశ సరిహద్దులు దాటిస్తున్నారని, ఆ తర్వాత కెనడా మీదుగా అక్రమంగా అమెరికాకు తరలిస్తున్నారని వెల్లడించారు. వీరిలో ఒక్కొక్కరి నుంచి రూ.55లక్షల నుంచి రూ. 65లక్షల వరకూ వసూలు చేస్తున్నారని ఈడీ పేర్కొంది. ముందుగా వీరికి కెనడియన్ స్టూడెంట్ వీసా మంజూరు చేస్తారని, వారు ఆ దేశానికి వెళ్లిన తర్వాత అక్కడి కాలేజీలో చేరకుండా సరిహద్దులు దాటి చట్ట విరుద్ధంగా అమెరికాలోకి పోతున్నారని తెలిపింది. విదేశీ వర్సిటీల్లో భారతీయ విద్యార్థులకు అడ్మిషన్లు ఇప్పించడానికి ముంబై, నాగపూర్‌లో రెండు సంస్థలు కమీషన్ ప్రాతిపదికన పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో వారి ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నామని ఈడీ తెలిపింది.



అన్నప్రసాదం ట్రస్టుకు
రూ.1.11 కోట్ల విరాళం

తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.1.11 కోట్లు విరాళంగా అందింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈవో పీఎంఎస్ ప్రసాద్ ఈ విరాళాన్ని అందజేశారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయంలోని రంగనాయక మండపంలో విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. - ఆంధ్రజ్యోతి, తిరుమల

శనైశ్చరుడికి జస్టిస్ శ్యామసుందర్ పూజలు



పావగడలో శనైశ్చరుడి సన్నిధిలో జస్టిస్ శ్యామసుందర్, కుటుంబ సభ్యులు

పావగడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని పావగడ క్షేత్రంలో శనైశ్చరుడి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామసుందర్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగన్‌ది అసమర్థ పాలన

బాబుది కార్యాచరణ పాలన: సవిత

అమరావతి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమంపై దృష్టి సారించిన నేత చంద్రబాబు అయితే పార్టీ రంగులు పూసిన జగన్ రంగుల రెడ్డి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'బీసీల ఫెడరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత అన్న ఎన్టీఆర్‌ది. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని చంద్రబాబు కూడా బీసీలకు పెద్దపీట వేశారు. జగన్ అధికారంలోకి రాకముందు నా బీసీలు.. నా బీసీలు అంటూ గొంతు చించుకుని, ఓట్లు వేయించుకుని ఆ తర్వాత రంగులు మార్చాడు. జగన్ వస్తే జాబ్ వస్తుందని చెప్పి ఓట్లు వేయించుకుని ఆ తర్వాత యువతను మోసం చేశాడు. జగన్‌ది అసమర్థపాలన అయితే, చంద్రబాబుది కార్యాచరణ పాలన. సీఎం ఆదేశాల మేరకు సీడ్ యాప్ ద్వారా 10 వేల మందికి ఉపాధి చూపించబోతున్నాం. బీసీలకు రూ.39,700 కోట్ల నిధులు కేటాయించిన ఏకైక ప్రభుత్వం ఎన్డీయే కూటమి ప్రభుత్వం. వైసీపీ ప్రభుత్వం బీసీలకు బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేసింది. బీసీ హాస్టళ్ల పరిస్థితిని దారుణంగా మార్చేసింది' అని మంత్రి సవిత అన్నారు.

7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 7న (మంగళవారం) కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. 10 నుంచి 19వ తేదీ వరకు పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు జరుగనున్న నేపథ్యంలో 7వ తేది ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఇక, ఈ కార్యక్రమం నేపథ్యంలో ఆ రోజు వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. దీంతో 6వ తేదీన ఎలాంటి సిఫారసు లేఖలు తీసుకోరు.

వాల్తేరు డివిజన్ కొనసాగింపునకు కేంద్రం ఓకే..! : ఎంపీ భరత్



రైల్వే మంత్రితో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఇతర ఎంపీలు

విశాఖపట్నం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌ను విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే దక్షిణ కోస్తా జోన్‌లో కొనసాగించే విషయమై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి ఢిల్లీలో బుధవారం రైల్వే మంత్రిని కలిసినట్టు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విశాఖలో కొత్త రైల్వే జోన్‌తో పాటు వాల్తేరు డివిజన్‌ను కొనసాగించాలని కోరగా తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే కొత్త రైళ్లు, రైల్వే కనెక్టివిటీపై కూడా పలు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. ఐటీ రంగంలో ఏపీకి భారీ పెట్టుబడులు ఆకర్షించడానికి అనువైన డీప్ టెక్ విధానాలపై మంత్రితో సీఎం చంద్రబాబు చర్చించారన్నారు. రాష్ట్రంలో ఐటీ, మౌలిక వసతులు, రవాణా రంగాల్లో అభివృద్ధికి ఈ చర్చలు దోహదపడతాయని ఎంపీ అభిప్రాయపడ్డారు.

ఏటీఎస్‌లకు తాత్కాలిక బ్రేక్



రవాణా శాఖలో ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్ల(ఏటీఎస్) ఏర్పాటుకు మార్గం సుగమమైందనుకున్న తరుణంలో మరో సమస్య ఎదురైంది. ప్రస్తుతం 13 ఉమ్మడి జిల్లాల్లో 63 చోట్ల ఉన్న వాహనాల భౌతిక పరీక్షా(ఫిట్‌నెస్) కేంద్రాలను ఏటీఎస్‌ల రూపంలో 26కు కుదించారు. అయితే, ఇలా చేయడం వల్ల తమకు ఆయా కేంద్రాలు దూరమవుతాయని, మరిన్ని సమస్యలు వస్తాయని ఆటోలు, ఇతరత్రా వాహనదారులు.. డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తు దారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- 63 ఎఫ్‌సీ సెంటర్లను 26కు కుదిస్తే ఇబ్బందే
- ఎఫ్‌సీ, డీఎల్ టెస్టుకు భారీగా వాహనదారులు
- ఫిట్‌నెస్ టెస్టుకు 26 కేంద్రాలే ఏర్పాటు చేస్తే దూరాభారమని ఆటోవాలాలు, లైసెన్సీల వేదన
- తమ పాత్ర తగ్గడంపై ఎంవీఐల ఆందోళన
- రవాణా శాఖకు కొత్త సమస్య.. మరోసారి సమీక్ష

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేశంలోని అన్ని రాష్ట్రాలూ వాహనాల భౌతిక సామర్థ్య పరీక్షల కోసం ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్ల(ఏటీఎస్)ను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం గతంలోనే మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ క్రమంలో గుజరాత్, బిహార్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలు ఇప్పటికే ఏర్పాటు చేయగా దక్షిణాది రాష్ట్రాల్లో కేరళ, కర్ణాటక, తెలంగాణ సొంతగానే కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. అయితే, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఏపీ ప్రభుత్వం ఏటీఎస్ కేంద్రాల నిర్వహణను ప్రైవేటుకు ఇవ్వాలని నిర్ణయించింది. అంతేకాదు.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 63 కేంద్రాలను 26కు కుదించాలని నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో పైలట్ ప్రాజెక్టు కింద ఎన్నికలకు ముందు అనంతపురం, నంద్యాలలో ఏటీఎస్‌లు ఏర్పాటు చేసింది. మిగతా జిల్లాల కేంద్రాల్లో ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించింది. ఈ సమయంలో కేంద్ర రవాణా శాఖ మార్గదర్శకాలకు భిన్నంగా రెండేళ్ల పాటు టెస్టింగ్ ఫీజుతోపాటు సర్టిఫికెట్ ఫీజు కలిపి మొత్తం ఆదాయాన్ని ఏటీఎస్ కాంట్రాక్టర్లకే ఇచ్చేలా టెండరు నిబంధనలు రూపొందించారు. అదే సమయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల(ఎంవీఐ) పాత్రను దాదాపు తగ్గించేశారు. ఈ రెండు అంశాలపైనా బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఇదే విషయమై అధికారులతో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి సమీక్షించారు. మొత్తం వ్యవస్థ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళితే అది మరింత ప్రమాదానికి దారితీస్తుందని అధికారులు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన ఎంవీఐ ప్రతిదీ తనిఖీ చేసిన తర్వాతే ఫిట్‌నెస్‌కు అనుమతిస్తారని, ప్రైవేటు వ్యక్తులు ఈ విధులు నిర్వహిస్తే తప్పులు ఎక్కువ జరుగుతాయని చెబుతున్నారు. తెలంగాణ, కేరళలో ప్రభుత్వాలే సొంతంగా ఏర్పాటు చేస్తున్నాయని ఏపీలోనూ అదే పద్ధతి కొనసాగించాలని కోరుతున్నారు. ఈ ప్రతిపాదనకు సమ్మతించిన మంత్రి నాన్ ఆటోమెటిక్ పరిశీలనకు ఎంవీఐలను ఏటీసీ కేంద్రాల్లో నియమించాలని, పూర్తిగా ప్రైవేటు పెత్తనాన్ని ఒప్పుకోవద్దని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శికి చెప్పారు. అదే సమయంలో రెండేళ్లపాటు మొత్తం ఆదాయం తీసుకునే నిబంధన మార్చాలని, ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఇలాంటి నిబంధనలతో ఏటీఎస్‌లను అనుమతించవద్దని ఆదేశించారు. ఫలితంగా రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సిన ఏటీఎస్‌లు ఆగిపోయాయి.



ఇప్పటికే ఇబ్బందులు..

రాష్ట్రంలో 63 చోట్ల వాహనాల భౌతిక పరీక్షా ధ్రువపత్రాలు(ఎఫ్‌సీ)లు, డ్రైవింగ్ లైసెన్సు(డీఎల్)లు జారీ చేస్తుంటేనే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, వాటిని 26కు కుదిస్తే మరిన్ని సమస్యలు వస్తాయని వాహనదారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పిందని ఆయా కేంద్రాలను ప్రైవేటు నిర్వాహకులకు ఇవ్వడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో రహదారి భద్రతా నిధుల కింద కేంద్రం రూ.200 కోట్లను గ్రాంటుగా ఇస్తుంటే.. ప్రైవేటు వ్యక్తులకు ఈ కేంద్రాలను అప్పగించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు సంస్థలకు ఈ కేంద్రాలను అప్పగిస్తే తొలి రెండేళ్ల పాటు ప్రభుత్వానికి వచ్చే ఫీజు మొత్తాన్ని ప్రైవేటు సంస్థలు తీసుకుంటాయి. ఆ తర్వాత 18 ఏళ్ల పాటు కేవలం వాటా ఇస్తాయి. ఈ విషయంపైనా ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో ఈ వ్యవహారంపై తుది నిర్ణయం తీసుకునే విషయంపై రవాణాశాఖ అంతర్మథనం చెందుతోంది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ఇచ్చే ప్రోత్సాహకాలను మరోమారు పరిశీలించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

జాయ్ జమీమా కేసులో మరో ముగ్గురి అరెస్టు

- కలకలం రేపుతున్న హనీ ట్రాప్ కేసు.. ఇప్పటికే ముగ్గురి అరెస్టు

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో తీవ్ర సంచలనం సృష్టించిన జాయ్ జమీమా కేసులో మరో ముగ్గురిని అరెస్టు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది యువకులకు, ఆర్థికంగా సంపన్నులైన వారికి జాయ్ జమీమా వలపు వల (హనీట్రాప్) విసిరేది. ఆమెకు సన్నిహితుడు, సహజీవనం చేస్తున్న బచ్చు వేణుభాస్కర్‌రెడ్డితోపాటు వేముల కిశోర్, మరికొందరు ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్‌లో సంపన్నులను గుర్తించేవారు. వారికి ప్రేమ పేరుతో జాయ్ జమీమా దగ్గరయ్యేది. తన ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానించేది. ఆ సమయంలో మత్తుమందు కలిపిన కూల్ డ్రింక్స్ ఇచ్చి, తర్వాత వారి దుస్తులు విప్పి ముఠా సభ్యులు రహస్య కెమెరాలతో వీడియో, ఫొటోలు తీసేవారు. ఆ ఫొటోలు, వీడియోలను కుటుంబ సభ్యులకు, జీవిత భాగస్వాములకు పంపిస్తామంటూ బెదిరించి భారీగా డబ్బులు గుంజేవారు. నగర పోలీస్ కమిషనర్‌కు బాధితులు కొంత మంది ఫిర్యాదు చేయడంతో తొలుత జాయ్ జమీమాపై కంచరపాలెం పోలీసులు కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉండగా మరికొందరు బాధితులు బయటకు రావడంతో పలు స్టేషన్లలో జాయ్ జమీమా ముఠాపై కేసులు నమోదయ్యాయి. దర్యాప్తులో భాగంగా ముఠాలోని కీలక సభ్యులైన వేణుభాస్కర్‌రెడ్డి, వేముల కిషోర్‌ను కొద్దిరోజుల కిందట అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఫాతిమా ఉస్మాన్‌చౌదరి అలియాస్ జోయాతోపాటు ఆమె భర్త తన్వీర్, స్నేహితుడు అవినాష్ బెంజిమన్ పాత్ర ఉన్నట్టు దర్యాప్తులో తేలడంతో కంచరపాలెం పోలీసులు అక్కడకు వెళ్లి వారిని అరెస్టు చేశారు. జమీమా ముఠాలో వారు కూడా సభ్యులేనని, మత్తు మందులు, స్ప్రేలు సరఫరా చేసేవారని, భారీగా ఆర్థిక లావాదేవీలు కూడా జరిగినట్టు గుర్తించారు. అక్కడి కోర్టులో హాజరుపరిచి, నగరానికి తీసుకువచ్చారు.

బెనిఫిట్ షోలు, టిక్కెట్ల ధరల పెంపునకు అనుమతించొద్దు

- ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమకు తలొగ్గుతూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా బెనిఫిట్ షోలకు, టిక్కెట్ల ధరలను విపరీతంగా పెంచుకునేందుకు అనుమతులివ్వడం పరిపాటిగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. దీంతో పెద్ద హీరోల సినిమాలకు ప్రేక్షకుల జేబులు కొల్లగొడుతున్నారని తెలిపారు. ఇటీవల పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన దుర్ఘటనతో తెలంగాణ ప్రభుత్వం మేల్కొందని.. ఇక నుంచి సినిమా టిక్కెట్ల ధరలు పెంచబోమని, బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో కూడా సినిమా టిక్కెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతులను నిలిపివేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రకటన చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం ఆయన లేఖ రాశారు.

30న వామపక్షాల రాష్ట్రవ్యాప్త నిరసనలు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్ఠాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు చేపట్టాలని పది వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆయా పార్టీల రాష్ట్ర నేతలు బుధవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 'అంబేడ్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారింది. ఆ జపమేదో దేవుడిని తలచుకుంటూ చేస్తే స్వర్గమైనా వచ్చేది' అని అంబేడ్కర్‌ను అభిమానించేవారిని ఎగతాళి చేస్తూ అమిత్‌షా చేసిన అభ్యంతకరమైన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా కూడా ప్రధాని మోదీ ఇంకా అమిత్‌షాను వెనకేసుకురావడం భారతీయులకే తలవంపు అని వామపక్ష నేతలు పేర్కొన్నారు.

అమ్మో.. కొండచిలువ!



అలిపిరి-తిరుమల నడక మార్గంలో బుధవారం ఓ భారీ కొండచిలువ పట్టుబడింది. మార్గంలోని 2,500 మెట్టు వద్దనున్న ఓ దుకాణంలోకి సుమారు 13 అడుగుల పొడవైన కొండచిలువ ప్రవేశించింది. దానిని చూసిన వ్యాపారులు భయంతో బయటకు పరుగులు తీశారు. పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడుకు సమాచారం ఇచ్చారు. ఆయన కొండచిలువను పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు. - ఆంధ్రజ్యోతి, తిరుమల

ముగిసిన భవానీ దీక్షలు

విజయవాడ (వన్‌టౌన్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయంలో 45వ వార్షిక భవానీ దీక్షల విరమణల కార్యక్రమాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఐదు రోజుల్లో సగటున రోజూ 60 నుంచి 70 వేలమంది భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. 41 రోజుల మండల దీక్ష, 21 రోజుల అర్ధ మండల దీక్షలు తీసుకున్న భక్తులు దీక్షల విరమణ సందర్భంగా ఇరుముడులు సమర్పించేందుకు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి కూడా తరలివచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పురానవ మైత్రీ బంధం

నిష్క్రమించనున్న 2024, భారత్‌కు దౌత్య రంగంలో ఒక సంతృప్తికరమైన సంవత్సరం. చైనాతో సంబంధాలు, ఐదేళ్ల ఉద్రిక్తతల తగ్గదలతో మెరుగుపడ్డాయి. ఇతర ఇరుగు పొరుగు దేశాలలో శ్రీలంక, మాల్దీవులు భారత్‌తో సుస్థిర స్నేహ సంబంధాలు నెరపాల్సిన ఆవశ్యకతను గుర్తించాయి. నేపాల్, భూటాన్‌ల అభీష్టం ఏమైనప్పటికీ న్యూఢిల్లీని అవి దూరం చేసుకోలేవు. ఇక పాకిస్థాన్ దాయాది జగడాలు ఇప్పట్లో తీరేవి కావు. బంగ్లాదేశ్ నుంచి సంక్లిష్ట సవాళ్లు అనివార్యం. అవి మన దౌత్య దక్షతకు పరీక్షలే. ఇదలా ఉంచితే మనకు మరీ దగ్గరగాను, మరీ దూరంగాను లేని కువైత్‌తో భారత్ సంబంధాలలో ఒక సరికొత్త అధ్యాయం ప్రారంభం కావడం ముదావహం.

ఇటీవల కువైత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన చరిత్రాత్మకమైనది. భారత ప్రధానమంత్రి ఒకరు ఇందిరా గాంధీ అనంతరం ఆ గల్ఫ్ రాజ్యాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. మనస్పర్థలు, మనస్తాపాలు పూర్తిగా తొలగిపోయిన వాతావరణంలో మోదీ పర్యటన జరిగింది. దశాబ్దాలుగా కువైత్‌తో మన సంబంధాలు ఉండవలసిన రీతిలో ఉండకపోవడానికి బాధ్యత మనదే అని అంగీకరించక తప్పదు. ఇరాక్ 1990లో కువైత్‌ను దురాక్రమించినప్పుడు, న్యూఢిల్లీ కొన్ని కారణాల వల్ల కువైత్ సార్వభౌమత్వానికి మద్దతు నివ్వలేదు. ఇది కువైత్‌ను బాధించింది. కష్ట కాలంలో విరోధి ఎత్తిపొడుపుల కంటే మిత్రుడి మౌనమే ఎక్కువగా కలవరపరుస్తుంది కదా. కువైత్ సహజంగానే మన పట్ల కినుక వహించింది. అయితే భారతీయ కార్మికులు, వృత్తి నిపుణులను యథావిధిగా ఆహ్వానించినా ద్వైపాక్షిక సంబంధాలు ముక్తసరి స్థాయిలోనే ఉండిపోయాయి. ప్రపంచ ఆర్థిక శక్తిగా, భౌమ రాజకీయాలలో కీలక దేశంగా భారత్‌కు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో న్యూఢిల్లీతో సంబంధాలను పటిష్ఠం చేసుకునేందుకు కువైత్ మళ్లీ సుముఖమయింది.

కువైత్‌తో భారత్ సంబంధాలకు పురాతన చరిత్ర ఉన్నది. సింధు నాగరికతకు పూర్వం నుంచే భారత్ పశ్చిమ తీర ప్రాంతాలు, కువైత్ మధ్య వాణిజ్య సంబంధాలు ఉన్నట్లు ఇటీవలి పురావస్తు తవ్వకాలు ధ్రువీకరించాయి. ప్రాచీన కువైత్ వ్యాపారులు తమ సహజ ముత్యాలు, అరేబియన్ గుర్రాలు, బస్రా ఖర్జూరాలను తీసుకువచ్చి మన వస్త్రోత్పత్తులు, సుగంధ ద్రవ్యాలను తీసుకువెళ్లేవారు. 1929 ప్రపంచ ఆర్థిక మాంద్యం ఈ ముత్యాల వ్యాపారాన్ని చావుదెబ్బ తీసింది. ఆ తరువాత కొద్ది కాలానికే కువైత్‌లో చమురు నిక్షేపాలు వెలుగులోకి రావడంతో వాణిజ్య సంబంధాలు దాదాపుగా క్షీణించిపోయాయి. అయినప్పటికీ 1961లో బ్రిటిష్ వలసపాలన నుంచి స్వాతంత్ర్యాన్ని పొందే వరకు కువైత్‌లో భారతీయ రూపాయి ఆ దేశ అధికారిక కరెన్సీగా ఉండేది.

వాణిజ్యం, ప్రజల స్థాయిలో జీవన బంధాలు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు సుదృఢ ప్రాతిపదికలు. కువైత్ వాణిజ్య భాగస్వాములలో భారత్ అగ్రగామిగా ఉన్నది. 2023–24లో ఉభయ దేశాల మధ్య దాదాపు 1100 కోట్ల డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలోనే కువైట్ మనకు సరఫరా చేసిన క్రూడాయిల్ మన మొత్తం ఇంధన అవసరాలలో 3 శాతాన్ని తీర్చింది. కువైత్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ మన దేశంలో పరోక్షంగా 1000 కోట్ల డాలర్లకు పైగా మదుపులు చేసింది. కొవిడ్ విలయంలో కువైత్‌కు మన దేశం రెండు లక్షల వ్యాక్సిన్ డోస్‌లు సమకూర్చింది. ఆ ఆపత్సమయంలో కువైత్ మనకు 282 ఆక్సిజన్ సిలెండర్లు, 60 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, వెంటిలేటర్లు తదితర వైద్య సామగ్రిని సరఫరా చేసింది. ప్రజల స్థాయిలో సంబంధాలను చూస్తే అరకోటి కువైత్ జనాభాలో పది లక్షలమంది ప్రవాస భారతీయులే. తమ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి వారు విశేషంగా దోహదం చేస్తున్నందునే కువైట్ పాలకులు సాధారణ సమయాలలోను, ఏవైనా ఆపదలు సంభవించినప్పుడు ఈ ప్రవాసులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారు.

నాలుగు దశాబ్దాల అనంతరం తమ అతిథిగా వచ్చిన భారత ప్రధానమంత్రికి కువైట్ రాచరిక పాలకులు అపూర్వరీతిలో స్వాగతం పలికారు; అతిథి మర్యాదలు ఘనంగా చేశారు. తమ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'ను మోదీకి ప్రదానం చేశారు. 'భారత్ నుంచి కువైత్‌కు చేరేందుకు నాలుగు గంటల ప్రయాణమే అయినా (భారత) ప్రధానమంత్రికి నాలుగు దశాబ్దాలకు పైగా పట్టిందని' నరేంద్ర మోదీ తన గౌరవార్థం కువైట్ అమీర్ షేక్ మెషాల్ అల్ అహ్మద్ అల్ జాబెర్ అల్ సబాహ్ ఇచ్చిన విందు సందర్భంగా వ్యాఖ్యానించారు. భారత్ కువైత్‌ల మధ్య మోసులెత్తిన కొత్త స్నేహ సంబంధాలు సుదీర్ఘకాలం పాటు నిరంతరంగా, సుస్థిరంగా వర్థిల్లాలని భారతీయులూ, కువైతీలూ ఆకాంక్షిస్తున్నారనడంలో సందేహం లేదు.

ఆరు దశాబ్దాల శ్యామ్ బెనెగల్ సృజనాత్మక జగత్తును గమనించినప్పుడు ఆయనను ఒక శైలికో, ఒక మూసకో, బండ సైద్ధాంతిక కట్టుబాట్లకో పరిమితం చేసి చూడటం ఏ మాత్రం వీలు కాదు. దానికి కారణం– చివరి శ్వాస దాకా భూమ్మీద ఉన్న ప్రతి విషయం మీద ఆయనకున్న తీవ్ర జిజ్ఞాస, కొత్త పరిణామాలను ఆహ్వానించే సహృదయ దృష్టి.

'భారత్' బెనెగల్

అది 1975–77ల సమయం. ఎమర్జెన్సీ పేరిట అంతవరకూ అనుభవంలో లేని మాంఛి దమన వ్యవస్థ చక్కగా రాజ్యమేలుతున్న కాలంలో 'అంకుర్', 'నిశాంత్' సినిమాలను, తొలి యవ్వనంలో, వెండి తెరపై చూసిన అనుభవం. ఫ్యూడల్ దోపిడీ వ్యవస్థను ఎదిరిస్తూ తిరుగుబాటు అంకురార్పితమై ('అంకుర్'లో), ఆ తిరుగుబాటు తీవ్ర స్థాయికెదిగి సంకెళ్లను తెంపి పారేయగలగడం ('నిశాంత్'లో) ఇతివృత్తంగా సాగే ఈ రెండు చిత్రాల్లో కనిపించిన తెలంగాణ సామాజిక వాస్తవ జీవనం, భౌగోళిక ప్రాకృతిక దృశ్యాల చిత్రీకరణ, నటీనటుల అద్భుతమైన నటన, గొప్ప సాంకేతిక విలువలు– మన గురించిన సినిమా ఇలా ఉండడం సాధ్యమేనా అని అచ్చెరువును కలిగించాయి.

ఎవరీ శ్యామ్ బెనెగల్, మన నేపథ్యంతో, మన జీవితాల గురించి ఇంత బలంగా ఎక్కడి నుంచి వస్తున్నాయి ఈ హిందీ సినిమాలు. మనసును తొలిచేసే ఈ కళాత్మకత, ఈ జీవన పరిశీలనం ఏమిటి, ఈ చిక్కని కథా సంవిధానం ఏమిటి అని ఆశ్చర్యం నుంచి బయటపడి కుదురుగా అతగాణ్ణి అర్థం చేసుకోవడానికి చాలా రోజులు పట్టింది. 1981 లోగా 'మంథన్', 'భూమిక', 'కోండురా/అనుగ్రహం', 'జునూన్', 'కల్ యుగ్' వంటి చిత్రాలు వచ్చేస్తూ ఉంటే, ఈ మహాశయుడు తొలి దృశ్యం నుంచి చివరి వరకు ప్రేక్షకుణ్ణి ఎలా కట్టివేస్తున్నాడు, ఎన్ని కొత్త పోకడలు పోతున్నాడు; వేరు వేరు ప్రాంతాల్లో, కాలాల్లో అక్కడి సామాజిక, సాంస్కృతిక వాతావరణంలో లీనమై, ఆ స్థానికతను ఇంత చక్కగా, ఒక్కొక్క చిత్రం ఒక్కొక్క శైలిలో ఎలా తెరమీద ఆవిష్కరించేస్తున్నాడు; ఎన్నెన్ని కోణాల నుంచి జీవితాన్ని, సమాజాన్ని, వ్యక్తులను పరిశీలించి ఆ వైవిధ్యాన్ని చూపిస్తున్నాడు అని మరింత ఆశ్చర్యపోవడం మిగిలింది.



దాదాపు మూడు దశాబ్దాల పాటు భారతీయ సినీరంగాన్ని, ముఖ్యంగా హిందీ సినీరంగాన్ని ఈ దేశపు అనేకానేక స్థానికతల వైవిధ్యంతో రంగరించి ఆయన ప్రభావితం చేసిన తీరు అసమానమైనది, శాశ్వతంగా నిలిచిపోయేది.

వ్యాపారాత్మక హిందీ సినిమాలకు ఎదురుగా ధైర్యంగా నిలబడి, మీ గోల మీది, మీతో మాకు గొడవలేదు కాని ఇలా సినిమా తీసి చూపిస్తాము, విజ్ఞత కలిగిన ప్రేక్షకుల మన్ననలు పొందుతాం, జాతీయ అంతర్జాతీయ అవార్డులు, ఖ్యాతి గెలుచుకుంటాం అని ఆర్ట్ (కళాత్మక)/ప్యారలల్/న్యూ వేవ్ సినిమాకు ఒక దృఢమైన స్థావరాన్ని ఏర్పరచగలిగాడు శ్యామ్ బెనెగల్. ఇటువంటి దర్శకుడు హైదరాబాదులో పెరిగి, చదువుకొని, ఇక్కడి మిశ్రమ సంస్కృతిని బాగా ఒంటపట్టించుకున్నాడు. తెలంగాణ, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ నేపథ్యంగా ఐదు సినిమాలు ('అంకుర్', 'నిశాంత్', 'కోండురా/అనుగ్రహం', 'మండి', 'సుస్మన్'), ఒక టెలివిజన్ సీరియల్ ('అమరావతి కథలు') హిందీలో తీయడం గొప్ప విశేషం.

ఒక మరాఠీ నవల కథను తెలుగు నేపథ్యంలో, వాణిశ్రీ నాయికగా, విశాఖపట్నం దగ్గర తీసిన 'కోండురా' (తెలుగులో 'అనుగ్రహం') దైవిక విశ్వాసాలు సమాజంలో పనిచేసే తీరు గురించి ఇప్పటికీ ప్రేక్షకులకు సవాలుగా నిలిచే సంక్లిష్ట చిత్రం. ఇక మిగతా నాలుగు చిత్రాల గురించి... తెలంగాణ, హైదరాబాదు నేపథ్యంగా వచ్చిన సినిమాల్లో ఇవే ఇప్పటికీ ఉత్తమమైనవని చెప్పడం ఏ మాత్రం సత్య దూరం కాదు. బెనెగల్ దర్శకత్వం వహించిన 24 ఫీచర్ నిడివి గల చలనచిత్రాల్లో గొప్ప కళాత్మక చిత్రాలుగా చిరకాలం నిలిచిపోయే వాటిలో 'నిశాంత్', 'భూమిక', 'జునూన్', 'కల్ యుగ్', 'మండీ, 'త్రికాల్', 'సూరజ్ కా సాత్వాన్ ఘోడా'లను నిశ్చయంగా చెప్పుకోవచ్చు.

ఆయన తీసిన ఫీచర్ చిత్రాలన్నీ ఒక ఎత్తైతే, దాదాపు నాలుగు సంవత్సరాల కాలం వెచ్చించి విస్తృతమైన పరిశోధనల అనంతరం, ఒక ఏడాది పాటు నిర్మించి దూరదర్శన్ కోసం తీసిన 53 భాగాల 'భారత్ ఏక్ ఖోజ్', బృహత్తర చిత్రమాలిక ఒక ఎత్తు. జవహర్‌లాల్ నెహ్రూ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' పుస్తకం ఆధారంగా, పలు తావుల్లో దానిని దాటిపోతూ, 5000 సంవత్సరాల భారత ఉపఖండ చరిత్రను, బౌద్ధిక, సాంస్కృతిక, కళా వారసత్వాన్ని పరమాద్భుతంగా, విశ్లేషణాత్మకంగా, ధైర్యంగా 53 భాగాలను ఆవిష్కరించారు. నవంబర్ 1988 నుంచి నవంబర్ 1989 దాకా వారం వారం వాటిని చూస్తూ భారతీయ టెలివిజన్ ప్రేక్షకులు కనువిప్పుతో కూడిన గొప్ప మైమరపునకు గురయ్యారు. జీవితంలో ఒక్కసారే ఇటువంటి పనిని చేపట్టడానికి వీలవుతుంది. ఒక అద్భుత సాహస యాత్ర లాంటిది వ్యక్తిగతంగా నాకు 'భారత్ ఏక్ ఖోజ్' అని 1997లో హైదరాబాద్ ఆకాశవాణికి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో బెనెగల్ చెప్పారు.

'ఏమి ఈ నా భారత్?' – ప్రతి తరంలోనూ ప్రతి భారతీయుడు ఎదుర్కొనే, ఓ మాటున ఏ మాటునా తెగని ప్రశ్న ఇది. ఆ ప్రశ్నతో మల్లగుల్లాలు పడుతూ జీవితకాలం నిలిచిపోయే అనుభవాన్ని పొందడానికి 'భారత్ ఏక్ ఖోజ్' 53 భాగాలు ఎప్పుడూ పనికివస్తాయి. అంత విలువైన కార్యక్రమాలు అవి. ఆయన మిగతా చిత్రాలను ఈ దృష్టితోనే చూడాలేమో!

ఆరు దశాబ్దాల శ్యామ్ బెనెగల్ సృజనాత్మక జగత్తును గమనించినప్పుడు ఆయనను ఒక శైలికో, ఒక మూసకో, బండ సైద్ధాంతిక కట్టుబాట్లకో పరిమితం చేసి చూడటం ఏ మాత్రం వీలు కాదు. దానికి కారణం చివరి శ్వాస దాకా భూమ్మీద ఉన్న ప్రతి విషయం మీద ఆయనకున్న తీవ్ర జిజ్ఞాస, కొత్త పరిణామాలను ఆహ్వానించే సహృదయ దృష్టి లాంటివి. అంతేగాక ఒక గొప్ప సినీ దర్శకుడికి ఉండాల్సినవన్నీ– సృజనాత్మక ధైర్యం, కళాత్మక సమన్వయ శక్తి, అనేకమంది ప్రతిభావంతులను కలుపుకొని వెంట తీసుకువెళ్లే సామర్థ్యం, ఒక కొలిక్కి వచ్చేదాకా ఈ మొత్తం సంక్లిష్ట వ్యవహారాన్ని నడిపి ముగించడం– ఆయనకు ఉన్నాయి. అందువల్లే 1970ల నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు భారతీయ సినీరంగాన్ని, ముఖ్యంగా హిందీ సినీరంగాన్ని ఈ దేశపు అనేకానేక స్థానికతల వైవిధ్యంతో రంగరించి ఆయన ప్రభావితం చేసిన తీరు అసమానమైనది, శాశ్వతంగా నిలిచిపోయేది. అనేక కారణాల వల్ల, జీవితం చివరి రెండు దశాబ్దాల్లో ఆయన తీసిన చాలా చిత్రాల్లో ఆ గొప్పతనం లోపించింది. కళాకారుల జీవితాల్లో ఇటువంటివి సాధారణమే!

○ సుమనస్పతి

అందరూ అంబేడ్కర్ ఆరాధకులే!

డిసెంబరు 17న రాజ్యసభలో హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెసుని ఎద్దేవా చేస్తూ, "అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్' అనడం ఇప్పుడు కొందరికి ఒక ఫ్యాషన్ అయింది. అదే, దేవుడి పేరుని అన్నిసార్లు పలికితే, ఏడు జన్మలవరకూ ('సాత్ జనమ్ తక్') వాళ్ళకు స్వర్గం దొరుకుతుంది" అన్నాడు! దానికి నిరసనగా ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, "అమిత్ షా, అంబేడ్కర్‌ని ('అంబేడ్కర్ ఏమన్నా దేవుడా, అన్నిసార్లు అనడానికి?' అనే అర్థంతో) అవమానించాడు కాబట్టి, ఆయన క్షమాపణ చెప్పాలి! అమిత్ షా, మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలి! ప్రధానమంత్రి ఆయన్ని మంత్రిగా తీసివెయ్యాలి!" అని ప్రదర్శనలు చేశారు. కాంగ్రెసు వారి నిరసనలకి వ్యతిరేకంగా, బీజేపీ ఎంపీలు కూడా పోటీ ప్రదర్శనలు చేశారు. ఈ రెండు పార్టీలూ, వాటి మిత్రపక్షాలూ చేసిన, చేస్తున్న వాదనలు ఇలా ఉన్నాయి:

"అంబేడ్కరు రాజ్యాంగశిల్పి! ఆయన్ని మీరు (బీజేపీ) అవమానించారు. అసలు మీకు రాజ్యాంగం మీద నమ్మకమే లేదు. మీ నమ్మకమంతా మనుస్మృతి మీదే! ఆ మనుస్మృతి పుస్తకాన్ని అంబేడ్కరు, 1927 డిసెంబరు 20న తగలపెట్టేశాడు. 1949 డిసెంబరులో, మీ ఆరెస్సెస్ వాళ్ళూ, హిందూమహాసభ వాళ్ళూ, అంబేడ్కరు దిష్టిబొమ్మని తగలబెట్టారు. అంబేడ్కరు రాసిన రాజ్యాంగం అంతా విదేశీయమైనదని దాన్ని ఖండించారు. మీ పదేళ్ళ పాలనలో, ఎస్సీల మీదా, ఎస్టీల మీదా 30 వేల, 4 వందల దాడులు జరిగాయి. అంబేడ్కర్ పెట్టిన రిజర్వేషన్లని క్రమంగా రద్దు చెయ్యాలని కుట్ర పన్నుతున్నారు." ఈ రకంగా సాగింది కాంగ్రెస్ వాదన!

"అంబేడ్కర్‌ని కాంగ్రెస్ గతంలో రెండుసార్లు ఎన్నికల్లో ఓడించింది. 'భారత రత్న' లాంటి అత్యున్నత బిరుదుల్ని మీ కుటుంబ సభ్యులకే మీరే ఇచ్చుకున్నారు గానీ, మహా మేధావి అయిన అంబేడ్కరుకి ఇవ్వలేదు. 1990లో, వీపీ సింగ్ ప్రభుత్వం మా పార్టీ మద్దతుతో నడుస్తూ, ఆ గొప్ప బిరుదుని అంబేడ్కరుకి ఇచ్చింది. అప్పట్లో, కర్ణాటకలో ఐదేళ్ళపాటు జరిగిన మీ పాలనలో ఎస్సీ, ఎస్టీల మీద దాదాపు తొమ్మిదివేల దాడులు జరిగాయి. 1940లో అంబేడ్కరు, పాకిస్తాన్ గురించి రాస్తూ, 'ఇస్లాం మతం– మనుషుల్ని ముస్లింలుగానూ, ముస్లింలు కాని వారుగానూ విభజిస్తుంది' అని విమర్శించాడు. మీరేమో, ఓట్ల కోసం మమ్మల్ని మతతత్వవాదులుగా విమర్శిస్తూ, హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలను బుజ్జగిస్తున్నారు. 1939లో అంబేడ్కరు, ఆరెస్సెస్ ఆఫీసుని సందర్శించి, వారి శాఖల్లో, కుల వివక్షలేదని గమనించి ప్రశంసించాడు." ఇది బీజేపీ వాదం!

ఈ రకంగా, రెండు ప్రధాన పార్టీల కూటములూ పరస్పరం– అంబేడ్కరుని మీరు అవమానించారంటే.. కాదు మీరు అవమానించారని, ఒకరినొకరు పరుషపదాలతో వాదులాడుకున్నారు. ఇంగ్లీషూ, హిందీ టీవీల డిబేట్లలో, రెండు కూటముల మేధావి సమర్థకులు కూడా గొంతులు చించుకుని, 'అంబేడ్కర్ ఆశయాలను ఆచరించేది మేమంటే, మేము' అని పోటీలు పడి చెప్పుకున్నారు. కానీ, కొన్ని వాదనలకు ఇరు పక్షాలూ జవాబులు చెప్పలేకపోతున్నాయి. అయినా, కొన్నిటికి చరిత్రనించీ ఆధారాలను చూపుతున్నారు. ఉదాహరణకి, 1949 సెప్టెంబరు 7న, తనని కలిసిన ఆనాటి ఆరెస్సెస్ అగ్రనాయకుడైన గురు గోల్వాల్కర్‌తో అంబేడ్కరు ఏమన్నాడో కాంగ్రెస్ సమర్థకులు ఆ మాటల్ని కోట్ చేశారు. "ఆరెస్సెస్ ఒక విషవృక్షం లాంటిది. అది పీష్వాల పాలనని కలగంటున్నది! నేను దానితో ఉండడం సాధ్యం కాదు" అని అంబేడ్కరు అన్నాడని పాత పుస్తకాల నుంచీ, బీజేపీ వ్యతిరేకులు రుజువు చూపుతున్నారు!



ఏ సమాజంలో అయినా, పాలిత వర్గం నించీ వచ్చి పోరాడే అంబేడ్కర్ లాంటి సంస్కర్తల్ని, పాలక వర్గాలు తమలో ఇముడ్చుకోవడానికి ప్రయత్నిస్తాయి. ఎందుకంటే, అణచివేతకి గురయ్యే ప్రజల ప్రయోజనాలు కాపాడే మేధావికి, పాలకవర్గాలు ఒక ఉన్నత స్థానమూ, గౌరవమూ ఇచ్చినప్పుడు, ప్రజలు ఆ పాలకుల మీద కొన్ని భ్రమలతో ఉంటారు. ప్రజలు ఎంత కాలం భ్రమలలో ఉంటే అంత కాలం పాలన సాఫీగా సాగుతుంది. అందుకే, పాలకవర్గ పార్టీలు పోటీలు పడి మరీ అంబేడ్కర్‌ని పొగుడుతాయి.

కొందరు కొన్నిటికి ఏ ఆధారాలూ చూపకుండా మాట్లాడుతున్నారు. ఆరెస్సెస్‌లో, కుల వివక్ష లేదని అంబేడ్కర్ మెచ్చుకున్నాడనే దానికి, బీజేపీ సమర్థకులు తారీకులూ దస్తావేజులూ చూపలేదు! రెండు పార్టీలూ చేసిన వాదనలలోనూ, కొన్నిటిని చెప్పి, కొన్నిటిని మరుగుపరిచే చేసిన వాదనలు కూడా ఉన్నాయి. ఉదాహరణకి, 'పాకిస్తాన్ లేదా దేశ విభజన' అనే పుస్తకంలో (సంపుటి–8, పేజీ–358), అంబేడ్కరు ఇస్లాం గురించి చేసిన విమర్శ గురించి మాత్రమే మాట్లాడి, అదే పుస్తకంలో అంబేడ్కరు హిందూ మతం గురించి విమర్శ చేసినా, దాని గురించి బీజేపీ వారు మాట్లాడడం లేదట! ఇది, కాంగ్రెస్ వారి విమర్శ.

"హిందువులు ఏమన్నా చెప్పనీ, హిందూ మతం అనేది స్వేచ్ఛా, సమానత్వమూ, సోదరభావమూ అనే వాటికి వ్యతిరేకమైనదే. ఆ రకంగా, అది ప్రజాస్వామ్యంతో పొసగదు (ఇన్ కంపాటిబుల్)" – ఈ మాటలు అంబేడ్కరు అన్నాడని బీజేపీ వ్యతిరేకులు చూపే రుజువులు.

ఈ కూటములు రెండింటిలోనూ, అంబేడ్కర్ పట్ల చూపే ఆరాధనాభావం గురించి రకరకాల వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి. ఆ రెండు పార్టీల ఆరాధనా ప్రకటనలూ నిజం కావనీ, ఏ రాజకీయ పక్షమూ, ఆయన ఆశయాల ప్రకారం నడవడం లేదని, కొందరు మేధావుల అభిప్రాయం. రెండు పార్టీలూ కూడా, రాజకీయ అవకాశవాదాలతో ఉన్నాయని కూడా ఆ మేధావుల అభిప్రాయం. దళిత ఓటర్లకి ఆరాధ్యదైవమైనవాడిగా ఉన్న అంబేడ్కర్‌ని స్వంతం చేసుకుంటే, దాని వల్ల దళిత ఓట్లన్నీ ఎక్కువ శాతం తమకు పడతాయనేది పార్టీలకు తక్షణ ఎత్తుగడ అని మరో అభిప్రాయం.

ఇక్కడ ఎవరికైనా ఒక ప్రశ్న వస్తుంది. రావాలి. అధికారం కోసం తీవ్ర ఘర్షణపడే రెండు పార్టీలు, ఒకే వ్యక్తిని 'నా వాడు' అంటే, 'నా వాడు' అని పోటీలు పడి చెప్పుకుంటున్నారంటే, దానికి అర్థం ఏమిటై ఉంటుంది? ఆ వ్యక్తికి ఉన్న భావజాలంలో ఏదో ఒక అంశమో, కొన్ని అంశాలో, ఇరుపక్షాలకూ అవసరమైనవై, అంగీకారమై ఉండివుంటాయి. ఉదాహరణకి– ఈ విషయంలో కాంగ్రెస్ సంగతి చూద్దాం. 1945 జూన్‌లో అంబేడ్కరు ఒక పెద్ద పుస్తకం రాశారు. ఏమనీ? "కాంగ్రెస్సూ, గాంధీ, అస్పృశ్యులకు ఏమి చేశారు?" అని అద్భుతంగా విమర్శిస్తూ రాశారు అంబేడ్కరు. అది రాసిన రెండేళ్లకే అంబేడ్కరుని గాంధీ సలహా మీద నెహ్రూ ఆహ్వానించగా, అప్పటిదాకా తను కాంగ్రెస్ మీద చేసిన విమర్శని పక్కన పెట్టి అంబేడ్కర్, కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా చేరారు. చేరిన కొన్ని వారాలకే, కొత్త రాజ్యాంగం రాయడానికి ఏర్పాటుచేసిన కమిటీకి చైర్మన్‌గా కూడా అయ్యారు. చైర్మన్ హోదాలో 25–11–1949న కాంగ్రెస్ పార్టీని అంబేడ్కర్ ఇలా పొగిడారు.. "ఈ రాజ్యాంగం పని ఎటువంటి గందరగోళానికీ ఆస్కారం లేకుండా ఒక పద్ధతిలో, ఒక క్రమశిక్షణతో నడవడానికి, రాజ్యాంగ సభలో కాంగ్రెస్ పార్టీ ఉండడమే కారణం. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ వల్లనే, రాజ్యాంగంలో ప్రతీ అధికరణమూ ఎలా ఉంటుందో, ప్రతీ సవరణా ఎలా జరుగుతుందో ఖచ్చితంగా తెలిసేలాగ, డ్రాఫ్టింగ్ కమిటీ ఈ రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టగలిగింది. కాబట్టి, రాజ్యాంగం డ్రాఫ్టు, ఎటువంటి ఆటంకాలూ లేకుండా రావడానికి ఖ్యాతి అంతా కాంగ్రెస్ పార్టీకే చెందుతుంది." ఇంతలా తమ పార్టీని ప్రశంసించిన అంబేడ్కర్‌ని, కాంగ్రెస్ వారు స్వంతం చేసుకున్నారు. తమతో విభేదించి, నాలుగేళ్ళ తర్వాత వెళ్ళిపోయినా అంబేడ్కర్‌ని, 'రాజ్యాంగ శిల్పి' అని పిలుచుకుంటూనే ఉన్నారు! ఆయనకి 'భారత రత్న' ఎందుకు ఇవ్వలేదో మాత్రం చెప్పరు.

ఇకపోతే, బీజేపీకి అంబేడ్కరంటే ఇష్టం ఎందుకు? హిందూ మతం మీద అంబేడ్కర్ తీవ్రమైన విమర్శలు చేసినప్పటికీ, బౌద్ధమతంలోకి మారినప్పటికీ, కాంగ్రెస్‌తో నాలుగేళ్ళ సంబంధాన్ని తెంచేసుకున్నందుకు బీజేపీకి అంబేడ్కరంటే ఆరాధన.

రెండు పక్షాలూ కూడా రాజ్యాంగం మీద ప్రమాణం చేసేవే కాబట్టి, ఆ రాజ్యాంగాన్ని తయారు చేసిన కమిటీకి చైర్మన్ అయిన అంబేడ్కర్‌ని, లోపల ఎలా వున్నా, నాలిక చివరినించైనా కీర్తిస్తాయి. ఆ రాజ్యాంగం, ప్రధానంగా సంపన్న వర్గాల ప్రయోజనాలను కాపాడేది. ఈ రెండు రాజకీయ పక్షాలేమో, ఆ సంపన్న వర్గాల పక్షాన నిలిచేవే! అట్లాంటి రాజ్యాంగం తయారై, 75 ఏళ్ళు కావచ్చింది కాబట్టి, ఆ సందర్భం పేరుతో, పార్లమెంటులో ఉపన్యాసాల పరంపర సాగింది. ఆ పరంపరలో అంబేడ్కర్‌ని కీర్తించడంతో పాటు, తమ వ్యతిరేక పార్టీని దూషించడం చేశాయి ఆ పార్టీలు.

నిచ్చెన మెట్ల సమాజంలో, శారీరక శ్రమలు చేసే అట్టడుగు కులానికి చెందిన కుటుంబం నించీ, అనేక కష్టాలు పడి, ఉన్నత స్థాయి మేధాశ్రమలు చేసే స్థితికి వచ్చిన ఆనాటి అతి కొద్దిమంది వ్యక్తుల్లో అంబేడ్కరు ఒక ప్రముఖుడు. అనేక సంవత్సరాలు అంటరానికులాల వారి కోసం పాటుబడిన సంస్కర్త ఆయన. ఏ సమాజంలో అయినా, పాలిత వర్గం నించీ వచ్చి పోరాడే ఇలాంటి సంస్కర్తల్ని, పాలక వర్గాలు తమలో ఇముడ్చుకోవడానికి ప్రయత్నిస్తాయి. ఎందుకంటే, అణచివేతకి గురయ్యే ప్రజల ప్రయోజనాలు కాపాడే మేధావికి, పాలకవర్గాలు ఒక ఉన్నత స్థానమూ, గౌరవమూ ఇచ్చినప్పుడు, ప్రజలు ఆ పాలకుల మీద కొన్ని భ్రమలతో ఉంటారు. ప్రజలు ఎంత కాలం భ్రమలలో ఉంటే అంత కాలమూ పాలన సాఫీగా సాగుతుంది. అందుకే, పాలకవర్గ పార్టీలు పోటీలు పడి మరీ అంబేడ్కర్‌ని పొగుడుతాయి. అవి కేవలం పొగడ్తలు మాత్రమే! కుల విధానానికి వ్యతిరేకమైన దృష్టితో మాత్రం కాదు. తమకు అనుకూలమైన రాజ్యాంగం తయారీలో పాల్గొన్నందుకు! ("పాలకవర్గం, పాలిత వర్గపు మేధావుల్ని ఎంత ఎక్కువగానైతే తనలో ఇముడ్చుకుంటుందో, అంత స్థిరంగానూ, అంత ప్రమాదకరంగానూ, దాని పాలన తయారవుతుంది" – 'కాపిటల్'లో, మార్క్సు)

▪ నౌరోజీ

తీరానికి కాలు చాపే ఉన్నాం!

సాగర తీరం చూసినప్పుడల్లా
నీ గాయాలు తడుముతూనే ఉన్నాయి
కెరటాలు ఎగసినప్పుడల్లా
నీ జ్ఞాపకాలు తరుముతూనే ఉన్నాయి

నువ్వు ముప్పేట విరుచుకుపడి
రెండు పదులు దాటొచ్చిందేమోగానీ
అప్పటి నీ జ్ఞాపకాలింకా
గుండె గదుల్లో తాజాగానే ఉన్నాయి

ఎక్కడో దూరాన, సుమత్రా దీవుల్లో
భూమి పొరల్లోంచి మొదలైన నీ దాహార్తికి
సముద్రాన్నే మా మీదకు తరుముకొచ్చి
ఊడ్చుకుపోయింది అంతా ఇంతా కాదు

కట్టు బట్టలతో మిగులున్నా
కూడబెట్టుకోయిందురేమో
కొన ఊపిరితో మిగులున్నా
లేచి ఉసురుకోయిందురేమో

కడుపులో దాచుకున్న కాఠిన్యం ఏదో
కుండ బద్దలు కొట్టినట్టు
ఒక్క ఉదుటున లక్షలాది మందిని
పొట్టన పెట్టుకోవడం నీకే సాధ్యమైంది

నీ మనసు బోదైపోయాక...
ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేపల్లా
ఎవరివారో, ఎక్కడెక్కడివారో
తీరం పొడుగునా, రుణం తీరినోళ్లే

నీవు వదిలి వెళ్ళిన భయమేదో
నీడలా వెంటాడుతూనే ఉంది
బ్రతుకు పోరు ఊగిసలాటలో
తీరం, తనవైపు లాగుతూనూ ఉంది

తీరం బతుకులంటేనే.. తీరిన బతుకుల్లా!
ఒడ్డును నమ్ముకొనే బతుకును నెట్టుకొస్తూ
చావు బ్రతుకుకూ మధ్య, కాటికి కాదు..
తీరానికి కాలు చాపే ఉన్నాం!

– వినోద్ కుత్తుం

('సునామీ' విషాదానికి నేటితో ఇరవయ్యేళ్ళు)

రాజకీయాలకు అతీతం ఈ 'విజన్'

ఆనాడు విజన్ 2020 అంటే దానిని '420' అని హేళన చేశారు. 'కంప్యూటర్‌లు కూడు పెడతాయా' అని నిందించారు. తెలుగు వారిని సింగపూర్ స్థాయికి పెంచటం పగటి కల అని ఎద్దేవా చేశారు. ప్రపంచ బ్యాంక్ నిర్దేశానుసారం దోపిడీకి విసిరిన వలే విజన్ 2020 అని దురుద్దేశాలు ఆపాదించారు. ఇవన్నీ నిందలేనని చరిత్ర రుజువు చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పల్లె, ప్రతి పట్టణం నుండి 30 లక్షల మంది పేద, మధ్యతరగతి యువత సైబరాబాద్‌లో ఉద్యోగాలు, ఉపాధి పొందారు. ప్రతి నలుగురు ప్రవాస భారతీయుల్లో ఒకరు తెలుగువారున్నారు. విదేశాల్లోని ఏపీ రైతు బిడ్డలు, కూలీల బిడ్డలు అక్కడ సంపాదించిన డబ్బులు ఇక్కడికి పంపిస్తుంటే వారి తల్లిదండ్రులు ఇక్కడ భూములు కొంటున్నారు. 1996కు పూర్వం ఐటీ ఎగుమతులు 5వేల కోట్లు మాత్రమే ఉండగా, 2023–24లో సైబరాబాద్ నుండి 2.70 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయి. తెలంగాణ ప్రభుత్వ ఆదాయంలో 60 శాతం హైదరాబాద్ నుండే వస్తోంది. ఈ ఆదాయంతోనే తెలంగాణలోని అన్ని జిల్లాల అభివృద్ధికీ నిధులు ఇవ్వగలుగుతున్నారు. విజన్ 2020 వల్ల అమెరికాలోని తెలుగువారి తలసరి ఆదాయం లక్షా 20 వేల డాలర్లుగా ఉంది. మరి స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా తలసరి ఆదాయం రానున్న 23 ఏళ్లల్లో 42 వేల డాలర్లు, అంటే రూ.35 లక్షలు, ఎందుకు కాదు?

2004లో చంద్రబాబు ప్రభుత్వం కొనసాగి ఉంటే ఉమ్మడి రాష్ట్రంలోని 294 నియోజకవర్గ కేంద్రాలు 294 మినీ సైబరాబాద్‌లయ్యేవి. 2019లో నైనా చంద్రబాబు ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం, నదుల అనుసంధానం పూర్తయి ఆంధ్రప్రదేశ్ కరవు రహిత రాష్ట్రమై ఉండేది. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారం కావాలంటే, అందుకు రాజకీయ స్వార్థం కోసం వైసీపీ చేసే దుష్ప్రచారాలకు లోను కాకుండా ఇప్పటి నుంచైనా ప్రజలు ప్రభుత్వ సుస్థిరత గురించి ఆలోచించాలి. స్వర్ణాంధ్రను సాకారం చేసుకోవాలి.

నేటి విద్యుత్ వెలుగులు విజన్ 2020, విజన్ 2029 ఫలితాలే. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడక ముందు రాష్ట్రం కరెంటు కోతలతో ఇబ్బంది పడేది. 1947 నుండి 1996 వరకు 49 ఏళ్లలో రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కేవలం 5వేల మెగావాట్లు మాత్రమే. మొదటి దశ విద్యుత్ సంస్కరణలతో 2004 నాటికి చంద్రబాబు అదనంగా మరో 5వేల మెగావాట్లు ఉత్పత్తి చేశారు. ఇది రైతుల మోటార్లకు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి ఉపయోగపడింది. 2014–19 మధ్య రెండో దశ విద్యుత్ సంస్కరణల ద్వారా చంద్రబాబు ప్రభుత్వం మరో 10 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంట్లు స్థాపించింది. ఇది రాష్ట్రంలో మిగులు విద్యుత్‌ను సృష్టించింది. దీంతో విద్యుత్ కోతలు నివారించడమైంది.

విజన్ 2020 విద్యా వికాసానికి దారులు పరిచింది. కిలోమీటర్‌కు ఒక ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్లకు ఒక ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్లకు ఒక ఉన్నత పాఠశాల, మండలానికొక ఇంటర్మీడియట్ కాలేజి, రెవెన్యూ డివిజన్‌కు ఒక ఇంజనీరింగ్ కాలేజి, జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని స్థాపించి చంద్రన్న విద్యా విప్లవం తెచ్చారు. 38వేల పాఠశాలలు నిర్మించి 2.32 లక్షల ఉపాధ్యాయులను నియమించారు. జగన్ ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. నేడు నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ నియామకాలు చేయడానికి చర్యలు చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు 54 ఇంజనీరింగ్, 22 మెడికల్ కాలేజీలు, 38 పాలిటెక్నిక్, 14 బి-ఫార్మసీ, 19 ఎంసీఏ, 97 ఎంబీఏ, 1012 జూనియర్ కాలేజీలు, 395 డిగ్రీ కాలేజీలు, 11 డైట్ కాలేజీలు స్థాపించారు.



2004లో చంద్రబాబు ప్రభుత్వం కొనసాగి ఉంటే ఉమ్మడి రాష్ట్రంలోని 294 నియోజకవర్గ కేంద్రాలు 294 మినీ సైబరాబాద్‌లయ్యేవి. 2019లో నైనా చంద్రబాబు ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం, నదుల అనుసంధానం పూర్తయి ఆంధ్రప్రదేశ్ కరవురహిత రాష్ట్రమై ఉండేది. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారం కావాలంటే, అందుకు రాజకీయ స్వార్థం కోసం వైసీపీ చేసే దుష్ప్రచారాలకు లోను కాకుండా ఇప్పటి నుంచైనా ప్రజలు ప్రభుత్వ సుస్థిరత గురించి ఆలోచించాలి.

అందువల్లనే నేడు ప్రతి నలుగురు ఎన్నారైలలో ఒకరు తెలుగువారు ఉన్నారు. నవ్యాంధ్రలో IIT, IISER, AIIMS, NIIT, IIM, IIIT, Central University లాంటి 19 ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి విద్యా సంస్థలు స్థాపించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు 68 నుండి 392కి పెంచారు. నీతిఆయోగ్ నివేదిక ప్రకారం నాణ్యమైన విద్యలో ఏపీని మూడవ స్థానంలో నిలిపింది చంద్రన్న. దీన్ని 19వ స్థానానికి దిగజార్చింది జగన్‌రెడ్డి.

కోటి 11 లక్షల మంది సభ్యులతో ఏపీ డ్వాక్రా వ్యవస్థను దేశంలో మొదటి స్థానంలో తీర్చిదిద్దారు చంద్రబాబు. 18 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మొదటి స్థానం దక్కింది. 60 వేల కోట్ల బ్యాంకు రుణాలు పొందడంలో మన మహిళలు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు పెంచారు. ఆర్టీసీ కండక్టర్లుగా, మహిళా పోలీస్‌లుగా నియామకాలు చేశారు. సాఫ్ట్‌వేర్ రంగంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఉన్నారంటే దానికి కారణం చంద్రన్నే.

'2047 నాటికి రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం రంగుల కల' అని పిడివాదులు నిరాశావాదపు రాతలు రాస్తున్నారు. 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 5.13 లక్షల ఉద్యోగాలు కల్పించిందని నాటి పరిశ్రమల శాఖా మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి శాసనమండలికి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కరువు సీమ అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమ ద్వారా 4 లక్షలకు పైగా కార్లు తయారీతో 18 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించారు. ఆ పరిశ్రమ చుట్టూ 50 కిలోమీటర్ల పరిధిలో రైతుల భూముల విలువ భారీగా పెరిగిన అనుభవం మన ముందున్నది. కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో 50కి పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు రూ.4.60 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రంలో పెట్టడానికి ముందుకొచ్చాయి. ఈ పరిశ్రమల ద్వారా 5 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయి. అమరావతిలో 125 కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ప్రయివేటు వర్సిటీలు నిర్మాణాలకు ముందుకు వచ్చాయి. కర్నూలు జిల్లా ఓర్వకల్, కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక వాడల్లో 25వేల కోట్ల పెట్టుబడులతో 75వేల మందికి ఉద్యోగాలు కల్పనకు కేంద్రం ఆమోదం సాధించారు. విశాఖకు టీసీఎస్ వచ్చి 10 వేల ఉద్యోగాలిస్తున్నది. రామాయపట్నానికి రూ.60వేల కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ వస్తున్నది. ఈ వాస్తవాలు పరిశీలిస్తే ఇప్పటి నుండి ఏడాదికి రూ.2 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చినా 2047 నాటికి అంటే రానున్న 23 ఏళ్లలో రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం సాధ్యమే. అది రంగుల కల కాదు. పెద్ద పెద్ద కలలు కని, కష్టపడకపోతే ప్రగతి ఎలా సాధ్యం?

విజన్ 2020 సమయంలో వ్యవసాయం దండగ అన్నారని నీలి మీడియా చంద్రబాబుపై నిరాధార నింద మోపుతున్నది. రాబోయే ఐదేళ్లలో సగటున 11.05 శాతం చొప్పున వ్యవసాయ వృద్ధి రేటు సాధించాలని, దీనికి సుమారు రూ.5.85 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాలని, మొత్తం వ్యవసాయ భూమిలో 47 శాతం ప్రకృతి వ్యవసాయం క్రిందకు మార్చాలని విజన్ 2047లో పేర్కొన్న లక్ష్యాలు సాధించలేరని వైసీపీ ప్రభావిత మేధావులు రాస్తున్నారు. పిడివాదులు కూడ దీన్నే సమర్థిస్తున్నారు. వీరు అభివృద్ధి నిరోధక ఫ్యూడల్ వ్యవసాయమే ఉండాలని కోరుకుంటున్నారా? ఫ్యూడల్ వ్యవసాయ వ్యవస్థ కన్నా పెట్టుబడిదారి వ్యవసాయ విధానాలే ప్రగతిదాయకమన్నది నిజం. వ్యవసాయం దండగ అని ఎక్కడ అన్నానో రుజువు చేయమని చంద్రబాబు అసెంబ్లీలో వైఎస్ రాజశేఖరరెడ్డిని నిలదీస్తే రుజువులు చూపలేక చేతులెత్తేశారు. ఆ అబద్ధాన్నే ఇప్పుడు కూడా రాయడం సరైంది కాదు. ఫ్యూడల్ వ్యవసాయం స్థానంలో పెట్టుబడిదారి వ్యవసాయం అభివృద్ధి చేస్తే రైతుకు కూడా సాపేక్షంగా లాభదాయకం.

2047 నాటికి పేదరికం పూర్తిగా రూపుమాపిపోతుందని చెప్పడం ప్రజల్ని మోసగించడమేనని నీలి మీడియా ప్రభావంతో కొందరు నిందాపూర్వక రాతలు రాస్తున్నారు. నేడు 1.48 కోట్ల మంది రేషన్ బియ్యంపై ఆధారపడి ఉన్నారంటూ పేదరికాన్ని పెద్దగా చూపుతున్నారు. ఎక్కువ మంది రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారని ఇటీవల కాకినాడ పరిణామాలు స్పష్టం చేస్తున్నవి. తెల్ల రేషన్ కార్డును రేషన్ బియ్యం కన్నా ఇతర రాయితీల కోసమే ఉపయోగించుకొంటున్నారు. బీపీఎల్ కుటుంబాలు నేడు రాష్ట్రంలో 20 శాతమే. రానున్న 23 ఏళ్ళలో 20 శాతం ప్రజల ఆదాయం పెంచి పేదరికం నిర్మూలించడం ఖచ్చితంగా సాధ్యమే. ఇందుకోసం పబ్లిక్, ప్రయివేట్, పీపుల్, పార్టనర్‌షిప్ (పి4) విధానాన్ని విజన్ 2047లో పెట్టారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల్ని భాగస్వాములు చేయడమే దీని సారాంశం. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న పథకాలకు తోడుగా అనేక కొత్త పథకాలను అమలు చేయబోతున్నది. 2047 నాటికి తలసరి ఆదాయం రూ.35 లక్షలకు పెరుగుతుంది. పేదరికంపై పి4 ఫార్ములా విజయం సాధిస్తుంది.

• గురజాల మాల్యాద్రి
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





భక్తి చర్చితం

జిల్లావ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. లోకరక్షకుని రాకను స్వాగతిస్తూ వన్‌టౌన్‌లోని సెయింట్ పీటర్స్ కథెడ్రల్ చర్చిలో కుటుంబ సమేతంగా ప్రభువుకు నమస్కరిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) గుణదల చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు







కనకదుర్గానగర్‌లో భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) అమ్మవారి ఉత్సవమూర్తి



పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో రామారావు

సిందూర శోభితం

ముగిసిన భవానీ దీక్షా విరమణ మహోత్సవాలు

ఘనంగా పూర్ణాహుతి.. ఇంకా తరలివస్తున్న భవానీలు 6లో

ఐదు రోజుల్లో 3.5 లక్షల మంది దర్శించుకున్నారని అంచనా

అంతరాలయ దర్శనాల్లో కానిస్టేబుల్ అత్యుత్సాహం

అర్చకులు, సిబ్బందికి బెదిరింపులు 6లో

బ్రహ్మయ్య లింగేశ్వర క్షేత్రానికి మహర్దశ

50 గదులతో హరిత బ్రహ్మకైలాస్ రిసార్ట్

ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు బ్రహ్మయ్య లింగేశ్వర స్వామి క్షేత్రం. ఎత్తైన కొండపై కొలువుతీరిన స్వామివారు.. దిగువన విశాలమైన బ్రహ్మయ్య లింగం చెరువు.. చుట్టూ కొండలు, పచ్చని మామిడి తోటలతో అలరారుతోంది. ఈ క్షేత్రం అభివృద్ధిపై పర్యాటక అభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. కాటేజీల ఏర్పాటు, బోటింగ్ కార్యకలాపాలతో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీంతో బ్రహ్మయ్య లింగేశ్వర క్షేత్రానికి మహర్దశ రానుంది.





- 'బ్రహ్మకైలాసం క్షేత్రం' దిగువన ఏర్పాటు
- బ్రహ్మయ్యలింగం చెరువులో వాటర్ స్పోర్ట్స్
- ఏపీటీడీసీ బోర్డు మీటింగ్‌లో కీలక నిర్ణయాలు
- సీఎం చంద్రబాబు, లోకేష్‌తో భేటీ తర్వాత మరిన్ని ప్రతిపాదనలు
- కేంద్రం నుంచి నిధులు పొందే అవకాశాలపై అధ్యయనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం- నూజివీడు నియోజకవర్గాల సరిహద్దులో ఆగిరిపల్లి మండలం తోటపల్లి, గన్నవరం మండలం చిక్కవరం గ్రామాల మధ్య కొలువై ఉన్న బ్రహ్మయ్య లింగేశ్వరసామి (బ్రహ్మకైలాసం) క్షేత్రానికి మహర్దశ రానుంది. ఎన్నాళ్ల నుంచో వేచి చూస్తున్న పర్యాటకాభివృద్ధికి అడుగులు పడ్డాయి. రాజధాని ప్రాంత పరిధిలో బ్రహ్మయ్య లింగం చెరువును అత్యద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న అంశంపై పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) బోర్డు మీటింగ్‌లో చర్చ జరిగింది. పర్యాటకంగా అభివృద్ధి చేయటానికి కాటేజీల ఏర్పాటు, బోటింగ్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఏపీటీడీసీ అధికారులకు ఆ సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ దిశానిర్దేశం చేశారు.

ఏపీటీడీసీ ప్రతిపాదనలు ఇలా..

విజయవాడ డివిజన్ ఏపీటీడీసీ ఉన్నతాధికారులు దాదాపు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్రహ్మకైలాస్ క్షేత్రంపై శాశ్వతంగా ప్రభుత్వ నిర్వహణలోనే కొనసాగేలా 50 గదులతో కూడిన కాటేజీల ఏర్పాటుకు ప్రతిపాదించారు. బ్రహ్మకైలాసం దిగువన బ్రహ్మయ్యలింగం చెరువుకు కాస్త ఎగువన నీటి వనరులకు అత్యంత సమీపంలో ఈ రిసార్ట్‌ను ప్రతిపాదించారు. అలాగే బ్రహ్మయ్యలింగం చెరువులో వాటర్ స్పోర్ట్స్ కార్యకలాపాలు కూడా ప్రారంభించేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించి త్వరలో ముఖ్యమంత్రి చంద్ర బాబు దగ్గర చర్చించి అంతిమ నిర్ణయం తీసుకోనున్నారు.

అమరావతి పరిధిలో అత్యద్భుత ప్రాంతం

బ్రహ్మయ్యలింగం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయటానికి ఉన్న అంశాలపై తాజాగా జరిగిన బోర్డు మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో అత్యద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయటానికి అవకాశాలున్న ప్రాంతం కావటంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పరంగా మరింత సహకారం పొందాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. ఎంతో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన బ్రహ్మయ్యలింగం చెరువును కేంద్ర ప్రభుత్వ నిధులతో కూడా అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాల్సిందిగా ఛైర్మన్ నూకసాని అధికారులకు సూచించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డీపీఆర్‌లు తయారు చేయించాలని, ఆ తర్వాత ఆమోదముద్ర తీసుకుని కేంద్రానికి పంపించటం ద్వారా మరిన్ని నిధులు సాధించాలన్న ఆలోచన చేశారు.

ఇటీవల ఆలయాన్ని సందర్శించిన ఛైర్మన్ నూకసాని

ఏపీటీడీసీ ఛైర్మన్ హోదాలో నూకసాని బాలాజీ ఇటీవలే బ్రహ్మయ్యలింగం చెరువును, బ్రహ్మయ్య లింగేశ్వర దేవస్థానాన్ని సందర్శించారు. విజయవాడ డివిజన్ ఉన్నతాధికారులకు దీనిపై సమగ్ర ప్రణాళికలు తయారు చేయాల్సిందిగా అప్పటికప్పుడు నిర్దేశించారు.

ఇదేం పంచాయితీ?

మైలవరం మేజర్ పంచాయతీలో ఆర్థిక అవకతవకలపై అనుమానాలు

- చర్యలకు డిప్యూటీ సీఎం ఆదేశించినా బేఖాతరు
- అధికారిని వదిలి సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు
- ఈ ప్రభావంతో పార్టీ మారిన సర్పంచ్
- అసలు సూత్రధారి ఈవోను కాపాడే ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలను సైతం జిల్లా పంచాయతీ అధికారులు బేఖాతరు చేశారు. కాల్వల పూడికతీత పనుల పేరుతో లక్షల రూపాయలను సొంత ఖాతాల్లో జమ చేసుకున్న మైలవరం పంచాయతీ పెద్దలపై చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారు. ఈ వ్యవహారంలో జాప్యంపై జిల్లా పంచాయతీ అధికారి మైలవరం సర్పంచ్ గరికపాటి మంజుభార్గవికి షోకాజు నోటీసు జారీ చేశారు.

ఆర్థిక అవకతవకలు ఇలా..

వైసీపీ ప్రభుత్వంలో మైలవరం మేజర్ గ్రామ పంచాయతీలో కాల్వల పూడికతీత పనుల నుంచి, ట్యాప్ కనెక్షన్లు, మోటార్ల ఏర్పాట్లలో ఆర్థిక అవకతవలు జరిగాయి. వీటిపై ఫిర్యాదులు రావటంతో జిల్లా పంచాయతీ అధికారులు విచారణ ప్రారంభించారు. కాల్వల పూడికతీత పనులకు కేటాయించిన రూ.40 లక్షల్లో రూ.20 లక్షలకు పైగా పంచాయతీ పెద్దల ఖాతాల్లోకి మళ్లించిన విషయాన్ని మైలవరం ఈవోపీఆర్డీ తన విచారణ నివేదికలో డీపీవోకు తెలియజేశారు. సర్పంచ్ మంజుభార్గవి కరెంట్ ఖాతాలో రూ.1,50,000, ఉప సర్పంచ్ చామల సీతారామరెడ్డి ఖాతాలోకి రూ.12,91,100, సర్పంచ్ భర్త డేనియల్ ఖాతాలో రూ.3,84,000, పంచాయతీ వర్కర్ ఖాతాలో రూ.3,84,000 జమ అయ్యాయని ఈవోపీఆర్డీ ధ్రువీకరించి డీపీవోకు నివేదించారు. దీనిపై అప్పటి డీపీవో శివప్రసాద్ ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఈ కేసును ముందుకు వెళ్లనీయకుండా వైసీపీ ప్రభుత్వంలో అడ్డుపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చినా తేలలేదు. నిజానిజాలను నిగ్గుతేల్చే నివేదికలు ఉన్నా కూడా చర్యలు తీసుకోవటానికి మీనమేషాలు లెక్కించారు. ఈ విషయం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లింది. అయినా ఎలాంటి మార్పు లేదు. దీంతో పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై పవన్ తక్షణం స్పందించారు. ఆయన ఆదేశాలతో జిల్లా యంత్రాంగం విచారణ చేసి చర్యలు తీసుకోమని నిర్దేశించింది. దీంతో జిల్లా పంచాయతీ అధికారులు సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు.

ఈవోకు కాకుండా సర్పంచ్‌కు షోకాజ్..!

మామూలుగా అప్పటి ఈవో సాంబశివరావుకు షోకాజ్ నోటీసు ఇవ్వాలి. ఆయన ఇప్పటికే మైలవరంలోని రియల్ వెంచర్లకు రోడ్ల కోసం దానపత్రాల స్వీకరణ వివాదంలో విచారణను ఎదుర్కొంటున్నాడు. కాల్వల పూడికతీత పనులకు సంబంధించి కూడా సాంబశివరావు బాధ్యత వహించాల్సి ఉంది. కాగా, సాంబశివరావును రక్షించేందుకే సర్పంచ్‌కు నోటీసు ఇచ్చినట్టు తెలుస్తోంది. సర్పంచ్, ఆమె భర్త, ఉప సర్పంచ్ ఖాతాల్లోకి నిధులు జమ అయిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గత రిపోర్టుల ఆధారంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లపై వేటుకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది. సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయాల్సి ఉంటుంది. లేదంటే రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, ఆయన ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆ పని కూడా చేయలేదు. ఇదిలా ఉంటే, సర్పంచ్‌పై వివాదాల నేపథ్యంలో వైసీపీ నుంచి తాజాగా టీడీపీ తీర్థం పుచ్చుకోవటం గమనార్హం.

విద్యాధరపురం డిపోలో

చార్జింగ్ స్టేషన్

త్వరలో నగరానికి 100 ఎలక్ట్రికల్ బస్సులు రానున్న నేపథ్యంలో..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎలక్ట్రికల్ బస్సుల కోసం విద్యాధరపురం బస్ డిపోలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. నగరానికి అతి త్వరలో 100 ఎలక్ట్రికల్ బస్సులు రాబోతున్న నేపథ్యంలో ఈలోపే చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్టీసీ చర్యలు చేపడుతోంది. విజయవాడ నగర పరిధిలో నడిపే ఎలక్ట్రికల్ బస్సులన్నింటినీ విద్యాధరపురం బస్ డిపోకు కేటాయించారు. విద్యాధరపురం డిపోలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందుకు హెచ్‌టీ పవర్ సప్లై కావాల్సి ఉంది. ఈ మేరకు విద్యుత్ శాఖకు చార్జీలను చెల్లించనున్నారు.

డీలర్ల పోస్టులకు బేరాలు

● పోస్టుకు రూ.5 లక్షల వరకు డిమాండ్ ● ప్రజాప్రతినిధుల అనుచరులదే ప్రధాన పాత్ర

- పరీక్ష జరిగి నాలుగు రోజులవుతున్నా వెలువడని కీ
- ఫలితాలు ఎప్పుడిస్తారో కూడా తెలియదు..!
- 27, 28 తేదీల్లో ఇంటర్వ్యూలకు ఏర్పాట్లు
- గందరగోళంలో అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రేషన్ డీలర్ల పోస్టుల భర్తీలో అవినీతి కంపు కొడుతోంది. కొత్తగా ఉపాధి అవకాశాలు సృష్టించాలన్న ఉద్దేశంతో డీలర్ల పోస్టులకు తెరలేపి, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ప్రజాప్రతినిధుల అనుచరులు వ్యవహరిస్తున్నారు. డీలర్ల పోస్టులు ఇప్పిస్తామంటూ విజయవాడ డివిజన్ పరిధిలో పలువురు అనుచరులు బేరాలు పెడుతున్నారు. డీలర్ పోస్టు కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఏరియాను బట్టి ప్రజాప్రతినిధుల అనుచరులు రేటు కడుతున్నారు.

ఉత్తీర్ణత వివరాలేవీ? ఇంటర్వ్యూలు ఎవరికి?

రేషన్ డీలర్ల నియామకానికి అర్హతలను నిర్ణయించి పోస్టులు మంజూరు చేయటానికి ఈ నెల 22న కేబీఎన్ కళాశాలలో విజయవాడ డివిజన్ స్థాయిలో అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 111 డీలర్ల పోస్టులకు నోటిఫికేషన్ వెలువడగా, దాదాపు



గత ఆదివారం కేబీఎన్‌లో జరిగిన డీలర్ల పరీక్ష

1,200 మందికి పైగా అభ్యర్థులు పరీక్షలు రాశారు. దీనిని బట్టి విజయవాడ డివిజన్ పరిధిలో డీలర్లకు ఎంత పోటీ ఉందో అర్థమవుతుంది. పరీక్షలు జరిగి నాలుగు రోజులవుతున్నా.. విజయవాడ డివిజన్ అధికారులు వీటికి సంబంధించిన సమాచారాన్ని అధికారికంగా ప్రకటించకపోవటం విమర్శలకు తావిస్తోంది. ఎంతమంది పరీక్షలకు హాజరయ్యారన్న వివరాలను కూడా ప్రకటించలేదు. ప్రశ్నాపత్రం కీ కూడా విడుదల చేయలేదు. కీ విడుదల చేస్తే ఎవరికి ఎన్ని మార్కులు వస్తాయనే అంచనా ఉంటుంది. పోనీ ఎంతమంది ఉత్తీర్ణులయ్యారన్న విషయాన్ని కూడా తెలియజేయలేదు. పైగా.. 27, 28 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో మొత్తం గందరగోళంగా మారింది.

అభ్యర్థుల్లో ఆందోళన

మరోవైపు ప్రజాప్రతినిధుల అనుచరులు బేరాలు పెడుతుండటంతో తాము అర్హతలు సాధించినా పోస్టులు రావేమోనని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. విజయవాడలోని మూడు నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో రెవెన్యూ అధికారులకు సిఫార్సులు వెళ్తున్నట్టు తెలుస్తోంది. ఈ సిఫార్సుల్లో చాలావరకు ప్రజాప్రతినిధుల అనుచరులు కుదుర్చుకున్న బేరాలకు సంబంధించినవేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విజయవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి తక్షణం స్పందించి కీను విడుదల చేయటంతో పాటు, మార్కులను ప్రకటించడం, ఎంపిక చేసిన వారి, ఇంటర్వ్యూలకు పిలిచిన వారి జాబితాలను అధికారికంగా విడుదల చేస్తే దరఖాస్తుదారుల్లో ఉన్న గందరగోళానికి తెరపడుతుంది. అవినీతి వ్యవహారాలకు అడ్డుకట్ట పడుతుంది.

మరో రెండు రోజులు

కూల్‌కూల్

వాతావరణంలో మార్పులతో రైతుల్లో టెన్షన్ టెన్షన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మరో రెండు రోజులు ఉమ్మడి జిల్లాలో వాతావరణం చల్లగా ఉండనుంది. కొద్దిరోజుల నుంచి వాతావరణ శాఖ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తోంది. ఆ స్థాయిలో వర్షం పడకపోయినా.. జల్లు కురుస్తోంది. దీంతో మూడు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. అయితే, అన్నదాతలు భయపడాల్సింది లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయినా రైతులు ఆందోళనలో ఉన్నారు.



పనలపై ఉన్న వరి

ముగిసిన భవానీ దీక్ష విరమణలు



భవానీ దీక్షల విరమణ ముగింపు కార్యక్రమం పూర్ణాహుతిలో ఈవో రామారావు దంపతులు



» దుర్గమ్మను దర్శించుకున్న 3.70 లక్షల మంది భక్తులు

» వేద మంత్రాల మధ్య ఘనంగా పూర్ణాహుతి

వన్‌టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఈనెల 21 నుంచి ప్రారంభమైన ఐదు రోజుల భవానీ దీక్షల విరమణల కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా యాగశాలలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ ఈవో రామారావు దంపతులు పాల్గొన్నారు. హోమగుండంలో పూర్ణాహుతి సమిధలను సమర్పించి అమ్మవారి



ఆశీస్సులు పొందారు. సకలజనుల శ్రేయస్సు కోరుతూ నిర్వహించిన పవిత్ర కార్యక్రమాలకు ముగింపుగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించినట్టు, అమ్మవారిని శరణు కోరి శాంతి, పుష్టి, ధైర్యం, విజయం అందరికీ కలిగించాలని సంకల్పం చెప్పారు. ఈనెల 21 నుంచి ఆలయంలో చండీహోమాన్ని నిర్వహించారు. దీంతోపాటుగా అమ్మవారిని సంతుష్టిపరిచేందుకు వివిధ పారాయణలు, పూజలు దేవస్థానం నిర్వహించింది. కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు, ముఖ్యఅర్చకులు పాల్గొన్నారు.

అత్యంత వైభవోపేతంగా కార్యక్రమాలు..

పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఈవో మాట్లాడుతూ, ఐదు రోజుల భవానీ దీక్షల విరమణల కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయన్నారు. బుధవారం సాయంత్రం వరకు 3.5లక్షల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నారని, ఇంకా భక్తులు వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షణలో కార్యక్రమాలు విజయంతమయ్యాయన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి తదితరులు ఎంతో సహకారం ఇచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు సాంకేతికతను వినియోగించుకుని, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సహకారంతో ఎక్కడా పొరపాట్లు జరగకుండా భవానీ దీక్షల విరమణల కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవానీ భక్తులు మౌలిక సదుపాయాలను సులభంగా పొందేందుకు దాత సహకారంతో యాప్ విజయవంతమైందన్నారు. మూడు రోజుల వ్యవధిలోనే 20 లక్షల లడ్డూలు భక్తులకు అందుబాటులో ఉంచటం రికార్డు అన్నారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ మాట్లాడుతూ, శాస్త్రోక్తంగా పాంచరాత్ర దీక్ష మేరకు ఐదు రోజుల పాటు భవానీ దీక్షల విరమణల కార్యక్రమాన్ని నిర్వహించారని, అర్చక సిబ్బంది శతచండీ యాగాన్ని దిగ్విజయంగా పూర్తిచేశారని తెలిపారు. 44 సంవత్సరాలుగా దీక్ష విరమణలు కొనసాగుతున్నాయని 9మందితో ప్రారంభమైన దీక్షలు తొమ్మిది లక్షలకు చేరుకోవడం విశేషమన్నారు. ప్రధాన అర్చకులు, ముఖ్య అర్చకులు అందరూ కార్యక్రమాల నిర్వహణకు ఎంతో సహకరించారని తెలిపారు. దేవస్థాన గురుభవానీ యద్దనపూడి నాగరాజ శర్మ ఐదురోజులపాటు ఇక్కడే ఉండి సూచనలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రత్నరాజు, ప్రధాన అర్చకుడు ఎల్డీ ప్రసాద్, ముఖ్య అర్చకులు శ్రీనివాస శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

ఐదురోజుల్లో కనకదుర్గమ్మను దర్శించుకున్న 3.70 లక్షల మంది భక్తులు

ఇంద్రకీలాద్రిపై ఈనెల 21 నుంచి భవానీ దీక్షల విరమణల కార్యక్రమంలో 25వ తేదీ సాయంత్రం వరకు 3,70,114 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ప్రకటించిన వివరాల మేరకు.. 21వ తేదీ నుంచి 25వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 3,70,114 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 20 లక్షల లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేయగా, బుధవారం సాయంత్రం వరకు 17,48,837 లడ్డూలను విక్రయించారు. అన్నప్రసాదం, అల్పాహారాలు కలిపి మొత్తంగా 1,34,000 మందికి అన్నవితరణ చేశారు. 55,629 మంది భక్తులు కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించారు. 7,65,910 మంచి బాటిళ్లు భక్తులకు పంపిణీ చేశారు.



అంతరాలయ దర్శనాల్లో కానిస్టేబుల్ అత్యుత్సాహం!

» అర్చకులు, సిబ్బందికి బెదిరింపులు



వన్‌టౌన్ : దేవస్థానంలో భవానీ దీక్షల విరమణ పురస్కరించుకుని విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ అత్యుత్సాహం ప్రదర్శించాడు. తన మాట వినలేదని, ఆలయ సిబ్బంది, అర్చకులను బెదిరింపులకు గురిచేశాడు. దేవస్థానం ఉన్నతాధికారుల అనుమతి లేకుండా అంతరాలయంలోకి పంపాలంటూ కానిస్టేబుల్ బెదిరించాడని విధుల్లో ఉన్న ఆలయ సిబ్బంది, అర్చకులు ఆరోపించారు. దీక్షల విరమణలో పోలీసు అధికారులు వన్‌టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురు కానిస్టేబుళ్లకు కొండపైన ప్రొటోకాల్ విధులు అప్పగించారు. వీరిలో ఒక కానిస్టేబుల్ ప్రొటోకాల్ పేరుతో ఇష్టానుసారంగా తన వెంట పది నుంచి పదిహేను మందిని దర్శనానికి తీసుకువెళుతుండటంతో అంతరాలయం వద్ద విధుల్లో ఉన్న ఉద్యోగులు అడ్డుకున్నారు. దీంతో నన్నే అడ్డుకుంటారా అంటూ బెదిరిస్తున్నాడని, అతడికి గుడిపైనే డ్యూటీ ఉండటం వలన ఉద్యోగులతో పాటు అర్చకులను కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు.



రామ్మోహన గ్రంథాలయంలో వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, బుద్ధప్రసాద్‌లు

ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి వాజ్‌పేయి

» ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మండలి బుద్ధ ప్రసాద్

గవర్నర్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రతిష్ఠను ప్రపంచ వేదికల మీద నిలపిన గొప్ప విలువలు కలిగిన వ్యక్తి అటల్ బిహారి వాజ్‌పేయి అని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి 100వ జయంతిని (సుపరిపాలన దినోత్సవం) సందర్భంగా బుధవారం ఎంజీ రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయం పైభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రంను ఆయన ప్రారంభించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం జరిగిన సభకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమకాలం నుంచి దేశ సేవలో గడిపిన వాజ్‌పేయినిలోని దేశభక్తిని గుర్తించిన పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న కాలంలో అంతర్జాతీయ సభలకు భారత ప్రతినిధిగా పంపారని గుర్తుచేశారు. వాజ్‌పేయి జన్మదినాన్ని సుపరిపాలన దినంగా జరుపుకోవడం మన కర్తవ్యమన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, వాజ్‌పేయి జాతికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఆయన స్ఫూర్తిగా నేటి తరం నేతలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేములపల్లి కేశవరావు, సామాజిక వేత్త ఎంసీ దాసు, కమిటీ సభ్యులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి ఆదర్శనీయుడు : ఎంపీ శివనాథ్



వన్‌టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. వాజ్‌పేయి 100వ జయంతిని పురస్కరించుకుని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో వాజ్‌పేయి చిత్రపటం వద్ద బుధవారం ఎంపీ నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాజ్‌పేయి అధికారం కోసం ఎప్పుడూ అవకాశవాద రాజకీయాలు చేయలేదన్నారు. నైతిక విలువలకు పట్టం కట్టారని, ప్రతికూల పరిస్థితుల్లో కూడా నైతికతకు కట్టుబడి పదవులు సైతం త్యాగం చేశారని కొనియాడారు. దేశ రాజకీయాల్లో వాజ్‌పేయి చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. ఎంతటి సంక్లిష్ట విషయాన్ని అయినా సరళ భాషలో చెప్పడం ఆయన శైలి అని కొనియాడారు.

28న కృష్ణా జిల్లాలో ఏకసభ్య కమిషన్ బృందం పర్యటన

మచిలీపట్నంటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభిప్రాయ సేకరణకు ఈనెల 28న కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలతో పాటు నూజివీడు, కైకలూరు మండలాల్లో విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ బృందం పర్యటించనుంది. ఎస్సీ వర్గీకరణపై ప్రజల అభిప్రాయం తెలుసుకునేందుకు కమిషన్ పర్యటించనుంది. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ జిల్లాల్లో పర్యటించనుంది. దీనిలో భాగంగా మచిలీపట్నం జిల్లాపరిషత్ కన్వెన్షన్ హాలులో 28న ఉదయం సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో షెడ్యూల్డ్ కులాలు, ఉపకులాల్లోని వర్గీకరణపై ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన నేతలు విజ్ఞప్తులు స్వీకరిస్తారు. సామాన్య ప్రజలతో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ కులసంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు అవకాశం కల్పించారు. మెయిల్ ద్వారా జనవరి 9 వరకు విజ్ఞప్తులు స్వీకరించనున్నట్టు జిల్లా అధికారులు పేర్కొన్నారు.

పురాతన బురుజు తొలగింపుపై రగడ!

» ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థకు బందుల దొడ్డి నిర్వహణ బాధ్యత

» పనులు అడ్డగించి స్థానికుల నిరసన

» చెరువుబజార్‌లో ఉద్రిక్తత



కూల్చేసిన కోట మైసమ్మ బురుజు, బందులదొడ్డి గేటు ముందు నిరసన తెలుపుతున్న చెరువుబజార్ వాసులు

జగ్గయ్యపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పురపాలకసంఘం బందులదొడ్డి నిర్వహణ బాధ్యతను హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టు సంస్థ చేపట్టి దొడ్డిలో ఉన్న కోట మైసమ్మతల్లి పురాతన బురుజును తొలగించడం స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. చెరువుబజార్‌లో రేణుకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదురుగా ఎంతోకాలంగా బందులదొడ్డిని పురపాలకసంఘం నిర్వహిస్తోంది. దొడ్డిలో వందల సంవత్సరాల క్రితం ఉన్న కోట మైసమ్మ బురుజును కాంట్రాక్టు సంస్థ తొలగించడాన్ని స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. ఎంతోకాలంగా పుట్టరూపంలో ఉండే బురుజు వద్ద ఇళ్లలో ఎలాంటి శుభకార్యాలు జరిగినా అక్కడ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభిస్తామని, అటువంటి బురుజును తొలగించటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పురపాలకసంఘం బందులదొడ్డి నిర్వహణ భారం కావటంతో ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రయివేటు సంస్థకు అప్పగించారు. సదరు సంస్థ ప్రతినిధులు కొద్దిరోజులుగా బందులదొడ్డిలో ఉన్న చెత్తా చెదారం తొలగించి గోడలను రేకులతో ఎత్తు పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం బురుజును యంత్రాలతో తొలగించారు. పురాతన కాలంలో పుట్టమట్టితో నిర్మించిన బురుజును తొలగించడంతో స్థానికులు అభ్యంతరం చెబుతు పనులను అడ్డుకున్నారు. బందులదొడ్డి పేరు తొలగించి శ్రీలీలా గోపాల గోసదన్ పేరుతో గోశాలను ఏర్పాటుచేస్తున్నట్టు బోర్డులు పెట్టడంతో వాటిని స్థానికులు తొలగించారు. గోశాల, బందులదొడ్డి నిర్వహణకు తమకు అభ్యంతరం లేదని, ఆ పేరుతో వందల సంవత్సరాలుగా పూజలందుకుంటున్న కోట మైసమ్మ తల్లి బురుజును తొలగించటం తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పురపాలకసంఘం అధికారుల పర్యవేక్షణ లేకుండానే ప్రైవేటు వ్యక్తులు ఇష్టారాజ్యంగా కూల్చటమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై చైర్మన్ రంగాపురం రామచంద్ర మాట్లాడుతూ, బందులదొడ్డి నిర్వహణ పురపాలకసంఘానికి భారంగా మారిందని, బందుల దొడ్డిని అభివృద్ధి చేస్తామని 'మెస్సర్స్ స్పేస్‌నెట్' సంస్థ ముందుకురావటంతో అప్పగించామని పేర్కొన్నారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా, అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న ఆవులను ఈ గోసదన్‌లో ఉంచి పోషించటం జరుగుతుందని చెప్పారు.



పతకాలు సాధించిన స్కేటర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

జాతీయ స్కేటింగ్‌లో సత్తా చాటిన ఉమ్మడి కృష్ణా క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మైసూరు, కోయంబత్తూర్‌లలో ఈనెల 15 వరకు జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లా రోలర్ స్కేటర్లు పతకాల పంట పండించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, అధ్యక్షులు జె.దుర్గాప్రసాద్, కోశాధికారి సోంతాతియా, ఉపాధ్యక్షులు ఎల్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు బచ్చు మురళీకృష్ణలు క్రీడాకారులను అభినందించారు.

నేడు ఫెన్సింగ్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు : వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో ఏకత్వా పాఠశాలలో ఈ నెల 26న సాయంత్రం 3 గంటలకు ఉమ్మడి కృష్ణా అండర్-17 ఫెన్సింగ్ క్యాడెట్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ నాగం సతీష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని ఈనెల 28, 29వ తేదీల్లో కాకినాడ ఏడీబీ రోడ్డులో ఉన్న లక్ష్య అంతర్జాతీయ పాఠశాలలో జరిగే 10 ఏపీ అంతర్ జిల్లాల అండర్-17 ఫెన్సింగ్ క్యాడెట్ పోటీలకు పంపుతామన్నారు. ఇతర వివరాలకు 9553528888 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

» మంత్రి కొల్లు రవీంద్ర



సెయింట్ ఆండ్రూస్ చర్చిలో ప్రార్థనల్లో మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మానవాళిని రక్షించేందుకు కరుణామయుడు ఏసుక్రీస్తు మానవుడిగా జన్మించారని, ఆయన బోధించిన ప్రేమ, త్యాగం, క్షమాగుణాలు ఆచరణీయమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని తెలుగుచర్చి, ఆర్సీఎం, హైనీ, నోబుల్, ఇంగ్లీషు చర్చిలతో పాటు చిన్నాపురంలోని చర్చిలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనా సమావేశాల్లో మంత్రి పాల్గొన్నారు. మతపెద్దల నుంచి ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, శాంతి, సహజీవనం, మత సామరస్యానికి మచిలీపట్నం ప్రతీక అన్నారు. పట్టణ అభివృద్ధి కోసం ఏసుక్రీస్తును ప్రార్థించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో చర్చిల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో మోటమర్రి బాబాప్రసాద్, దేవరపల్లి అనిత, పినిశెట్టి నాగ ఛాయాదేవి, మువ్వల యోహాన్, లోగిశెట్టి వెంకటస్వామి, గుమ్మడి విద్యాసాగర్, చిన్నం శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర కేకు కట్ చేశారు.

సహకార రంగ అభివృద్ధికి ప్రణాళిక

» మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార రంగ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. బుధవారం తాడేపల్లిలో సహకారంతో సంవృద్ధి పేరుతో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, 2023 నుంచి రిజిస్టర్ అయిన బహుళ ప్రయోజన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల ఉత్పత్తిదారుల సంఘాలు, మత్స్యకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 932 మహిళా పాల ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రోజుకు 1.60 కోట్ల లీటర్ల పాలు డెయిరీలకు సరఫరా అవుతున్నాయని తెలిపారు. పాల ఉత్పత్తిదారులు లాభదాయక ధర పొందటానికి కొత్తగా ఏర్పడిన సంఘాలకు పాల పరీక్ష యంత్రాలు, శీతలీకరణ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పాల వ్యాపార నిర్వహణపై శిక్షణ ఇస్తామని, పశుగ్రాస పెంపకందారులు, పాడి రైతులు అదనపు ఆదాయం పొందటానికి ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సహకార సంఘాలకు నగదు ఉపసంహరణ పరిమితిని ఏడాదికి రూ.కోటి నుంచి రూ.3 కోట్లకు పెంచామన్నారు. మత్స్యకార సంఘాల సభ్యులకు బోట్లు, వలలు, చేపపిల్లల పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, సహకార సంఘాలకు ఆదాయ పన్నును 30 శాతం నుంచి 15 శాతానికి కుదించినట్టు అచ్చెన్నాయుడు చెప్పారు.

3 లోగా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు : రంగా వర్సిటీ

అమరావతి : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుకు జనవరి 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ రామచంద్రరావు సూచించారు. చిరుధాన్యాల సాగు, యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై రెండు నెలలు ఆన్‌లైన్ కోర్సు నిర్వహించనున్నట్టు ఆయన వివరించారు. ఆసక్తి కలవారు రంగా వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, లేదా 9063219959, 8309626619 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఐసీఐ విజయవాడ చాప్టర్ చైర్మన్‌గా జగదీష్

అమరావతి : ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ) విజయవాడ చాప్టర్ చైర్మన్‌గా డాక్టర్ జగదీష్ వెంగల నియమితులయ్యారు. 2026 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. విజయవాడలోని పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ జగదీష్ పరిశ్రమలు, సిద్ధాంతం, పరిశోధనల్లో రెండు దశాబ్దాలుగా పైగా అనుభవం గడించారు. అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్న నేపథ్యంలో కాంక్రీట్ నాణ్యతను మెరుగుపరచడంలో ఐసీఐ పాత్ర కీలకమని పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివాజీబాబు తెలిపారు. ఐసీఐ విజయవాడ చాప్టర్ నూతన చైర్మన్ డాక్టర్ జగదీష్ కాంక్రీట్ సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు, వృత్తిపరమైన అభివృద్ధి, పరిశ్రమలతో అనుసంధానాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు.

దివ్య ఆచూకీ తెలపండి..

» బహుమతి ప్రకటించిన పోలీసులు



అవనిగడ్డ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14వ తేదీ నుంచి కనిపించకుండాపోయిన ఆవుల దివ్య ఆచూకీ కోసం పోలీసుశాఖ పారితోషకాన్ని ప్రకటించింది. అవనిగడ్డ లంకమ్మ మాన్యం వంతెన వద్ద గుడిసెల్లో నివాసముంటున్న ఆవుల గోపి, కొండాలమ్మల కుమార్తె అయిన దివ్య మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోగా, ఆమె ఆచూకీ కోసం పోలీసులు జిల్లా వ్యాప్తంగా గాలింపు చేపట్టారు. ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి ఉంటుందని భావించి విచారణ చేపట్టిన పోలీసులకు ఫలితం లేకపోవటంతో, ఆచూకీ తెలిపిన వారికి పారితోషకం ఇస్తామని ప్రకటించారు. దివ్య ఆచూకీ తెలిసిన వారు 9440796406 (డీఎస్పీ అవనిగడ్డ), 9440796466 (సీఐ, అవనిగడ్డ), 9440796467 (ఎస్ఐ, అవనిగడ్డ) పోలీసు శాఖ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కోరింది.

కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి

మైలవరంరూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కుక్కలు దాడిచేయడంతో 60 గొర్రెపిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని చంద్రగూడెంలో మంగళవారం రాత్రి జరిగింది. మైలవరానికి చెందిన పాలెం రామారావు, కుటుంబరావులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రగూడెం-అనంతవరం మార్గమధ్యలోని పొలంలో గొర్రెలను మేపుకుంటూ జీవనంసాగిస్తున్నారు. మంగళవారం ఉదయం గొర్రెలను మేత నిమిత్తం బయటకు తోలుకొని వెళ్లగా, మిగిలిన గొర్రె పిల్లలను పొలంలో ఉంచి వెళ్లారు. ఊర కుక్కలు మెష్ కింద మట్టి తవ్వుకొని లోపలికి దూరి గొర్రె పిల్లలపై దాడి చేయడంతో 60 పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల యజమానులు సాయంత్రం వచ్చి చూడగా గొర్రెపిల్లలు చనిపోయి ఉన్నాయి. రూ.3లక్షల నష్టం వాటిల్లడంతో జీవనాధారం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

జనవరి 3, 4 తేదీల్లో యువకెరటాలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యువతీ యువకుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు జనవరి 3, 4 తేదీల్లో హిందూ కళాశాల ప్రాంగణంలో 'యువకెరటాలు' కార్యక్రమం నిర్వహించనున్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. జనవరి 3న పాఠశాలల విద్యార్థులకు, 4న కళాశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్, గ్రూపు డ్యాన్స్, పాటల పోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో పోలీసుశాఖ ఆయుధ ప్రదర్శన, ఇస్రో, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, విపత్తు నిర్వహణ, డ్రోన్స్, ఎన్డీఆర్ఎఫ్ ప్రదర్శన నిర్వహిస్తారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంఎస్ఎంఈ వంటి అంశాలలో పారిశ్రామిక వేత్తలతో అవగాహన కల్పిస్తారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో యువకులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ప్రముఖ కళాకారులు,ప్రజాప్రతినిధులు పాల్గొనేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందుకుగాను వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు.

సేవాభావం పెంపొందించుకోవాలి

సత్యనారాయణపురం : ప్రతీ ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని, ఉన్నదాంట్లో సేవా కార్యక్రమాలు చేయాలని కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అన్నారు. చల్లపల్లివారి వీధి లోని మహిళల ఉచిత శిక్షణాకేంద్రం వార్షికోత్సవం డాక్టర్ వేదాంతం రామకృష్ణాచార్యులు అధ్యక్షతన ఆదివారం జరిగింది.రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యంగా యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. శిక్షణాకేంద్రం అధ్యక్షుడు కాలనాథభట్ట వీరభద్రశాస్త్రి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. శిక్షణా కేంద్రంలో కుట్టు శిక్షణ పొందిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ఇద్దరు పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు

ఆటోనగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు లోక రక్షకుడిగా ఈ లోకంలో జన్మించారని మెస్సీయ ఫెలోషిప్ ఛైర్మన్, పాస్టర్ సజ్జా రత్నకుమార్ అన్నారు. ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ఆరాధనలో సజ్జా రత్నకుమార్ ప్రసంగించారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నృత్యరూపకం, భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రవి కిషోర్, కోటేశ్వరరావు, ప్రబోధ కుమార్, జోయెల్, సజ్జా జ్యోతి పాల్గొన్నారు.



క్రిస్మస్ ఆరాధనలో ప్రసంగిస్తున్న మెస్సీయ ఫెలోషిప్ చైర్మన్ పాస్టర్ సజ్జా రత్నకుమార్



మన్నా చర్చి ప్రేయర్ హాల్‌లో క్రిస్మస్ సందేశమిస్తున్న ఫాదర్ రాజేష్

మన్నా చర్చిలో..

భారతీనగర్ : సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలోని మన్నా చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బిషప్ స్వర్ణన్‌రాజు, ఫాదర్ రాజేష్ సందేశమిచ్చారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకొన్నాయి. లయోలా కాలేజీ రోడ్డులోని అగాపే ఫ్యామిలీ చర్చిలో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.



సర్వీస్ స్టేషన్‌లో వినియోగదారులకు స్వీట్స్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

లబ్బీపేట : బందరు రోడ్డులోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పైలెట్ సర్వీస్ స్టేషన్ బంకులో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎన్టీఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్ పాల్గొని కేక్ కట్ చేసి సిబ్బందికి, వినియోగదారులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. ఎం.వి.వి.సత్యనారాయణ, నందకిషోర్, మేనేజర్ కె.వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కొండంత ధైర్యం గద్దె

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా

పటమట,డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నేనున్నాంటూ బాధితులకు కొండంత ధైర్యాన్ని అందిస్తారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా అన్నారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం సీఎం సహాయ నిధి ద్వారా 18 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.17.50లక్షలచెక్కులను లబ్ధిదారులకు గద్దె రామ్మోహన్, నాగుల్‌మీరా అందజేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ 2014 -19 వరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఒక్క తూర్పు నియోజకవర్గంలోనే అత్యధికంగా రూ.20 కోట్లను లబ్ధిదారులకు అందజేశామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక 126 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయాన్ని అందజేశానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఛైర్మన్ గద్దె అనురాధ, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, రత్నం రమేష్, వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, పలిశెట్టి అన్నారావు, పడాల గంగాధర్, గుత్తికొండ కృష్ణమోహన్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా

రాష్ట్ర క్రీడాకారులను ఉత్తరాఖండ్ పంపేందుకు చర్యలు తీసుకోవాలి

● పీటీ ఉషకు కేపీ రావు లేఖ

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్రీడల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు సాంకేతిక ఇబ్బందుల్లేకుండా శాప్ ద్వారా రాష్ట్రజట్లను పంపేందుకు అనుమతి ఇవ్వాలని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు(ఐఓఏ) పీటీ ఉషకు ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కేపీ రావు బుధవారం లేఖరాశారు. క్రీడలకు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడును ఏపీ కంటింజెంట్ చీఫ్ డీ మిషన్‌కు నామినేట్ చేయాలని కోరారు. ఐఓఏ రాజ్యాంగం ప్రకారం ఏపీ ఒలింపిక్ అసోసియేషన్‌లో కొనసాగడానికి అర్హత లేని స్థానికేతరుడైన ఆర్కే పురుషోత్తమ్‌ను నియంత్రణకు మా వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు ద్వారా మన రాష్ట్రంలోని క్రీడలు, క్రీడాకారుల భవిష్యత్ మెరుగుపర్చడానికి ఫెసిలిటేటర్‌గా శాప్‌కు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు.



ట్రోఫీతో జూనియర్ కళాశాల పురుషుల జట్టు

ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నీలో రన్నరప్‌గా పీబీ సిద్ధార్థ

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నేషనల్ కళాశాలలో ఈ నెల 24న ముగిసినస్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఏపీ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీలో అండర్-19 పురుషుల విభాగంలో పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. జట్టు విజయంలో విజయ్ సిద్ధార్థ్, సి.అశ్విన్, యశ్వంత్, వైభవ రాజ్, గోపీకృష్ణ, ఇబ్రహీం, సి.దీపేష్, సుమంత్ కీలక పాత్రపోషించారు. విజయంపై కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.మార్కండేయులు, వి.రవికాంత్ అభినందించారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దు : సీఐటీయూ

చిట్టినగర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించొద్దని, పాత పద్ధతి డ్వాక్రా ఏజెన్సీలకే అప్పగించాలని సీఐటీయూ పశ్చిమ నగర కార్యదర్శి ఇ.వి.నారాయణ అన్నారు. కొత్తపేట శ్రావిక భవనంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అక్షయ పాత్రకు అప్పచెప్పటం అన్యాయమన్నారు. డ్వాక్రా ఏజెన్సీలకు వారానికి ఇచ్చే గ్రుడ్లుతో కలిపి ఒక్కొక్కరికి రూ.8.75 చొప్పున అందజేసేవారు. ఇప్పుడు గ్రుడ్లు లేకుండానే అక్షయపాత్రకు ఒక భోజనానికి రూ.10 చెల్లించి విధంగా ఒప్పందం కుదుర్చుకోవడం అన్యాయమన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో డ్వాక్రా ఏజెన్సీలు ఈ వంట పనిచేస్తూ ఉపాధిని పొందుతున్నారు. నెలల తరబడి ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోయినా మెనూ ప్రకారం సక్రమంగా విద్యార్థులకు భోజనం అందిస్తున్నారన్నారు.

నిరంతరాయంగా తాగునీరు సరఫరా

● ఎమ్మెల్యే సుజనా చౌదరి

విద్యాధరపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరికీ నిరంతరాయంగా మంచి నీరు సౌకర్యం కల్పించటమే లక్ష్యమని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. 40వ డివిజన్ పరిధి భవానీపురం లారీ స్టాండ్ ప్రాంగణంలో బుధవారం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.30 కోట్లతో నిర్మించిన రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు నియోజకవర్గంలో రెండు రిజర్వాయర్లు నిర్మించారన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు వై.ఆంజనేయరెడ్డి, గుడివాడ నరేంద్ర రాఘవ, షేక్ ఇర్ఫాన్, మరుపిళ్ల రాజేష్, అబ్దుల్ అర్షద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరుణాకర్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ప్రసాదంపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాటిదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గన్నవరం నియోజకవర్గంలో వివిధ ఆరోగ్య కారణాలతో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్న మానికొండ గ్రామానికి చెందిన బెజవాడ కృష్ణారావుకు రూ.60 వేలు, నున్న గ్రామానికి మాణిక్యంకు రూ. 2,25,000ల ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ఎన్నో కుటుంబాలను సీఎం సహాయ నిధి ఆపద్బంధువునిగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు.



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



శైలజకు సీఎం ఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేత

ఉయ్యూరు : బోళ్లపాడుకు చెందిన గుంటక శైలజ వైద్యఖర్చులకు సీఎం సహాయనిధి నుంచి రూ. 3.5 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం అందజేశారు. శైలజ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ద్వారా దరఖాస్తు చేసుకుంది. ఆ మేరకు మంజూరైన మొత్తానికి సంబంధించి ఎల్‌వోసీని అందజేశారు. జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, టీడీపీ నాయకులు కె.వాసు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులు సిహెచ్ బాబూరావుకు విరాళం అందజేస్తున్న దాత వెంకట సుబ్బమ్మ

సాంస్కృతిక కళా వేదిక నిర్మాణానికి విరాళం

రాణిగారితోట, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): రాణిగారితోట లోని సుందరయ్య గ్రంథాలయంలో సాంస్కృతిక కళా వేదిక నిర్మాణానికి నడికట్టు వెంకట సుబ్బమ్మ విరాళం అందించినట్టు సీపీఎం నాయకులు హరినారాయణ తెలిపారు. విరాళాన్ని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీ ఆఫీసులు ప్రజలు నిర్మించుకున్నవని వీటి ప్రయోజనాలు ప్రజలకు అందాలని, ఇవి ప్రజా సాంస్కృతిక వేదికలన్నారు. వేదిక నిర్మాణం పూర్తయిన తరువాత నడికట్టు వెంకటరెడ్డి పిల్లల పేరు మీదగా మెమో రియల్ హాల్ పేరు పెట్టడానికి పార్టీ అనుమతిస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర కమి టీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ వెంకట సుబ్బమ్మ చేస్తున్న కార్యక్రమం రాణిగారితోట ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నాయకులు టి.చంద్రశేఖర్, వై.కృష్ణ, కోటిరెడ్డి, మోహనరావు, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అత్యుత్తమ పరిపాలనాదక్షుడు వాజ్‌పేయి

పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశానికి అత్యుత్తమ సుపరిపాలనను అందించిన వ్యక్తి అటల్ బిహారీ వాజ్‌పేయి అని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. భారత మాజీ ప్రధాని వాజ్ పేయి శత జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గంలోని 51, 52, 53 డివిజన్ల అధ్యక్షులు పంచిపిళ్ల హరి నారాయణ, జగలింకి రామకృష్ణ, అడ్డూరి ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో కోమల విలాస్ ప్రాంతంలో కేక్ కట్ చేశారు. ప్రతి ఒక్కరూ వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆపిల్ పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బోగవల్లి శ్రీధర్, పోతిన బేసుఖంటేశ్వరుడు, అవ్వారు బుల్లబ్బాయి, వేరుకొండ ఉమాకాంత్, పైలా సురేష్, తదితరులు పాల్గొన్నారు. వాజ్‌పేయి సేవాదళ్ ఆధ్వర్యంలో భవానీపురంలోని అటల్ బిహారీ వాజ్‌పేయి పార్క్‌లో విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ సేవాదళ్ ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ సహకారంతో వాజ్‌పేయి విగ్రహాన్ని తమ చేతుల మీదుగా పునః ప్రతిష్ఠ చేయడం సంతోషంగా ఉందన్నారు. సేవాదళ్ సభ్యులు కొల్లపల్లి గణేష్, అవావరు శ్రీనివాసరావు, బోయపాటి నాని చౌదరి, పసుపులేటి రఘురాం, పట్నాయక్ పాల్గొన్నారు.

శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల సాయం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స పొందుతున్న రేవతి కుమారుడు శ్రీతేజ్‌ను బుధవారం దిల్ రాజుతో కలిసి అల్లు అరవింద్ మరోసారి పరామర్శించారు శ్రీతేజ్ ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద అల్లు అరవింద్ మాట్లాడుతూ.. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు వైద్యులు చెప్పారని తెలిపారు. శ్రీతేజ్ శరీరంలో పూర్తి స్థాయిలో కదలికలు వచ్చాయని చెప్పారన్నారు. అతని ఆరోగ్యం పూర్తిస్థాయిలో మెరుగు పడేంతవరకు అన్నిరకాల వైద్య చికిత్సలు అందించడానికి తమవైపు నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుని మనందరితో కలిసి తిరుగుతాడని ఆశిస్తున్నట్లు చెప్పారు. వారి కుటుంబానికి చేయదలచుకున్న ఆర్థిక సాయానికి సంబంధించి ప్రభుత్వ ప్రతినిధిగా దిల్ రాజుకు అందజేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఆ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామన్నారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నాం..

శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, వెంటిలేటర్, ఆక్సిజన్ లేకుండా 72 గంటలుగా శ్వాస తీసుకోగలుగుతున్నాడని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. అతని కుటుంబానికి అల్లు అర్జున్, నిర్మాతలు, దర్శకుడి తరఫున రూ.2 కోట్ల సాయం అందజేశామన్నారు. గురువారం సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నామని చెప్పారు. సీఎం అపాయింట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో సినీ పరిశ్రమ ప్రధాన సమస్యలపై చర్చించనున్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను బుధవారం కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పరామర్శించారు. సినిమా కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ తరఫున అండగా ఉంటామని చెప్పారు.

జానీ మాస్టర్ లైంగిక వేధింపులు నిజమే

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ నృత్య దర్శకుడు జానీ మాస్టర్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. అతను తన వద్ద పనిచేసిన సహాయ నృత్య దర్శకురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు చార్జిషీట్ దాఖలు చేశారు. జానీ మాస్టర్ ఆమెను ఈవెంట్ల పేరుతో పలు ప్రాంతాలకు తీసుకువెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధిత యువతి సెప్టెంబరు 15న పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. నార్సింగ్ పోలీసులు జానీ మాస్టర్‌ను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించగా, కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో అక్టోబరు 25న విడుదలయ్యాడు.

జనవరి 21న కృష్ణా బోర్డు భేటీ

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం వచ్చే నెల 21వ తేదీన జరుగనుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు బోర్డు సమాచారం పంపింది. బోర్డు ఆర్థిక వ్యవహారాలు, రెండు రాష్ట్రాలూ ఇవ్వాల్సిన నిధులు, బోర్డు విధివిధానాల ఖరారు, అమరావతికి బోర్డు తరలింపును ఉమ్మడి ఎజెండాలో చేర్చింది. ఆంధ్రప్రదేశ్ ఆరు చర్చనీయాంశాలను ప్రతిపాదించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర జలశక్తి శాఖ తెలంగాణకు తిప్పి పంపిన నేపథ్యంలో ఈ భేటీలో బోర్డు ఏం చెబుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అలాగే బోర్డు కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తామని ఇటీవల జలశక్తి శాఖ తెలిపింది. 21న జరిగే భేటీలో అయినా దీనిని తేల్చుతారా.. ఎప్పటి మాదిరిగానే దాటవేస్తారా అనే సందేహం నెలకొంది. విభజన చట్టం ప్రకారం ఏనాడో విజయవాడలో కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అప్పట్లో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. కృష్ణా నదితో ఎలాంటి సంబంధమూ లేని విశాఖకు ఈ కార్యాలయాన్ని తరలించాలని ప్రతిపాదించారు. దీనిని కేఆర్ఎంబీ కూడా గుడ్డిగా సమర్థించింది.

అమ్మ వచ్చింది!

పాతికేళ్ల తర్వాత కలుసుకున్న తల్లీపిల్లలు

- ఉద్వేగంతో ఉబ్బితబ్బిబ్బయిన కుటుంబం
- పెళ్లికి వెళ్లి తప్పిపోయిన సాకమ్మ
- అధికారుల చొరవతో నిరాశ్రయుల కేంద్రం నుంచి ఇంటికి



ఎయిర్‌పోర్టులో తల్లిని హత్తుకుని విలపిస్తున్న కుమారులు

ఇరవై ఐదేళ్ల క్రితం అదృశ్యమైన అమ్మ... ఒక్కసారిగా కళ్లముందు ప్రత్యక్షం. అంతే, ఆ పిల్లలు ఉద్వేగానికి గురయ్యారు...కట్టలు తెంచుకుని వచ్చిన కన్నీళ్లను తుడుచుకుని కన్నతల్లిని హత్తుకున్నారు. వారిని చూడగానే ఆ తల్లి పరిస్థితీ అంతే...పిల్లలను ఈ జన్మలో చూస్తానో చూడనో అంటూ తపించి, తల్లడిల్లుతున్న మాతృహృదయానికి ఎట్టకేలకు సాంత్వన చేకూరింది.

సాకమ్మ.... పాతికేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం హొసపేటలో బంధువుల ఇంట పెళ్లికి వెళ్లి పొరబాటున వేరే రైలు ఎక్కేశారు. ఆరైలు రాష్ట్రాల సరిహద్దులు దాటిపోయింది. రైలు దిగి ఎక్కడెక్కడో తిరిగి సాకమ్మ హిమాచల్‌ప్రదేశ్ చేరారు. అక్కడి అధికారులు అనాథ మహిళగా భావించి, మండి జిల్లా నిరాశ్రయుల కేంద్రంలో చేర్పించారు. ఆమెకు మతిస్థిమితం కాస్త సరిగా లేకపోవడంతో ఇలా జరిగింది. ఆమె కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తరువాత ఎనిమిది రోజులకు గుర్తు తెలియని మహిళ మృతదేహం చిక్కినట్టు పోలీసులు తెలపడంతో వెళ్లి చూసి, సాకమ్మదే అని భావించి అంత్యక్రియలు కూడా నిర్వహించారు.

ఆ అధికారి చొరవతో..: కర్ణాటకలోని మండ్య జిల్లాకు చెందిన ఐపీఎస్ అధికారి రవినందన్ ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో పనిచేస్తున్నారు. ఆయన సాకమ్మ గురించి తెలుసుకుని, బెంగళూరులోని తన స్నేహితులకు వీడియో పంపించారు. వారు సాకమ్మ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి కర్ణాటక సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి పి.మణియణ్ణన్ స్పందించారు. ఐపీఎస్ అధికారి రవినందన్‌ను సంప్రదించి, సాకమ్మ వివరాలను సేకరించారు. ఆమె బళ్లారివాసి అని తెలుసుకుని, ఇక్కడి అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యులు, పిల్లలు బళ్లారి నగరంలోని గుగ్గరహట్టిలో ఉన్నట్టు గుర్తించారు. హిమాచల్‌ప్రదేశ్‌కు అధికారుల బృందం వెళ్లి...వీడియో కాల్ చేసి కుమారుడు విరాట, కూతురు లక్ష్మిని సాకమ్మకు చూపించి, మాట్లాడించారు. ఆమెను చూసి గుర్తుపట్టిన ఆ కుటుంబం ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. అధికారుల బృందం ఆమెను హిమాచల్ ప్రదేశ్ నుంచి విమానంలో మంగళవారం రాత్రి బెంగళూరుకు తీసుకు వచ్చింది. అప్పటికే ఎయిర్ పోర్టుకు చేరుకున్న సాకమ్మ ఇద్దరు కుమారులు తల్లిని చూడగానే ఉద్వేగంతో కళ్లనీళ్లు పెట్టుకున్నారు. సంక్షేమ శాఖ ఉన్నతాధికారి మణియణ్ణన్ బుధవారం సాకమ్మను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రత్యేక వాహనంలో వారంతా స్వస్థలానికి బయలుదేరారు.

-బళ్లారి గాంధీనగర్, ఆంధ్రజ్యోతి

వర్షం రాకతో కొత్త పెట్టె కొనుగోలు!

- పార్శిల్‌లో మృతదేహం కేసులో కొత్త కోణాలు
- ఆస్తి కోసం అక్కనే బెదిరించేందుకు చెల్లెలు, మరిది పన్నాగాలు



గాంధీనగర్‌లోని నిందితుని ఇంటి వద్ద ఉన్న మరో చెక్క పెట్టె

భీమవరం క్రైం/ఉండి/కాళ్ల, డిసెంబరు 25(ఆంధ్ర జ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో కలకలం రేపిన 'పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ' కేసులో కొత్తకోణాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సాగి తులసి మరిది తిరుమాని శ్రీధర్‌వర్మ(అలియస్ సుధీర్ వర్మ, అలియాస్ సిద్ధార్థ వర్మ) పోలీసుల అదుపులో ఉన్నాడు. శ్రీధర్‌వర్మ కాళ్ల గ్రామ శివారు గాంధీనగర్‌కు చెందిన బర్రె పర్లయ్యను హత్య చేసి బాక్సులో పెట్టి.. యండగండికి పంపించిన ఘటనలో తులసి చెల్లెలు అయిన రెండో భార్య.. రేవతి పూర్తి సహకారం అందించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. మూడో భార్య సుష్మ కూడా సహకారం అందించినట్లు భావిస్తున్నారు.

హత్య కేసుగా మార్పు

ఈ నెల 17న బర్రె పర్లయ్యను హత్య చేసేందుకు శ్రీధర్ వర్మ పక్కా ప్రణాళికతో చెక్క పెట్టెను సిద్ధం చేసుకున్నాడు. మద్యం తాపించి ఉండి మండలం వాండ్రం గ్రామ సమీపంలో హత్య చేశాడు. మృతదేహాన్ని చెక్కపెట్టెలో పార్శిల్ చేయడానికి గాంధీనగర్ తీసుకువెళుతుండగా వర్షం కురవడంతో, కారు ముందుకు వెళ్లే అవకాశం లేకపోయింది. దీంతో శవాన్ని కారులోనే ఉంచి, మరొక పెట్టెను కైకలూరు నుంచికొని తెచ్చాడు. అనంతరం మృతదేహాన్ని గణపవరం మండలం సాగిపాడు వద్దకు పెట్టెలో తీసుకువెళ్లి మూడో భార్య సుష్మ సాయంతో ఆటోకు అప్పగించి తులసికి డోర్ డెలివరీ చేశారు. ఇప్పటి వరకు అనుమానాస్పద కేసుగా ఉంచిన పోలీసులు బుధవారం దీనిని హత్య కేసుగా మార్పు చేశారు. తులసికి చెందిన ఆస్తిని కాజేయడం కోసమే శ్రీధర్‌వర్మ, అతడి రెండో భార్య రేవతి పన్నాగం పన్నారని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. శ్రీధర్ వర్మ రెండో భార్య రేవతి భీమవరంలోని పలు నగల దుకాణాల్లో బంగారం తాకట్టు పెట్టి, మరికొంత విక్రయించినట్లు తెలియడంతో బుధవారం మూడు బంగారం దుకాణాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. గాంధీనగర్‌లో మొదటి భార్య ఇంట్లో క్షుద్రపూజలకు సంబంధించిన కొన్ని వస్తువులు, పుస్తకాలు పోలీసులకు దొరికాయి. కృష్ణా జిల్లా మల్లంపూడిలో శ్రీధర్ వర్మ తల్లిదండ్రులను, ఆయన ముగ్గురు భార్యలు, పిల్లలు, యండగండికి చెందిన ముదునూరి రంగరాజు, అతడి భార్య హైమావతి, సాగి తులసిలను పోలీసులు వేర్వేరుగా పలు ప్రదేశాల్లో విచారిస్తున్నారు. ఒకట్రెండ్రోజుల్లో వివరాలు పూర్తిగా వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ నయీం అస్మి తెలిపారు.

కర్త, కర్మ, క్రియ.. కేటీఆరే!

ఆయన ఆదేశాలతోనే నిధుల మళ్లింపు.. సీనియర్ ఐఏఎస్ దానకిశోర్ వాంగ్మూలం!

ఫార్ములా-ఈ రేసు కేసులో కీలక పరిణామం.. నాలుగు గంటల పాటు ప్రశ్నించిన ఏసీబీ



దానకిశోర్

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చిన ఐఏఎస్ అధికారి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేసి కీలక ఆధారాలు సేకరించారు. రేసుకు సంబంధించి నాటి ప్రభుత్వానికి, బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు మధ్య జరిగిన ఒప్పందాలు, ఇన్‌వాయిస్‌లు, 2023 సెప్టెంబరు 27న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద‌కుమార్ నాటి మంత్రి కేటీఆర్‌కు పంపిన ఫైల్ ప్రతులను ఏసీబీ అధికారులు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం దాదాపు నాలుగు గంటల పాటు దానకిశోర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం తమకు అందుబాటులో ఉన్న ఫైళ్ల ప్రకారం నిధుల మళ్లింపు అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. దీనికి కర్త, కర్మ, క్రియ అంతా నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆరేనని దానకిశోర్ స్పష్టం చేసినట్లు సమాచారం. నిధులు విడుదల చేయడం పూర్తిగా నిబంధనల ఉల్లంఘనేనని, అనుమానాస్పద వ్యవహారమని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ ఆదేశాల మేరకే తాను నిధులను పంపానని అర్వింద‌కుమార్ అంగీకరించిన విషయాన్ని దానకిశోర్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అర్వింద‌కుమార్ అప్పట్లో పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండడంతో సీఎస్‌ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఫైళ్లను నడిపించారని తెలుస్తోంది. ఈ క్రమంలో అర్వింద‌కుమార్‌ను విచారించిన తర్వాతే కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటిరెండు రోజుల్లో అర్వింద‌కుమార్‌కు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే హైకోర్టు కేటీఆర్‌కు ఇచ్చిన గడువు ఈ నెల 30న ముగుస్తుండడంతో ఆ తర్వాతే నోటీసులకు వెళ్లాలా? అని కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కేసు నుంచి తనను బయటపడేయాలని, అరెస్టు వరకు వెళ్లకుండా చూడాలని అర్వింద‌కుమార్ ప్రభుత్వానికి సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను అప్రూవర్‌గా మార్చుకొని దర్యాప్తులో ముందుకు వెళ్లే యోచన కూడా చేస్తున్నట్లు సమాచారం.

దిశ మార్చుకున్న

తీవ్ర అల్పపీడనం

- నేడు బలహీనపడుతుందన్న వాతావరణశాఖ
- కోస్తా జిల్లాలకు వర్షసూచన.. పెరిగిన చలి

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నైరుతి, దానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం దిశ మార్చుకుంది. మంగళవారం వరకూ పశ్చిమ నైరుతిగా పయనించిన తీవ్ర అల్పపీడనం తరువాత వాయవ్యంగా పయనిస్తోంది. బుధవారం మధ్యాహ్నానికి దక్షిణ తమిళనాడు, ఉత్తర తమిళనాడుకు సమీపంలో కొనసాగుతోంది. గురువారం నాటికి వాయవ్యంగా పయనించి పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో అల్పపీడనంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాలో అనేకచోట్ల బుధవారం ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సముద్రం మీదుగా గాలులు వీయడం, చిరుజల్లులు కురుస్తుండడంతో కోస్తాలో చలి వాతావరణం కొనసాగింది. అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక కొనసాగుతుంది. గురువారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు, నెల్లూరు జిల్లాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి తేమగాలులు బలంగా రావడంతో ప్రస్తుతం పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనానికి అవసరమైన తేమ లభిస్తోందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

మలయాళ రచయిత వాసుదేవన్ నాయర్ కన్నుమూత



ప్రముఖ మలయాళ రచయిత, సినీ దర్శకుడు ఎంటీ వాసుదేవన్ నాయర్ (91) బుధవారం రాత్రి కొళిక్కోడ్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలతో ఆయన కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. పాలక్కాడ్ సమీపంలోని కడలూరు ఆయన సొంతూరు. వాసుదేవన్ నాయర్‌కు బాల్యం నుంచే మలయాళ సాహిత్యంపై ఆసక్తి కలిగింది. ఆయన కలం నుంచి జాలువారిన బాల సాహిత్యం, కథలు, పర్యాటక రచనలు, వ్యాసాలు, నవలలు మలయాళ సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందాయి. 'నాలుకెట్టు, అసురవిత్తు, మంజు, సర్పవిత్తు' తదితర రచనలు విశేష పాఠకాదరణ పొందాయి. కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన తర్వాత మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన వాసుదేవన్ 54 చిత్రాలకు స్ర్కీన్‌ప్లే అందించారు. ఏడు సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన 'నిర్మాల్యం', 'కడవు' సినిమాలకు ఉత్తమ చిత్రం విభాగంలో జాతీయ చలనచిత్ర పురస్కారాలు దక్కాయి. ఇప్పటివరకూ ఉత్తమ స్ర్కీన్‌ప్లే రచయితగా నాలుగుసార్లు జాతీయ అవార్డు అందుకున్న అరుదైన ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు. వాసుదేవన్ రాసిన తొమ్మిది కథల ఆధారంగా తెరకెక్కిన 'మనోరథంగల్' వెబ్‌సిరీస్ ఈ ఏడాది ప్రముఖ ఓటీటీలో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది. ఆయన పైన గౌరవంతో ఈ సిరీస్‌కు కమల్‌హాసన్ సమర్పకుడిగా వ్యవహరించగా, మోహన్‌లాల్, మమ్ముట్టి, ఫహద్ ఫాజిల్ లాంటి పలువురు అగ్రతారలు నటించారు. 1996లో జ్ఞాన్‌పీఠ్, 2005లో పద్మభూషణ్, 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను ఆయన అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్య నిర్వాహక సభ్యుడుగా, కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా, ఇండియన్ పనోరమ ఛైర్మన్‌గా ఆయన సేవలందించారు. కొంతకాలం మాతృభూమి వారపత్రికకు సంపాదకుడిగానూ ఆయన విధులు నిర్వర్తించారు. వాసుదేవన్ నాయర్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

హిట్ అవుతుందని ప్రభాస్ చెప్పారు

హీరో ధర్మ



ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు లహరిధర్, బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ "ఈ సినిమా కచ్చితంగా మీ అందర్నీ కదిలిస్తుంది. ధర్మకు ఉత్తమ పరిచయ నటుడిగా అవార్డు రావడం పక్కా. కథను నమ్మి నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా. చివరి 40 నిమిషాలు సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు. "ఈ సినిమాను నిర్మించే విషయంలో నిర్మాతలు ఎక్కడా రాజీ పడలేదు. నా అభిమాన హీరో ప్రభాస్‌ను కలసినప్పుడు ఈ సినిమాకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. "సినిమా బాగా వచ్చింది. టీజర్, ట్రైలర్ చూసిన ప్రతీ ఒక్కరూ కంటెంట్ బాగుందని మెచ్చుకుంటున్నారు" అని తెలిపారు.

ముత్యాల ముగ్గు

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com



ఇంద్రాణి ముక్కాల, హైదరాబాద్



ఆంగ్ల సాహిత్యంలో డిగ్రీ... బ్యాంకులో ఉద్యోగం... వీటికన్నా 'ఫిషర్‌ఉమన్' అనే గుర్తింపే తనకు ఎక్కువ సంతృప్తినిస్తోందంటోంది **సుభిక్షా కుమార్**. తమిళనాడులోని పెరియతలైకి చెందిన ఈ 23 ఏళ్ల అమ్మాయి చేపల వేటలోనే కాదు... ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా, సీ-వ్లోగర్‌గా కూడా తనదైన ముద్ర వేస్తోంది.

సాగరంలో సాహసి

"సముద్రంలో వేట ఎప్పుడూ కత్తిమీద సామే. ఎంత అనుభవం ఉన్నవారికైనా ప్రతి రోజూ ఒక అగ్నిపరీక్షే. పడవ ఎక్కి వెళ్ళినవారు సరుకు తీసుకొస్తారా? క్షేమంగా తిరిగొస్తారా?... మత్స్యకార కుటుంబాలను నిత్యం వేధించే ప్రశ్నలివి. ఆ కష్టాలను, వేదనలను చూస్తూ పెరిగాను. సముద్రం నా జీవితంతో విడదీయలేని భాగం అయిపోయింది. నేను పుట్టింది, పెరిగింది తమిళనాడులోని పెరియతలై మత్స్యకారవాడలో. నా తల్లితండ్రులు పెద్దగా చదువుకోలేదు. కానీ నన్ను బాగా చదివించాలని మా నాన్న కుమార్ ఆశపడ్డారు. ఆయన కోరిక తీర్చడానికి కష్టపడి చదివాను. ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రురాలినయ్యాను. మా ఇంట్లో నేనే తొలి గ్రాడ్యుయేట్‌ను. ఒక ఫైనాన్స్ సంస్థలో, తరువాత ఒక ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగాలు చేశాను. ఆ సమయంలో ఎంతో ఒత్తిడిగా ఉండేది. ఇంటికి దూరంగా ఉండడం దానికి కారణం అనుకున్నాను. కానీ ఏదో వెలితి వెంటాడుతూ ఉండేది. ఇంతలో కొవిడ్ మహమ్మారి విజృంభించడంతో లాక్‌డౌన్ విధించారు. దాంతో నా కుటుంబం నివసిస్తున్న తూత్తుకుడికి తిరిగి వచ్చాను. నేను కోల్పోతున్నదేమిటో అప్పుడు నాకు అర్థమయింది.

పట్టు వదల్లేదు...

"మీతో నేనూ సముద్రంలో వేటకి వస్తా"నని మా నాన్నతో అన్నప్పుడు... అది పరిహాసానికని అనుకున్నారు. ఎందుకంటే అది పురుషులకే పరిమితమైన వృత్తి. మగవాళ్ళు సముద్రంలోకి వెళ్ళి మత్స్య సంపదతో తిరిగి వస్తే... మహిళలు వాటిని వేరు చేసి, విక్రయిస్తూ ఉంటారు. సాధారణంగా ఎక్కడైనా ఇదే జరుగుతుంది. వేటకి వెళ్ళే మహిళలు కొందరు ఉన్నారని విన్నాను, కానీ అది చాలా అరుదు. నేను పదేపదే అడగడంతో "పెరియతలై దగ్గర సముద్రం చాలా కల్లోలంగా ఉంటుంది. కెరటాలు చాలా బలంగా ఉంటాయి. పరిస్థితులు నిరంతరం సవాల్ విసురుతూ ఉంటాయి. నువ్వు మాతో వచ్చి ప్రమాదాల్లో పడడం నాకు ఇష్టం లేదు" చెప్పారు నాన్న. అయినా నేను మొండిపట్టు వదల్లేదు. చివరికి "సరే! ఒకసారి తీసుకువెళ్తాను. అంతా నీకే అర్థమవుతుంది" అన్నారు. ఇక... సముద్రంలో నా మొదటి అనుభవాన్ని 'అద్భుతం' అనే చెప్పాలి. అందరు మత్స్యకారుల్లాగానే మేము కూడా అర్ధ రాత్రి ఒంటి గంటకు ఫైబర్ పడవల్లో బయలుదేరాం. అవి అమావాస్య రోజులు. చాలా చీకటిగా ఉంది. ఆకాశంలో నక్షత్రాలు చెదిరిపోయిన వజ్రాల్లా మెరుస్తున్నాయి. ముందుకు వెళుతున్నకొద్దీ సముద్రం అందాన్ని చూసి నేను మైమరచిపోయాను. అదే సమయంలో చాలా ఎత్తుగా లేస్తున్న అలలు పడవను పైకి లేపి, మళ్ళీ కింద పడేస్తున్నప్పుడు... చాలా భయం వేసింది. మెల్లగా అలవాటు పడ్డాను. వలలు విసరడం, లాగడం, చేపల్ని పడవలో కుప్పలు పోయడం... ఇలా అన్ని పనులు ఉత్సాహంగా చేశాను. ఉదయం పది గంటలకు తిరిగి తీరాన్ని చేరుకున్నాం. ఆ తరువాత నాన్నకు నామీద నమ్మకం వచ్చింది. అప్పటినుంచి నేను కూడా వాళ్ళ బృందంలో భాగమైపోయాను.



అదే పెద్ద సమస్య...

సముద్రంలో వేటకు కేవలం శరీర దారుఢ్యం మాత్రమే కాదు, ధైర్యం కూడా కావాలి. రకరకాల చేపలను, రొయ్యలను పట్టుకోడానికి వివిధ రకాల వలలు ఉపయోగించాలి. సముద్రంలోకి వలలు విసిరేటప్పుడు, వాటిని సముద్రంలోకి లాగేటప్పుడు చాలా కచ్చితత్వంతో పని చెయ్యాలి. కల్లోలంగా ఉండే కెరటాల్లో, తుపాను వాతావరణంలో ప్రయాణించేటప్పుడు జాగ్రత్త, సమయస్ఫూర్తి అవసరం. సాధారణంగా మా బృందంలో నాన్న, నేను, నా తమ్ముడు లియాండర్, మరికొందరు సహాయకులు ఉంటాం.. సుమారు పన్నెండు నాటికల్ మైళ్ళ వరకూ మా ప్రయాణాలు సాగుతాయి. ఇంత చేసినా కొన్ని రోజులు ఖాళీ చేతుల్తో వెనక్కి రావలసి ఉంటుంది. ఇదివరకు మా నాన్న ఏదీ దొరక్క విచారంగా వెనక్కి రావడం చూసేదాన్ని. ఇప్పుడు అది నా అనుభవంలోకి వచ్చింది. మహిళగా నాకు ఎదురైన సమస్య.. పడవల్లో కనీస సదుపాయాలు ఉండక పోవడం. సముద్రం మధ్యలో టాయిలెట్‌కు వెళ్ళాల్సి వస్తే చాలా కష్టం. దాన్ని అధిగమించడం నేర్చుకున్నాను.

గర్వంగా ఉంది...

ఈ వృత్తి నాకు కొత్త ఆదాయ మార్గాలను కూడా చూపించింది. ఇప్పుడు నేను విజయవంతమైన సీఫుడ్ ఎంటర్‌ప్రెన్యూర్‌ని. చేపలతో, రొయ్యలతో ఏడు రకాల పచ్చళ్ళను తయారు చేస్తున్నాను. వాటిని స్థానికంగానే కాదు, ఇన్‌స్టాగ్రామ్ సాయంతో విక్రయిస్తున్నాను. విదేశాలకు వెళ్ళేవారు కూడా వాటిని కొంటున్నారు. దీనిద్వారా మరికొందరు మహిళలకు ఉపాధి కూడా కల్పిస్తున్నాను. అలాగే మత్స్యకారుల జీవితాన్ని, సముద్రం అందాలను ప్రజలకు చూపించడానికి 'సీ వోగ్లర్'గానూ మారాను. మా ప్రయాణాలను, ప్రజలకు సముద్ర ఉత్పత్తుల అందించడానికి మత్స్యకారులు చేసే సాహసాలను, చేపల వేటలో మెళకువలను వీడియోలు తీసి పోస్ట్ చేస్తున్నాను. నా యూట్యూబ్ ఛానెల్‌కు 2.5 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 1.34 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. దక్షిణాదిలో 'ఏకైక మహిళా సీ వ్లోగర్' నేనే కావడం గర్వంగా ఉంది. మహిళలు కూడా ఈ వృత్తిలో రాణించగలరనడానికి నేనే ఉదాహరణ. ఒకప్పుడు నేను ఎదుర్కొన్న ఒత్తిడి ఇప్పుడు మాయమయింది. తరతరాల వారసత్వమైన ఈ వృత్తిని కొనసాగిస్తున్నందుకు సంతృప్తిగా ఉంది. ఒక విధంగా ఇది నా మూలాల్లోకి నేను చేస్తున్న ప్రయాణం. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించడం, వీలైనన్ని ప్రాంతాలకు పర్యటించి, సముద్రపు వేటలో కొత్త నైపుణ్యాలు తెలుసుకోవడం... ప్రస్తుతానికి ఇవీ నా లక్ష్యాలు."

సూర్య నమస్కారం చేద్దాం

సూర్యుడు నమస్కార ప్రియుడు. కేవలం అయిదు నిమిషాలు నమస్కరిస్తే చాలు శరీరం, మనసు ఉత్తేజితం అవుతాయని పెద్దలు చెబుతుంటారు. సూర్యుడు ఉదయించగానే తూర్పు దిక్కుకు అభిముఖంగా నిలబడి సూర్య నమస్కారం చేయాలి. అలాగే సాయంత్రం పూట పశ్చిమ దిక్కుకు నిలబడి సాధన చేయవచ్చు. యోగాలో సూర్య నమస్కారాన్ని పన్నెండు ఆసనాల ద్వారా చేస్తుంటారు. వీటిలో కనీసం మూడింటిని ప్రతిరోజూ సాధన చేస్తూ ఉంటే అనారోగ్యం దరిచేరదు. సూర్య నమస్కారంతో దినచర్య ప్రారంభించడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం!

జీర్ణ వ్యవస్థకు

సూర్య నమస్కారంలో భాగంగా శరీరాన్ని ముందుకు వంచడం, సాగదీయడం వల్ల పొత్తికడుపుపై ఒత్తిడి పెరుగుతుంది. దీనితో కడుపులో పేరుకున్న వాయువులు బయటికి వెళ్లిపోతాయి. పేగుల్లో రక్త ప్రసరణ మెరుగవుతుంది. పొట్టలో వేడి ఉత్పత్తి కావడం వల్ల ఆహారపదార్థాలు తేలికగా జీర్ణమవుతాయి. అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి సమస్యలు రావు.

బరువు తగ్గేందుకు

ఏ భంగిమలో సూర్య నమస్కారం చేసినప్పటికీ శరీరంలో శక్తి ఖర్చయిపోతుంది. జీవక్రియలు వేగవంతమవుతాయి. దీనివల్ల శరీరంలో నిల్వ ఉన్న అదనపు కొవ్వులు పూర్తిగా కరిగిపోతాయి. ప్రతి రోజూ క్రమం తప్పకుండా కనీసం మూడు భంగిమల్లో సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.



శిరోజాలకు

సూర్య నమస్కారాల్లో భాగంగా తల వంచడం, తిప్పడం, ఎత్తడం వంటివి చేస్తాం. దీనివల్ల తల మీద ఉన్న చర్మానికి వేగంగా రక్తప్రసరణ జరిగి వెంట్రుకల కుదుళ్లు గట్టిపడతాయి. దీంతో వెంట్రుకలు రాలడం, జుట్టు నెరవడం వంటి సమస్యలు తీరిపోతాయి. మంచి పోషణ అంది శిరోజాలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి.

చర్మానికి

సూర్యునికి ఎదురుగా నిలబడి సూర్య నమస్కారాలు చేస్తున్నపుడు చెమట ద్వారా చర్మంలోని వ్యర్థ పదార్థాలన్నీ బయటికి వచ్చేస్తాయి. దీంతో చర్మం తాజాగా ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఉదయాన్నే సూర్య నమస్కారం చేస్తే చర్మానికి తగిన పోషణ అంది ముడతలు, గీతలు రావు. అంతగా తీవ్రతలేని సూర్యకిరణాల వేడివల్ల చర్మం మీద కొత్త కణాలు ఉత్పత్తి అయి మొటిమలు, మచ్చలు తగ్గిపోతాయి. సాయంత్రం సమయాల్లో సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరం అలసిపోయి మంచి నిద్ర పడుతుంది. తగినంత విశ్రాంతి పొందడం వల్ల శరీరం, మనసు ఉత్సాహంగా ఉండి ముఖానికి కొత్త కాంతి వస్తుంది.


నెలసరి సమస్యలకు

మహిళలు ఉదయాన్నే సూర్య నమస్కారాలు చేయడం వల్ల లిపిడ్ ప్రొఫైల్ మెరుగుపడి నెలసరి సమస్యలు తగ్గుతాయి. నీరసం, బలహీనత, పొత్తికడుపు నొప్పి బాధించవు. ప్రతిరోజూ కనీసం పావు గంట శరీరానికి ఎండ తగిలేలా సూర్య నమస్కారాలు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

'సక్యులెంట్స్'తో సరికొత్తగా...

అందమైన ఆకులతో కనువిందు చేసే మొక్కలే 'సక్యులెంట్స్'. ఇవి ఎడారి మొక్కలు. దళసరి ఆకులతో సహజసిద్ధంగా ఉంటూ చూడడానికి పగడపు దిబ్బలు, ఆక్టోపస్ లాంటి సముద్ర జీవుల ఆకృతులను పోలి ఉంటాయి. చిన్న కుండీల్లో సైతం చక్కగా పెరుగుతాయి. సంరక్షణ కూడా పెద్దగా అవసరం ఉండదు. ప్రస్తుతం ఇంటి అలంకరణలో ప్రత్యేక స్థానం వీటిదే. కార్యాలయాల్లో కూడా విరివిగానే పెంచుతున్నారు. పలు సందర్భాల్లో ఈ మొక్కలను కానుకగా ఇచ్చి పుచ్చుకుంటున్నారు. ఇంట్లో అందంగా పెరిగే సక్యులెంట్స్ ఇవే...

జేడ్




దీనిని మోహిని మొక్క అని కూడా అంటారు. మందపాటి చిన్న ఆకులతో గుబురుగా పెరుగుతుంది. దీనికి నీరు ఎక్కువగా అవసరం లేదు. కుండీలోని మట్టి పూర్తిగా పొడిగా అయితేనే నీళ్లు పోయాలి. రోజుకి కనీసం నాలుగు గంటలు మొక్కకి ఎండ తగిలేలా చూసుకోవాలి. ఈ మొక్క ఇంటి లోపలి గాలిని శుభ్రం చేస్తుంది. కుండీని గదిలో ఆగ్నేయం మూలలో లేదా తూర్పు వైపున పెట్టుకుంటే అదృష్టం కలిసి వస్తుందనీ ఆర్థిక ప్రయోజనాలు సమకూరుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు.

పాండా



దీని ఆకులు వెడల్పుగా మందంగా ఉంటాయి. ఆకు మొత్తం ముదురు ఆకుపచ్చ రంగులో ఉన్నప్పటికీ అంచులు మాత్రం ఎర్రని రంగులో ఉంటాయి. చిన్న, పెద్ద ఆకులతో గుబురుగా పెరిగి ప్రత్యేకంగా కపిస్తుంది ఈ మొక్క. ఇంట్లో ఉండే కాంతి దీనికి సరిపోతుంది.

ఎలిఫెంట్ బుష్



ఇది జేడ్ మొక్కలాగే కనిపిస్తుంది కానీ ఆకులు అంత మందంగా ఉండవు. గుండ్రంగా ఉండే చిన్ని ఆకులతో కొమ్మ వేగంగా పెరుగుతూ నలువైపులా పచ్చదనాన్ని వ్యాపింపజేస్తుంది. ఇంటిని మొత్తం ఆక్సిజన్‌తో నింపేస్తుంది. ఇంట్లో ఉండే కాంతి, కొద్దిగా నీరు ఈ మొక్కకు సరిపోతాయి.

ఇకివేరియా



ఈ మొక్క చూడడానికి పెద్ద గులాబీ పువ్వులా ఉంటుంది. చక్కని రంగుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కొంచెం నీరు పోస్తే చాలు వేగంగా పెరుగుతుంది. ఎండిన ఆకులతో తయారు చేసే ఎరువు దీనికి సరిపోతుంది. వేడిని, చలిని తట్టుకుంటుంది.

పెరల్స్ స్ట్రింగ్

దీని ఆకులు గుండ్రంగా ఉంటూ ఆకుపచ్చని ముత్యాల్లా కనిపిస్తాయి. ఈ మొక్క సన్నని తీగలా పెరుగుతుంది.



వేలాడే కుండీల్లో అందంగా కిందికి జాలువారుతూ చక్కని అనుభూతిని కలిగిస్తుంది. ఇంటి ముందు లేదంటే గేటుకి ఇరుపక్కలా కుండీలు అమర్చుకుంటే పరిసరాలు అహ్లాదకరంగా కనిపిస్తాయి.

సెడమ్

ఈ మొక్క గుబురుగా పైకి పెరుగుతుంది. దీని ఆకులు చిన్నగా



మందంగా ఉంటాయి. ఇది ఎండ తగలకపోయినా కూడా చక్కగా పెరుగుతుంది. చిన్న కుండీల్లో ఈ మొక్క అద్భుతంగా కనిపిస్తుంది.

బుర్రోస్ టైల్



ఈ మొక్క కాండం లావాటి తాడులా ఉంటుంది. ఈ కాండానికి మందమైన ఆకులు కప్పి ఉంటాయి. ఇది చూడడానికి ఆకుపచ్చని బెలూన్ల దండలా కనిపిస్తుంది. ఈ మొక్కకు కొద్దిగా ఎండ అవసరం. లివింగ్ రూమ్ లేదా స్టడీ రూమ్‌లో ఈ మొక్క కుండీని ఏర్పాటు చేసుకుంటే మనసు ఉత్సాహంగా ఉంటుంది.

బనానా స్ట్రింగ్

పేరుకు తగ్గట్టు ఈ మొక్క ఆకులు లావుగా పొడవుగా అరటిపండును గుర్తుకు తెస్తాయి. కొద్దిగా నీరు చిలకరిస్తే చాలు. తక్కువ వ్యవధిలోనే కుండీ మొత్తం వ్యాపిస్తాయి. వేలాడదీ



సిన కుండీల్లో ఈ మొక్క అందంగా పెరుగుతుంది.

స్ఫూర్తి

చిన్న ప్రయత్నం... పెద్ద మార్పు

ఒక సర్పంచ్‌గా ఆమె చేసిన చిన్న ప్రయత్నం ఆ గ్రామ మహిళల ఆలోచనా విధానాన్నే మార్చేసింది. గృహిణి పేరుతో ఇంటి ముందు తగిలించిన నేమ్ ప్లేట్... వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. మగవారికి మగువ ఎందులోనూ తీసిపోదని చెబుతూ... వారిని సాధికారత దిశగా అడుగులు వేయిస్తున్నారు శేషన్‌దీప్ కౌర్ సిద్ధూ. ప్రస్తుతం పదవిలో లేకపోయినా... తన ప్రాంత మహిళలకు మార్గదర్శి అయ్యారు ఈ మాజీ సర్పంచ్.

"తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకొనే వరకూ ఇంట్లో ఆడవారికి క్షణం తీరిక దొరకదు. కానీ వారి కష్టం ఎవరికీ పట్టదు. వారి ఆవేదన అరణ్యరోదన. కనీస గుర్తింపునకు నోచుకోని జీవితాలు గృహిణులవి. కాలంతో పోటీపడి పరుగెడుతున్నా... ప్రపంచం మన అరచేతులలోకి వచ్చేసినా... మా గ్రామంలో ఇంకా అసమానతలే. ఇది నన్ను కలచివేసింది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఎవరో ఒకరు తొలి అడుగు వేయాలి. నేను చేసింది అదే. సర్పంచ్‌గా నాకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని... గ్రామీణ మహిళల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేశాను. పంజాబ్ బఠిండా జిల్లా మానక్‌ఖానా గ్రామం మాది. చిన్నప్పటి నుంచి నేను చదువులో ముందుండేదాన్ని. సివిల్స్ సాధించాలన్నది ఆశయం. దాని కోసం ఢిల్లీలో చదువుకొంటూ సన్నద్ధమయ్యాను.

గ్రామానికి తిరిగివచ్చి...

సివిల్స్ కోసం కఠోరంగా శ్రమించాను. 2018లో తొలిసారి పరీక్ష రాశాను. కానీ విఫలమయ్యాను. అది నన్ను బాగా కుంగదీసింది. అంత కష్టపడినా ర్యాంకు సాధించలేకపోవడంతో తిరిగి మా గ్రామానికి వచ్చేశాను. ఈసారి ఇంటి దగ్గరే ఉండి చదువుకొందామని నిర్ణయించుకున్నాను. కానీ మనం ఒకటి తలిస్తే దైవం మరోలా తలుస్తుందంటారు. నా విషయంలోనూ అదే జరిగింది. మా ఊళ్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకొని... నన్ను సర్పంచ్‌గా ఉండమని అడిగారు. పురుషాధిక్యం ఉన్న మా ప్రాంతంలో ఒక మహిళకు ఇలాంటి అవకాశం రావడం అరుదైన పరిణామం. గతంలో మా గ్రామంలో ఏ మహిళ కూడా ఈ పదవిని అలంకరించలేదు. దాంతో అడగంగానే సరేనన్నాను.

మార్పు వైపు తొలి అడుగు...

సర్పంచ్ అయ్యాను. బానే ఉంది. కానీ అసలు



సర్పంచ్‌గా నా విధులు, అధికారాలు ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. ఎక్కడ మొదలు పెట్టాలి? ఎలా మొదలుపెట్టాలి? అంతా అయోమయం. కానీ మార్పు తేవడానికి నాకు లభించిన అద్భుత అవకాశం ఇది. దీన్ని వదులుకోకూడదని నిశ్చయించుకున్నాను. ఢిల్లీలో ఉండగా మహిళా సాధికారతకు సంబంధించి నేను కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశాను. ఆ అనుభవం నాకు ఇక్కడ పనికివచ్చింది. ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగేందుకు కావల్సిన అంశాలపై దృష్టి పెట్టాను. అంతేకాదు, ఎప్పుడూ గుమ్మం దాటని ఆడవారి జీవితాల్లో వెలుగులు నింపి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ధ్యేయంగా పని చేయాలని అనుకున్నా. అందులో భాగంగా తొలుత తమ ఆశయాల సాధన దిశగా మహిళలను ప్రోత్సహించాను.

గ్రంథాలయంతో మొదలు...

ఆరంభంలో అందరూ నన్ను అవహేళన చేశారు. నీవల్ల ఏమవుతుందంటూ ప్రశ్నించారు. ఎవరు ఏమన్నా, ఎంత నిరుత్సాహపరిచినా... నా సామర్థ్యం ఏమిటో నాకు తెలుసు. సర్పంచ్‌గా నా తొలి ముద్ర గ్రంథాలయ నిర్మాణం. అధ్వాన్నంగా ఉన్న రోడ్ల పనుల వంటివి పక్కన పెట్టి ఎవరికీ ఉపయోగంలేని గ్రంథాలయం ఏంటని చాలా మంది ప్రశ్నించారు. నాకు పిచ్చి పట్టిందని కొందరు వ్యాఖ్యానించారు. అది ఒక భవనం మాత్రమే కాదు... గ్రామంలోని భవిష్యత్ తరాల ఆశలు, ఆశయాలకు ఒక చిహ్నమని చెప్పాను. పిల్లల ఎదుగుదలలో గ్రంథాలయాల పాత్ర ప్రముఖమైనదని వివరించాను. అందులో అన్ని వయసులవారికీ ఉపయోగపడేలా పంజాబీ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విలువైన పుస్తకాలు పెట్టాము. భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు అమర్చాం. క్రమంగా గ్రామస్తులందరూ గ్రంథాలయానికి వెళ్లడం అలవాటుగా మార్చుకున్నారు.

కన్నీళ్లు పెట్టుకున్నారు...

గ్రామ అభివృద్ధితో పాటు మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ఆ క్రమంలోనే ఇంటి ముందు నేమ్ ప్లేట్లు నన్ను ఆకర్షించాయి. అవి చూసినప్పుడు అనిపించింది.. 'వాటిపై మగవారి పేరు మాత్రమే ఎందుకు రాయాలి' అని! గృహిణుల పేరుతో నేమ్ ప్లేట్లు రాయించాను. ప్రతి ఇంటి ముందూ వాటిని తగిలించాము. అవి చూసుకొని మహిళలు భావోద్వేగానికి లోనయ్యారు. 'మా ఆత్మగౌరవాన్ని నిలబెట్టావంటూ' కృతజ్ఞతలు చెప్పారు. ఒక యువతి నా దగ్గరకు వచ్చి... 'ఇప్పటివరకు నన్ను బయటకు అడుగుపెట్టనివ్వలేదు. నా నిర్ణయాలు నేను తీసుకొనే స్వేచ్ఛ లేదు. కానీ ఇవాళ ఇంటి ముందు నా పేరు చూసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. ఇలా ఒక మహిళ పేరుతో డోర్ ప్లేటు కనిపించడం మా ఊళ్లో ఇదే మొదలు. ఈ ఏడాది సర్పంచ్‌గా నా పదవీకాలం అయిపోయింది. కానీ మహిళను సాధికారత వైపు నడిపించేందుకు, వారి జీవితాల్లో మార్పు తెచ్చేందుకు నా పయనం సాగుతూనే ఉంటుంది."

మహిళలకు ప్రత్యేకం...

మార్పు వైపు నేను వేసిన మలి అడుగు... మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక పార్కు ఏర్పాటు. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలయ్యే ఆడవారికి తమకంటూ కాస్త సమయం కూడా దొరకదు. సరదాగా కాసేపు సేద దీరేందుకు అవకాశం ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని, తీరిక సమయంలో కాస్తంత ఆహ్లాదంగా గడిపేలా ఈ పార్కును తీర్చిదిద్దాము. ఇది స్థానిక మహిళల్లో గణనీయమైన మార్పునకు కారణమైంది. ఒక్కొక్కరుగా ఇంటి నుంచి బయటకు వచ్చి, స్వేచ్ఛగా కాసేపు పార్కులో గడుపుతున్నారు. స్నేహితులతో మనసు విప్పి మాట్లాడుకో గలుగుతున్నారు. అంతకముందు ఇక్కడ మహిళల కోసం ఎలాంటి ప్రత్యేక సదుపాయాలూ లేవు.

తెలగపిండి కూర

చలికాలంలో మనకు రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. అందుకే తరచూ జబ్బుల బారిన పడుతుంటాం. ఇలాకాకుండా ఉండాలంటే బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. శీతాకాలంలో తినాల్సిన ఆహార పదార్థాల్లో నువ్వులు ప్రధానమైనవి. వీటిలో కాల్షియం, పీచుపదార్థాలు, ఇతర పోషకాలు నిండి ఉంటాయి. నువ్వులను గానుగలో వేసి తిప్పి నూనెను తీశాక మిగిలిన పిప్పినే తెలగపిండి అంటారు. ఇది కూడా మంచి పోషకాహారం. చలికాలంలో తెలగపిండి కూర తినడం శ్రేష్ఠమని పెద్దలు చెబుతుంటారు.

ఇలా చేయాలి...



స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, పచ్చి శనగపప్పులను ఒక్కోటి ఒక చెంచా చొప్పున వేసి వేగనివ్వాలి. తరవాత నాలుగు ఎండు మిరపకాయలు, రెండు రెమ్మల కరివేపాకు తుంచి వేయాలి. పెద్ద ఉల్లిపాయను సన్నగా తరిగి వేయాలి. రెండు వెల్లుల్లి రెబ్బలను పొడవుగా కోసి వేయాలి. అన్నీ బాగా కలిపి మూతపెట్టి మగ్గనివ్వాలి. తరవాత అర చెంచా పసుపు, రెండు చెంచాల కారం, ఒకటిన్నర చెంచా ఉప్పు వేసి కలిపి ఒక చిన్న గ్లాసు నీళ్ల పోసి మరగనివ్వాలి. ఈ నీళ్లలో ఒక చిన్న గ్లాసు తెలగపిండిని ఎడమ చేత్తో వేస్తూ కుడిచేత్తో పట్టుకున్న గరిటెతో వేగంగా తిప్పాలి. స్టవ్‌ని చిన్న మంటమీద ఉంచి పిండి ఉండలు కట్టకుండా దగ్గరకు వచ్చేదాకా గరిటెతో తిప్పుతూ ఉండాలి. నీళ్లన్నీ ఇంకిపోయి పిండి పొడిగా మారాక కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇది వేడి అన్నంలోకి చాలా బాగుంటుంది.

ఎందుకు తినాలంటే...

తెలగపిండి కూర శరీరానికి బలాన్ని, పుష్టిని అందిస్తుంది. చలికాలంలో శరీరాన్ని వేడిగా ఉంచుతుంది. ఆస్తమా, జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ, శ్వాసకోశ వ్యాధుల నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. బాలింతలకు పాలు అధికంగా ఉత్పత్తి కావడానికి తోడ్పడుతుంది. శరీరానికి కావాల్సిన కాల్షియాన్ని అందించి ఎముకలు పెళుసుబారకుండా కాపాడుతుంది. చలికాలంలో రక్తనాళాలు కుంచించుకుపోయి రక్త ప్రవాహం అందక గుండెలో పలు సమస్యలు వస్తుంటాయి. తెలగపిండి కూర తినడం వల్ల వీటి నుంచి బయటపడవచ్చు.

బిజినెస్

విజయవాడ ● గురువారం 26 డిసెంబరు 2024

కుటుంబ షేరు పైపైకి

వారి పొదుపులో ఈక్విటీల వాటా 31 శాతానికి..

- వచ్చే 8-10 ఏళ్లు ఇదే ట్రెండ్ కొనసాగే చాన్స్
- ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ నివేదిక వెల్లడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారతీయ కుటుంబాలు దీర్ఘకాలిక పొదుపు కోసం ఈక్విటీలపై ఆధార పడే ట్రెండ్ ఏటేటా పెరుగుతూ వస్తోందని బ్రోకరేజీ సంస్థ ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్ వెల్లడించింది. దేశీయ కుటుంబాల పొదుపులో ఈక్విటీల వాటా 2016 ఆర్థిక సంవత్సరంలో 17 శాతంగా ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం నాటికి దాదాపు 31 శాతానికి చేరుకుందని నివేదికలో వెల్లడించింది. అంటే, 8 ఏళ్లకు పైగా కాలంలో ఈక్విటీ వాటా దాదాపు రెట్టింపైంది. ఈక్విటీల్లో వీరి పెట్టుబడుల పెరుగుదల ట్రెండ్ వచ్చే 8-10 ఏళ్లపాటు కొనసాగవచ్చని అంచనా వేసింది. బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ ఆదాయం తగ్గడం, సామాజిక భద్రత పథకాల లేమితో పాటు డిజిటల్ పెట్టుబడి వేదికలు అందుబాటులోకి రావడంతో కుటుంబాలు సంప్రదాయ పొదుపు సాధనాలైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, జీవిత బీమా పథకాల నుంచి ఈక్విటీల్లో పెట్టుబడుల వైపు దృష్టి మళ్లిస్తున్నారని నివేదికలో పేర్కొంది. గడిచిన కొన్నేళ్లలో భారత స్టాక్ మార్కెట్ల బలమైన పనితీరు కూడా కుటుంబాలను ఆకర్షిస్తోందని అంటోంది. దాంతో కుటుంబాలు ఈక్విటీల్లో నేరుగా లేదా మ్యూచువల్ ఫండ్ల ద్వారా పెట్టుబడులు పెడుతున్నారు. నివేదికలోని మరిన్ని విషయాలు..

- 2016-24 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో దేశీయ ఈక్విటీల్లో పెట్టుబడులు ఏటేటా 22 శాతం చొప్పున వృద్ధి చెందాయి. మన ఈక్విటీల్లో దేశీ ఇన్వెస్టర్ల వాటా క్రమంగా పెరుగుతుండటంతో విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల (ఎఫ్‌పీఐ)పై ఆధారం తగ్గుతోంది. దాంతో ఎఫ్‌పీఐలు భారీగా అమ్మకాలకు పాల్పడినప్పటికీ మన మార్కెట్ తట్టుకోగలుగుతోంది.
- 2019 మార్చి నుంచి బీఎస్ఈ 500 సూచీ కంపెనీల షేర్లలో ఎఫ్‌పీఐ వాటా 2.7 శాతం మేర తగ్గింది. మన మ్యూచువల్ ఫండ్లు సహా దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 4 శాతం పెరిగింది.
- 2016-24 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలంలో డీమ్యాట్ ఖాతాలు 39 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్)ను నమోదు చేయగా.. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల ఖాతాల సీఏజీఆర్ 19 శాతంగా ఉంది. ఇదే కాలంలో ఒక్కో డీమ్యాట్ ఖాతాలోని ఈక్విటీ షేర్ల రిటైల్ హోల్డింగ్ తగ్గింది. మార్కెట్లో కేంద్రీకృత ఈక్విటీ ఆస్తులు తగ్గుముఖం పడుతుందనడానికి ఇదే సంకేతం.
- మార్కెట్ పరిధి విస్తృతమవుతోంది. ప్రస్తుతం వ్యక్తిగత ఈక్విటీ పెట్టుబడుల్లో 27 శాతం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరవాసులకు చెందినవే.
- మ్యూచువల్ ఫండ్లు స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులకు మొగ్గుచూపుతుండగా.. ఎఫ్‌పీఐలు మాత్రం అధికంగా లార్జ్‌క్యాప్స్‌కే కట్టుబడి ఉంటున్నాయి.
- భవిష్యత్‌లో కుటుంబ పొదుపులో ఈక్విటీ వాటాయే కీలకం కానున్నప్పటికీ, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్స్)ల్లోకీ వీరి పెట్టుబడులు పెరగనున్నాయి.

ఐపీఓకి ఇండిక్యూబ్ స్పేసెస్

రూ.850 కోట్ల సమీకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్ సంస్థ ఇండిక్యూబ్ స్పేసెస్ లిమిటెడ్.. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. బెంగళూరు కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ కొత్త ఈక్విటీ షేర్ల జారీతో రూ.750 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా మరో రూ.100 కోట్లను సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు రిషి దాస్, మేఘనా అగర్వాల్ రూ.100 కోట్లకు సమానమైన వాటాలను విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించనున్న మొత్తాల్లో రూ.462.60 కోట్లను కొత్త సెంటర్ల ఏర్పాటుతో పాటు మూలధన వ్యయాల కోసం ఉపయోగించనుంది. మరో రూ.100 కోట్లను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది. 2015లో కార్యకలాపాలు ప్రారంభించిన ఇండిక్యూబ్ దేశవ్యాప్తంగా 13 నగరాల్లో 103 సెంటర్లను నిర్వహిస్తోంది.

2025లో జోరుగా విదేశీ పెట్టుబడులు!

2024లో ఫారిన్ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు భారీగా వెనక్కి

కొత్త ఏడాదిలో మళ్లీ పుంజుకోవచ్చంటున్న మార్కెట్ విశ్లేషకులు



గత సంవత్సరం భారత స్టాక్ మార్కెట్లో జోరుగా పెట్టుబడులు పెట్టిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. 2024లో తమ ఇన్వెస్ట్‌మెంట్లను భారీగా వెనక్కి తీసుకున్నారు. దాంతో ఈ ఏడాది మొత్తానికి ఎఫ్‌పీఐల నికర పెట్టుబడులు రూ.5,000 కోట్ల స్థాయికి పరిమితం కానున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లో అధిక వాల్యువేషన్లు, అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ నిరాశపర్చడం, అమెరికాలో వడ్డీ రేట్ల తగ్గుదల కారణంగా అక్కడి బాండ్ల రేటు పెరగడం వంటి అంశాలు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణకు ప్రధాన కారణమయ్యాయి. కొత్త సంవత్సరం (2025)లో ఈ పెట్టుబడుల ప్రవాహం మళ్లీ పుంజుకోవచ్చని స్టాక్ మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. మెరుగుపడనున్న కార్పొరేట్ కంపెనీల పనితీరు ఇందుకు దోహదపడనుందని వెంచురా సెక్యూరిటీస్ రీసెర్చ్ విభాగ అధిపతి వినీత్ బోలింజ్‌కర్ అన్నారు.

అయితే, మన మార్కెట్లో చాలా కంపెనీల షేర్లు ఇప్పటికీ అధిక ధరల వద్ద ట్రేడవుతుండటంతో పాటు ఆసియాన్, లాటిన్ అమెరికా మార్కెట్లలో షేర్లు ఆకర్షణీయ ధరలకు లభిస్తుండటం, ప్రపంచ ఆర్థిక మాంద్యం ముప్పు, అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ సహా అభివృద్ధి చెందిన దేశాల సెంట్రల్ బ్యాంకుల వడ్డీ రేట్ల తగ్గింపు, ట్రంప్ సుంకాల వడ్డన వంటి పరిణామాలు మన మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని పరిమితం చేసే ప్రమాదమూ లేకపోలేదన్నారు. డిపాజిటరీల వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ నెల 24 నాటికి మన ఈక్విటీల్లో ఎఫ్‌పీఐల నికర పెట్టుబడులు రూ.5,052 కోట్లుగా నమోదయ్యాయి. డెట్ మార్కెట్లో మాత్రం రూ.1.12 లక్షల కోట్లు పెట్టుబడిగా పెట్టారు. కాగా, 2023లో ఎఫ్‌పీఐలు మన ఈక్విటీల్లో నికరంగా రూ.1.71 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం సంవత్సరం (2022)లో రూ.1.21 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. 2019 నుంచి 2021 వరకు వరుసగా పెట్టుబడులు పెంచుకుంటూ వచ్చారు. ఈ ఏడాది విషయానికొస్తే, జనవరి, ఏప్రిల్, మే, అక్టోబరు, నవంబరుల్లో పెట్టుబడులను భారీగా వెనక్కి తీసుకున్నారు. కేవలం అక్టోబరు, నవంబరులో మొత్తం రూ.1.16 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

కొనసాగనున్న ఎఫ్‌డీఐల జోష్

అంతర్జాతీయ అనిశ్చితులు, సవాళ్ల నేపథ్యంలోనూ ఈ ఏడాది భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) భారీగానే వచ్చాయి. ఈ జనవరి నుంచి నమోదైన నెలవారీ ఎఫ్‌డీఐల సగటు 450 కోట్ల డాలర్ల పైమాటే. 2025లోనూ ఎఫ్‌డీఐల జోష్ కొనసాగనుందని.. మోదీ సర్కారు వ్యాపార, పెట్టుబడి సానుకూల విధానాలతో పాటు భారత్‌లో పెట్టుబడులపై ఆకర్షణీయ రిటర్నులు లభిస్తుండటం, చౌకగా నిపుణులు లభిస్తుండటం, సులభతర నియమావళి, అనుమతులకు సింగిల్ విండో సిస్టమ్, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకాలు ఇందుకు దోహదపడనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ జనవరి-సెప్టెంబరు కాలంలో దేశంలోకి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలు 4,213 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. 2023లో ఇదే కాలానికి వచ్చిన 2,973 కోట్ల డాలర్లతో పోలిస్తే ఈ ఏడాది పెట్టుబడులు 42 శాతం పెరిగాయి.

గడిచిన 10 ఆర్థిక సంవత్సరాల్లో (2014-2024) దేశంలో వచ్చిన ఎఫ్‌డీఐలు అంతక్రితం పదేళ్లతో పోలిస్తే 67 శాతం వృద్ధి చెంది 99,100 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, 2004-2014 మధ్యకాలంలో దేశీయ తయారీ రంగంలోకి వచ్చిన ఈక్విటీ ఎఫ్‌డీఐలు 9,800 కోట్ల డాలర్లుగా నమోదు కాగా.. 2014-2024 కాలానికి 69 శాతం వృద్ధితో 16,500 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఈ శతాబ్దంలో ఇప్పటివరకు (2000-24) వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు లక్ష కోట్ల డాలర్ల మైలురాయిని దాటాయి.

ఓలా ఎలక్ట్రిక్ @ 4,000 స్టోర్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నెట్‌వర్క్‌ను 4,000 స్టోర్లకు విస్తరించినట్లు ఓలా ఎలక్ట్రిక్ ప్రకటించింది. ప్రస్తుతమున్న నెట్‌వర్క్‌తో పోల్చితే ఇది నాలుగింతలు ఎక్కువని పేర్కొంది. సర్వీస్ సదుపాయలతో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కొత్తగా 3,200 కో-లొకేటెడ్ స్టోర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. మెట్రో నగరాలతో పాటు ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాలతో పాటు చిన్న పట్టణాలు, మండల స్థాయిల్లో ఈ స్టోర్లను నెలకొల్పినట్లు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. వాహన కొనుగోలు, సర్వీస్ సహా పలు అంశాల్లో వినియోగదారులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,450 ▲	71,000 ▲	99,900 ▲
విజయవాడ	78,500 ▼	72,300 ▼	91,000 ▼
విశాఖపట్నం	76,400 ▲	70,030 ▲	89,340 ▲
రాజమండ్రి	77,450 ▲	71,000 ▲	90,300 ▲
ప్రొద్దుటూరు	78,350 ▲	72,550 ▲	90,300 ▲
ముంబై	75,874 ▼	69,501 ▼	87,511 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	103	విజయవాడ	106
వరంగల్	103	గుంటూరు	109
కరీంనగర్	103	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	96
కర్నూలు	103	నెల్లూరు	96
విశాఖపట్నం	104	అనంతపురం	96
గోదావరి	106		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
		విజయవాడ	600
హైదరాబాద్	585	గోదావరి	600
వరంగల్	587	విశాఖపట్నం	600
చిత్తూరు	603	డజను గుడ్లు రూ. 84	

యూపీఐ లావాదేవీల్లో 33 శాతం వృద్ధి

పేనియర్‌బై వెల్లడి

న్యూఢిల్లీ: ఈ ఏడాది సెమీ-అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని చిల్లర విక్రయ కేంద్రాల వద్ద యూపీఐ ద్వారా చెల్లింపులు వార్షిక ప్రాతిపదికన 33 శాతం వృద్ధి చెందాయని డిజిటల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్ పేనియర్‌బై తాజా రిపోర్టు వెల్లడించింది. దేశంలో డిజిటల్ చెల్లింపుల సాధనాల వినియోగం శరవేగంగా పెరుగుతోందనడానికిదే నిదర్శనమని నివేదికలో పేర్కొంది. అంతేకాదు, బీమా పాలసీల కొనుగోలు, ప్రీమియం చెల్లింపుల లావాదేవీల సంఖ్య 127 శాతం పెరిగిందని, కొత్త కస్టమర్లు 96 శాతం పెరిగారని తెలిపింది. గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లోని 10 లక్షల రిటైల్ కేంద్రాల వద్ద ఈ ఏడాది జనవరి-నవంబరులో జరిగిన లావాదేవీల అధ్యయనం ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు పేనియర్‌బై వెల్లడించింది. వ్యాపార రుణాలు, బంగారం తాకట్టు రుణాలు వంటి రుణాలు ఈ ఏడాదిలో 297 శాతం పెరిగాయని తెలిపింది.

ఈప్యాక్ డ్యూరబుల్స్‌లో హైసెన్స్‌కు వాటా !

న్యూఢిల్లీ: చైనాకు చెందిన బహుళజాతి అప్లయెన్సెస్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ కంపెనీ హైసెన్స్ గ్రూప్.. భారత్‌కు చెందిన కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ ఈప్యాక్ డ్యూరబుల్స్‌లో మైనారిటీ వాటాను కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం వాటా విక్రయానికి సంబంధించి హైసెన్స్‌తో చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయని ఈప్యాక్ వెల్లడించింది. రూమ్ ఎయిర్ కండీషనర్స్‌లో ఈప్యాక్ డ్యూరబుల్.. భారత్‌లోనే రెండో అతిపెద్ద ఒరిజినల్ డిజైన్ మాన్యుఫ్యాక్చరర్ (ఓడీఎం)గా ఉంది. కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావటంతో పాటు కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కంపెనీ డెహ్రాడూన్, భివాడీ, శ్రీసిటీ ప్లాంట్లలో రూమ్ ఎయిర్ కండీషనర్లు, చిన్న గృహోపకరణ ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తోంది.

స్పోర్ట్స్

గగనంలో చిగురించి.. ఏడడుగులు నడిపించి..

దత్తసాయితో లవ్‌స్టోరీపై సింధు



న్యూఢిల్లీ: యువ వ్యాపారవేత్త వెంకట దత్తసాయితో స్టార్ షట్లర్ పీవీ సింధు ఏడడుగులు నడిచింది. భార్యగా కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న ఆమె..తన భర్త దత్తసాయితో తొలి పరిచయం గురించిన వివరాలను పంచుకుంది. 2022 అక్టోబరులో విమానంలో మొదటిసారి దత్తసాయిని చూడగానే అతడిపై ప్రేమ చిగురించిందని వెల్లడించింది. 'అది మొదలు నా జీవితం ఎంతో మారిపోయింది' అని సింధు ఉద్వేగంగా చెప్పింది. 'ఆ పయనం మా ఇద్దరిని దగ్గర చేసింది. రెండు నక్షత్రాలు ఒకటైన భావన కలిగింది. ఒక విధంగా అది 'లవ్ ఎట్ ఫస్ట్‌సైట్' అని సిగ్గుపడుతూ చెప్పుకొచ్చింది. తమ ఎంగేజ్‌మెంట్‌ను హడావుడి లేకుండా కొద్దిమంది సమక్షంలో జరుపుకోవడంపై వివరణ ఇచ్చింది. 'ఆ వేడుక ఆర్భాటంగా చేసుకొనేది కాదు. ముఖ్యమైన వ్యక్తులతో సన్నిహితంగా జరుపుకొనే మధుర క్షణం. అన్నింటికీ మించి జీవితాంతం గుర్తుండిపోయే అరుదైన జ్ఞాపకం' అని సింధు పేర్కొంది. వివాహానికి తాను, సాయి ఎలా ప్లాన్ చేసుకున్నామో కూడా తెలిపింది. 'ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా నా షెడ్యూల్ ఎంతో బిజీగా ఉంటుంది. అందువల్ల పెళ్లికి ఏం కావాలి, ఎలా చేయాలనే విషయంలో నేను చాలా స్పష్టంగా ఉన్నా. అందుకు తగ్గట్టుగా ప్రణాళిక వేసుకున్నా. మరోవైపు..ఆ ప్రణాళికలన్నీ సాఫీగా సాగేలా..నా ప్రతి కల నిజమయ్యేలా దత్తా సహకరించాడు. మొత్తంగా.. ఇద్దరమూ పెళ్లి వేడుకను అపురూపం చేసుకున్నాం' అని సింధు వివరించింది.

సస్పెన్షన్ సమయంలో టోర్నీలు ఎలా ఆడింది?

స్ప్రింటర్ హిమాదాస్‌పై వివాదం



న్యూఢిల్లీ: డోప్ టెస్ట్‌కు తన వివరాలు తెలియజేయని స్టార్ అథ్లెట్ హిమా దాస్‌పై జాతీయ డోపింగ్ నియంత్రణ (నాడా) సంస్థ క్రమశిక్షణ కమిటీ 16 నెలల సస్పెన్షన్ విధించింది. అయితే సస్పెన్షన్ సమయంలో ఆమె పోటీలలో పాల్గొనడం దుమారం రేపుతోంది. హిమపై విధించిన సస్పెన్షన్ జూలై 23, 2023 నుంచి అమలులోకి వచ్చింది. 16 నెలల శిక్ష గత నెల 21 తేదీతో పూర్తయింది. అంటే ఆ మరుసటి రోజునుంచే టోర్నీలలో పాల్గొనేందుకు దాస్ అర్హురాలు. కానీ ఆమె గత ఏప్రిల్‌లో బెంగళూరులో జరిగిన ఇండియన్ గ్రాండ్‌ప్రీతోపాటు జూన్‌లో పంచకులలో జరిగిన జాతీయ అంతర్రాష్ట్ర టోర్నీలలో పాల్గొనడం గమనార్హం. ఈనేపథ్యంలో నాడా సస్పెన్షన్‌కు విలువేమిటనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ప్రస్తుతం తిరువనంతపురంలో శిక్షణలో పాల్గొంటున్న హిమాదాస్‌ను వివరణ కోరితే స్పందించేందుకు ఆమె నిరాకరించింది.



ధోనీతో కృతీ సనన్

మహీ.. క్రిస్మస్ సంబరాలు

ముంబై: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ క్రిస్మస్ సంబరాలను వినూత్నంగా జరుపుకొన్నాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సంబరాలు చేసుకున్న మహీ.. తన కుమార్తె జివా కోసం శాంటాక్లాజ్ వేషం ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ వేడుకల్లో బాలీవుడ్ నటి కృతీ సనన్ తదితరులు పాల్గొని సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ధోనీ భార్య సాక్షీ సింగ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. క్రిస్మస్ తాత వేషధారణలో ఉన్న ధోనీని చూసి అతని అభిమానులు మురిసిపోతున్నారు. ఆ ఫొటోలకు లైక్‌ల మీద లైక్‌లు కొడుతూ..కామెంట్లు పెడుతూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

'బాక్సింగ్ డే'లో పంచ్ ఎవరిదో?

నేటి నుంచే నాలుగో టెస్ట్

హ్యాట్రిక్‌పై భారత్ గురి

ప్రతీకారం కోసం ఆస్ట్రేలియా

మళ్లీ ఓపెనర్‌గా రోహిత్!

ఉదయం 5 గం. నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..



బుమ్రా



కమిన్స్

అశ్విన్‌తో సమంగా బుమ్రా

గాబాలో 9 వికెట్లతో అదరగొట్టిన పేసర్ బుమ్రా.. టెస్టుల్లో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత బౌలర్ అశ్విన్‌తో సమంగా నిలిచాడు. మూడో టెస్ట్ ద్వారా 14 పాయింట్లు సాధించిన బుమ్రా.. మొత్తంగా 904 పాయింట్లతో ఐసీసీ బౌలర్ల జాబితాలో టాప్ ర్యాంకర్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకొన్నాడు. గతంలో అశ్విన్ అత్యధికంగా 904 పాయింట్లు దక్కించుకున్నాడు. మరో రెండు టెస్టులు జరగనున్న నేపథ్యంలో అశ్విన్‌ను బుమ్రా వెనక్కినెట్టే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికా పేసర్ రబాడ (856), హాజెల్‌వుడ్ (852) రెండు, మూడు ర్యాంకుల్లో ఉన్నారు.

6 200 వికెట్ల మైలురాయిని అందుకోవడానికి బుమ్రాకు కావాల్సిన వికెట్లు.

4 మెల్‌బోర్న్‌లో 14 టెస్టులు ఆడిన భారత్ నాలుగు నెగ్గి, రెండు డ్రా చేసుకొంది. ఎనిమిది మ్యాచ్‌ల్లో ఓడింది. అయితే, 2014 నుంచి ఇక్కడ భారత్‌కు ఓటమే లేదు. 2014 టూర్‌లో డ్రా చేసుకొన్న టీమిండియా.. 2018, 2020లో విజయాలు సాధించింది.

జట్లు (అంచనా)

భారత్: యశస్వీ జైస్వాల్, రోహిత్ శర్మ, రాహుల్, కోహ్లీ, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), గిల్/జురెల్, జడేజా, నితీశ్/సుందర్, ఆకాశ్ దీప్, బుమ్రా, సిరాజ్.

ఆస్ట్రేలియా: ఉస్మాన్ ఖవాజా, సామ్ కోన్‌స్టాస్, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, క్యారీ (వికెట్ కీపర్), కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, లియోన్, బోలాండ్.

పిచ్/వాతావరణం

మెల్‌బోర్న్ వికెట్ స్వతహాగా పేసర్లకు స్వర్గధామం. పిచ్‌పై పచ్చిక కనిపిస్తుండడంతో ఫాస్ట్ బౌలర్లు చెలరేగే అవకాశం ఉంది. అయితే, గత పర్యటనల్లో రహానె, పుజార సెంచరీలతో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించారు. సహజంగా ఇక్కడ టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ చేయడానికే మొగ్గు చూపుతుంది. ప్రస్తుతం వాతావరణం వేడిగా ఉన్నా.. రెండో రోజు చిరుజల్లులు కురిసే చాన్సులున్నాయి. 90 వేల సీటింగ్ సామర్థ్యం కలిగిన మెల్‌బోర్న్‌లో టికెట్లన్నీ అమ్ముడుపోవడంతో.. స్టేడియం మొత్తం సందడి వాతావరణం నెలకొననుంది.

మెల్‌బోర్న్: వరుణుడి సహకారంతోపాటు లోయరార్డర్ బ్యాటర్లు పోరాటాన్ని ప్రదర్శించడంతో.. గాబా టెస్ట్‌లో భారత జట్టు డ్రాతో గట్టెక్కింది. పింక్ బాల్ మ్యాచ్‌లో ఘోరంగా ఓడిన టీమిండియాకు ఈ ఫలితం ఓదార్పునిచ్చేదే. ఐదు టెస్ట్‌ల సిరీస్ 1-1తో సమంగా నిలిచిన నేపథ్యంలో కొంత ఊపిరి పీల్చుకొన్న రోహిత్ సేన.. తమకు అచ్చొచ్చిన మెల్‌బోర్న్‌లో గురువారం నుంచి జరిగే కీలక నాలుగో, 'బాక్సింగ్ డే' టెస్ట్‌లో ఆస్ట్రేలియాతో అమీతుమీకి సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతోపాటు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు మెరుగవుతాయి. ఒకవేళ ఓడితే డబ్ల్యూటీసీ ఫైనల్ చాన్స్ దాదాపుగా చేజార్చుకొన్నట్టే. టీమిండియా బ్యాటింగ్ ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా సీనియర్లు రోహిత్, కోహ్లీ వరుస వైఫల్యాలు జట్టును ఇబ్బందుల్లోని నెడుతున్నాయి. ఓపెనర్‌గా రాహుల్‌ను కొనసాగిస్తుండడంతో.. గత రెండు టెస్టుల్లో మిడిలార్డర్‌లో ఆడిన రోహిత్ దారుణంగా విఫలమవుతున్నాడు. పెర్త్‌లో మురిపించిన కోహ్లీ.. ఆ తర్వాతి నాలుగు ఇన్నింగ్స్‌ల్లోనూ పేలవ ప్రదర్శన కనబర్చాడు. ఈ నేపథ్యంలో రోహిత్‌ను మళ్లీ ఓపెనర్‌గా దించి.. రాహుల్‌ను వన్ డౌన్‌లో ఆడించే దిశగా మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే శుభ్‌మన్ గిల్‌ను పక్కనబెట్టి.. ధ్రువ్ జురెల్‌ను తుది జట్టులోకి తీసుకొనే అవకాశం ఉంది. యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్‌తోపాటు జడేజా భారీ స్కోర్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరో స్పిన్నర్ కావాలనుకొంటే ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ స్థానంలో సుందర్‌ను ఆడించొచ్చు. ఎంసీజీలో మెరుగైన రికార్డు ఉన్న కోహ్లీ మెరుపులు మెరిపించాలని అభిమానులు బలంగా కోరుకొంటున్నారు. ఆఫ్ స్టంప్ ఆవల పడిన బంతులను వేటాడి మరీ అవుటవుతున్న విరాట్.. ఆ బలహీనతను అధిగమించేందుకు నెట్స్‌లో తీవ్రంగా సాధన చేశాడు. ఇక, బౌలింగ్ విభాగానికొస్తే బుమ్రాకు మిగతా బౌలర్ల నుంచి తగినంత సహకారం అందడం లేదు. పేస్‌కు సహకరించే పిచ్‌పై సిరాజ్, ఆకాశ్ దీప్ రాణిస్తేనే టీమిండియా విజయావకాశాలు మెరుగుపడతాయి.



బ్రేక్ వేయాలని..

దశాబ్దకాలంగా బాక్సింగ్ డే టెస్ట్‌లో టీమిండియాపై నెగ్గని ఆస్ట్రేలియా ఈసారి విజయం సాధించాలన్న కసితో ఉంది. అయితే, టాపార్డర్ బ్యాటర్ల వైఫల్యం జట్టును కలవరపెడుతోంది. ఓపెనర్‌గా మెక్‌స్వీని విఫలం కావడంతో అతడి స్థానంలో 19 ఏళ్ల సామ్ కోన్‌స్టాస్ అరంగేట్రం ఖాయం. మరోవైపు, ఖవాజా, లబుషేన్ ఫామ్‌కోసం తంటాలు పడుతున్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న ట్రావిస్ హెడ్ ఫిట్‌నెస్‌పై ఆందోళన రేగినా.. అతడు అందుబాటులో ఉంటాడని ఆసీస్ మేనేజ్‌మెంట్ ప్రకటించడం ఊరటనిచ్చేదే. బౌలింగ్‌లో కెప్టెన్ కమిన్స్, స్టార్క్, మార్ష్ రాణిస్తున్నారు. గాయపడిన హాజెల్‌వుడ్ స్థానంలో బోలాండ్ జట్టులోకి రానున్నాడు. ఇరుజట్లలోనూ లోపాలున్నా.. వాటిని సరిదిద్దుకొని ఆధిపత్యం ప్రదర్శించాలన్న ప్రయత్నంలో ఉండడంతో మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

నమన్ ఓఝా తండ్రికి జైలు

బేతుల్ (మధ్యప్రదేశ్): బ్యాంకును మోసం చేసిన కేసులో భారత జట్టు మాజీ క్రికెటర్ నమన్ ఓఝా తండ్రి వినయ్ ఓఝాకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష పడింది. 2013లో మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లా కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖకు వినయ్ ఓఝా మేనేజర్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో ఏజెంట్ల ద్వారా బ్యాంకులో నకిలీ ఖాతాలు తెరిచి రూ.1.25 కోట్లమేర అవినీతికి పాల్పడ్డారు. ఈకేసులో వినయ్ ఓఝాకు ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. ఏడు లక్షలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇదే కేసులో మరో ముగ్గురికి కూడా జైలు శిక్ష, జరిమానా విధించారు.



మనూ భాకర్‌కు ఖేల్‌రత్న?

జాబితాలో చేర్చనున్న క్రీడా శాఖ

న్యూఢిల్లీ: ఈ ఏడాది ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు జాబితాలో స్టార్ షూటర్ మనూ భాకర్ పేరు లేకపోవడం పెద్ద వివాదం సృష్టించింది. ఈ నేపథ్యంలో కేంద్ర క్రీడా శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు తెలిసింది. ఖేల్ రత్న పురస్కారాల నామినేటెడ్ జాబితాలో మనూ భాకర్ పేరు చేర్చనున్నట్టు ఆ శాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని 12 మంది సభ్యుల కమిటీ క్రీడా అవార్డులకు అథ్లెట్లను ఎంపిక చేయనుంది. ఇక ఈసారి ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారిస్ పారా ఒలింపిక్స్ హైజంప్‌లో స్వర్ణం నెగ్గిన ప్రవీణ్ కుమార్ తదితరుల పేర్లను సిఫారసు చేశారు.

గందరగోళం లేకుండా ఓఆర్ఆర్ అలైన్‌మెంట్

- 7 హైవేల అనుసంధానంపై ఎన్‌హెచ్‌కు ప్రభుత్వ సూచనలు

విజయవాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ ఆర్) అలైన్‌మెంట్ జాతీయ రహదారులకు అనుసంధానమయ్యే చోట గందరగోళం లేకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల సంస్థకు నిర్దేశించింది. ఈ ప్రాజెక్టు మొత్తం 7 జాతీయ రహదారులతో అనుసంధానమవుతుంది. దీంతో దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాలతో అమరావతి రాజధానికి రోడ్డు కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఈ అలైన్‌మెంట్ మలుపులు లేకుండా ఉండేలా చూడటంతో పాటు ఆయా జాతీయ రహదారులు అనుసంధానమయ్యే చోట ఇబ్బందులు లేకుండా, ఎలాంటి గందరగోళం లేకుండా ఉండాలని ప్రభుత్వం నిర్దేశించింది. నేరుగా అనుసంధానం అయ్యే చోట ఈ జాగ్రత్తలు బాగా తీసుకోవాలని పేర్కొంది. అలాగే, ట్రంపెట్ ఇంటర్ చేంజ్‌ల విషయంలో కూడా ఎలాంటి గందరగోళం, సమస్యలకు అవకాశం లేకుండా అనుసంధానమయ్యేలా చర్యలు చేపట్టాల్సిందిగా తెలిపింది. దీంతో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానమయ్యే మచిలీపట్నం-హైదరాబాద్ (ఎన్‌హెచ్-65), కొండమోడు-పేరేచర్ల (ఎన్‌హెచ్-163ఈజీ), చెన్నై-కోల్‌కతా (ఎన్‌హెచ్-16), విజయవాడ-ఖమ్మం-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే (ఎన్‌హెచ్-163జీ), గుంటూరు-అనంతపురం (ఎన్‌హెచ్-544డీ), ఇబ్రహీంపట్నం-జగదల్‌పూర్ (ఎన్‌హెచ్-30) వంటి వాటి విషయంలో జాతీయ రహదారుల సంస్థ అధికారులు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నారు.

క్రికెట్ ఆడుతుండగా గుండెపోటు

- గుడ్లవల్లేరులో యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు మృతి


మృతుడు కొమ్మాలపాటి సాయి (ఫైల్)

గుడ్లవల్లేరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆడుతుండగా ఓ యువకుడు గుండెపోటుకు గురై మృతి చెందాడు. బుధవారం కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం అంగలూరులో ఈ విషాదం చోటుచేసుకుంది. అంగ లూరుకు చెందిన కొమ్మాలపాటి సాయి (26) హైదారాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. క్రిస్మస్ సెలవులకు రెండురోజుల క్రితం ఇంటికొచ్చాడు. బుధవారం కౌతవరంలో యువకులు క్రికెట్ ఆడుతుండగా అక్కడికి వెళ్లాడు. సాయి బౌలింగ్ చేస్తుండగా, ఛాతీలో నొప్పి వస్తోందని చెప్పి కొద్దిసేపు కూర్చుండిపోయాడు. తిరిగి బౌలింగ్ చేస్తూ హఠాత్తుగా కిందపడిపోయాడు. తోటి యువకులు సాయిని గుడివాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. సాయి తండ్రి ప్రసాద్ ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చిన కుమారుడి హఠాన్మరణంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.




ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, కేంద్ర మంత్రులు రామ్మోహన్, శ్రీనివాస వర్మ, చంద్రశేఖర్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు

ప్రత్యేక సాయంతో ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయనతో చర్చించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం ప్రధానితో ఆయన నివాసంలో చంద్రబాబు భేటీ అయ్యారు. 45 నిమిషాలు ఇది సాగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, ఆర్థిక అంశాలపై చర్చించారు. ఇటీవల విడుదల చేసిన స్వర్ణాంధ్ర విజన్ 2047ను ప్రధానికి అందజేశారు. పోలవరం, అమరావతి పనులు మళ్లీ ప్రారంభించిన విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పనులు వేగంగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఏపీకి కీలకమైన రెండు ప్రాజెక్టులను గాడిన పెట్టడానికి ఆర్థిక సాయం చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. 94 కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి గత ప్రభుత్వం నిధులు దారి మళ్లించిన విషయాన్ని.. దానివల్ల జరిగిన నష్టాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. 74 కేంద్ర పథకాలను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశాన్ని ప్రధానికి వివరించిన సీఎం.. ఆ ప్రాజెక్టుకు అవసరమైన ముడి ఖనిజం సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. దీంతో పాటు ఈ సంస్థ ఏర్పాటుకు వివిధ శాఖలకు సంబంధించి అనుమతులు త్వరితగతిన వచ్చేలా చూడాలని విజ్ఞప్తిచేశారు. సాంకేతిక ఇబ్బందులు తొలగితే ప్రాజెక్టు వేగంగా పట్టాలు ఎక్కుతుందని. అందుకు సహకరించాలని అభ్యర్థించారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వాటిని గాడిన పెట్టేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. వివిధ శాఖలకు సంబంధించి కేంద్ర నిధుల విడుదలపై చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పట్టుకుని ప్రత్యేక సాయం చేయాలని కోరారు.


ఢిల్లీలోని జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఎన్డీఏ భేటీలో అమిత్‌షా, చంద్రబాబు, కుమారస్వామి, ఇతర నేతలు

పలువురు మంత్రులతో సమావేశం..

ప్రధానితో భేటీకి ముందు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో తన అధికారిక నివాసంలో చంద్రబాబు సమావేశమయ్యారు. విశాఖ రైల్వే జోన్ పనుల శంకుస్థాపన, రాష్ట్రంలో చేపట్టిన, చేపట్టనున్న రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసే అంశంపై చర్చించారు. అమరావతికి కొత్త రైల్వే లైన్ మంజూరు చేసినందుకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఉదయం మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించిన చంద్రబాబు.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఎన్డీయే పక్షాల భేటీలో పాల్గొన్నారు. సమావేశనంతరం అమిత్‌షా, నడ్డాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అక్కడే కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, తదుపరి కార్యాచరణపై చర్చించారు. సీఎం పర్యటనలో ఆయన వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్ ఉన్నారు.

కీలక ప్రాజెక్టులపై చర్చ

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం అందించాల్సిన అత్యవసర సహకారం, రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులపై ప్రధానితో సీఎం చర్చించినట్లు పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు 'ఎక్స్'లో పేర్కొన్నారు. రైల్వేజోన్ స్థాపన, వాల్తేర్ రైల్వే డివిజన్ పురోగతి, ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే కనెక్టివిటీ, అభివృద్ధిని పెంచే లక్ష్యంతో కొత్త మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వంటి కార్యక్రమాలపై రైల్వే మంత్రితో చర్చించారని తెలిపారు.

చంద్రబాబు గురువారం ఉదయం ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్తారు. అక్కడ కొన్ని ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం అమరావతికి తిరిగివస్తారు.

నేడు హైదరాబాద్‌కు చంద్రబాబు

వాజపేయికి సీఎం ఘననివాళి

న్యూఢిల్లీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారతజాతి గర్వించదగిన నేత వాజపేయి అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనియాడారు. వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఉదయం వాజపేయి సమాధి 'సదైవ్ అటల్' వద్ద రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో కలిసి సీఎం చంద్రబాబు ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'నేషన్ ఫస్ట్' అని ఎప్పుడూ భావించే వాజపేయితో కలిసి పనిచేసిన అనుభూతి తనకు చిరకాలం గుర్తుండిపోతుందన్నారు. దేశం గురించి వాజ్‌పేయి ఆలోచించే తీరు విలక్షణమైనదని, దానికి ఆధునికత, సాంకేతికత జోడించాలని తాను సూచించినప్పుడు, సంస్కరణల గురించి ప్రతిపాదనలు చేసినప్పుడు ఆయన స్పందించిన తీరును ఎన్నటికీ మరచిపోలేనని అన్నారు. వాజపేయితో తాను దిగిన ఫొటోను చంద్రబాబు పంచుకున్నారు.



ఢిల్లీలోని 'సదైవ్ అటల్' వద్ద నివాళి అర్పిస్తున్న చంద్రబాబు

ఉపాధి సిబ్బందికి శిక్షణ

జనవరి నుంచి ప్రారంభించాలనే యోచన

- కూలీలకు రూ.300 వేతనం లభించేలా చర్యలు
- శ్రమశక్తి సంఘాలకు మళ్లీ జీవం..
- ఇప్పటికే వేతనాల మానిటరింగ్ సెల్ ఏర్పాటు



అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే సిబ్బందికి శిక్షణ తప్పనిసరిగా ఇవ్వాల్సిన అవసరముందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులు భావిస్తున్నారు. జనవరి నుంచి సిబ్బందికి పనుల నిర్వహణపై నిపుణులతో శిక్షణ ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాల విషయంలో కూడా మార్పులు చేర్పులు చేపట్టనున్నారు. ఇటీవల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ఉపాధి పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. పలు చోట్ల కూలీలకు రూ.150ల నుంచి రూ.190 వరకు వేతనాలు మాత్రమే అందుతుండటం, కొన్ని చోట్ల పనులు లేకుండానే జరిగినట్లు మస్టర్లు వేయడం తదితర అంశాలను గమనించారు. గత ఐదేళ్లుగా ఉపాధి పథకం గాడితప్పడంతో సిబ్బంది కూడా పథకం లక్ష్యం విస్మరించారని, వారికి తిరిగి శిక్షణ ఇవ్వడం ద్వారా పథకాన్ని గాడిన పెట్టాలని నిర్ణయించారు. గతంలో ఉపాధి పథకం ద్వారా ఏటా మేట్లకు, కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, మండలస్థాయి సిబ్బందితో పాటు అన్ని స్థాయిల్లో శిక్షణ ఇచ్చేవారు. ఈ ఐదేళ్లూఎక్కడా అలాంటి శిక్షణలు నిర్వహించలేదు. దీంతో పాటు గతంలో శిక్షణ పొందిన ఫీల్డ్ అసిస్టెంట్లను రకరకాల కారణాలతో తొలగించడంతో, మిగిలిన సిబ్బందికి ఈ పథకం అవగాహన లేక పనుల స్ఫూర్తి దెబ్బతిందన్న అభిప్రాయం ఏర్పడింది.

మళ్లీ శ్రమశక్తి సంఘాలు

గతంలో శ్రమశక్తి సంఘాలు(ఎస్ఎస్ఎస్)గా 20 నుంచి 40 మంది కూలీలతో గ్రూపులు ఏర్పాటుచేసి వాటికి మేట్‌లను నియమించేవారు. ఆ మేట్‌లకు ప్రతి ఏడాదీ శిక్షణ అందించేవారు. ఆయా గ్రూపులుగా కొన్ని నిర్దిష్టమైన పనులు నిర్వహించేవారు. దీంతోపాటు పనుల కోసం కూలీలను తీసుకొచ్చేవారు. మేట్‌లందరూ ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయకారిగా ఉండటంతో పథకం సజావుగా, పారదర్శకంగా సాగేది. గత ఐదేళ్ల ఈ మేట్‌లకు ట్రైనింగ్ ఇవ్వకపోవడమే కాకుండా శ్రమశక్తి సంఘాలు కూడా కనుమరుగయ్యాయి. ఇప్పుడు ఉపాధి పనులు సక్రమంగా జరగడానికి, కూలీలకు రూ.300లు వేతనం అందడానికి సిబ్బందితో పాటు శ్రమశక్తి సంఘాలను తిరిగి అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు. అంతే కాకుండా మండల స్థాయి సిబ్బందికి కూడా మారుతున్న కాలాన్ని బట్టి వారి జాబ్‌చార్ట్‌పై శిక్షణ ద్వారా సరైన అవగాహన కల్పించాలని భావిస్తున్నారు.

వేతన మానిటరింగ్ సెల్ బలోపేతం

కూలీలకు రూ.300లు వేతనం దక్కేలా రాష్ట్ర వ్యాప్తంగా వేతన మానిటరింగ్ సెల్స్‌ను బలోపేతం చేయాలని నిర్ణయించారు. విజిలెన్స్ అధికారులను పూర్తిగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసి కూలీలను, సిబ్బందిని కార్యోన్ముఖులుగా చేయాలని భావిస్తున్నారు. అలాగే, పని ప్రదేశాల్లో సౌకర్యాలతో పాటు ఫస్ట్ ఎయిడ్‌బాక్స్, తాగునీటి సౌకర్యాలు తదితర అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. గ్రామాల్లో చేపట్టే పనులు కూడా ఆస్తులుగా మిగిలిపోయేవిగా ఉండాలని, వాటితో స్వయం సమృద్ధి సాధించేలా ఉండాలని భావిస్తున్నారు. తిరిగి ఉన్నతి కార్యక్రమం ద్వారా ఉపాధి కూలీల కుటుంబాలకు స్వయం ఉపాధి శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటారు.

గమ్యంలేని పయనం!

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్న యాజమాన్యం అవి ఎప్పటికి వస్తాయో చెప్పలేకపోతోంది. అసలు ఆర్టీసీలో ప్రయాణికుల సౌకర్యాల గురించి ఆలోచించే అధికారులే కరువయ్యారు. సంస్థల్లో డిపో మేనేజర్ల నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల వరకూ ఇన్‌చార్జిలే.. ఆఖరికి సంస్థ ఎండీ కూడా ఆర్నెళ్లుగా ఇన్‌చార్జే!! దీంతో పండగ ప్రయాణికుల బస్సులే కాదు.. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు పైనా పూర్తిస్థాయి కసరత్తు జరగలేదు. ప్రభుత్వంలో విలీనం తర్వాత అన్నీ బాగుంటాయనుకుంటే సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడింది. ఆర్టీసీని ప్రయాణికులు ఆదరిస్తున్నా సేవలు అందించడంలో వారిని సంతృప్తి పరచలేక పోతోందన్న విమర్శలు మూటగట్టుకుంటోంది.

పూర్తిస్థాయి అధికారులు లేక..

రాష్ట్రంలో 11,500 బస్సులతో ప్రతి రోజూ 45లక్షల మేర తిరుగుతూ 65లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చే అతిపెద్ద రవాణా సంస్థ ఆర్టీసీ రోజురోజుకూ ప్రయాణికులకు దూరమవుతోంది. లక్షలాది మందిని గమ్యస్థానాలకు చేర్చే ప్రభుత్వ రంగ ప్రయాణ సంస్థ సక్రమంగా నడవాలంటే డ్రైవర్ లాంటి ఎండీ ముందుగా కష్టపడాలి. ఆర్నెళ్ల క్రితం డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమల రావు.. వారానికి ఒక రోజు కూడా ఆర్టీసీ వైపు చూడట్లేదు. ఆయనకు రాష్ట్రంలోని శాంతి భద్రతల సమస్యలపై దృష్టి సారించడానికే సమయం సరిపోవడంలేదు. ఆయన తర్వాత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంస్థను సజావుగా నడిపించాలి. ఈడీ అడ్మిన్, ఈడీ ఆపరేషన్స్ ఆర్టీసీ హౌస్‌కు వచ్చి కొన్ని నెలలు అవుతోంది. అనుభవం తక్కువగా ఉన్న వారికి సరైన సూచనలు చేసేవారూ లేరు. ఉత్తరాంధ్ర ఈడీ విజయ్ కుమార్, విజయవాడ ఈడీ విజయరత్నం, కడప ఈడీ చంద్రశేఖర్ ఇన్‌చార్జిలే. నెల్లూరు తప్ప రెగ్యులర్ ఈడీలు లేకుండా వ్యవస్థను నడిపిస్తున్న ఆర్టీసీకి అసలు ఈడీల వ్యవస్థ ఎందుకనే ప్రశ్న తలెత్తుతోంది. పోనీ రీజినల్ మేనేజర్లయినా ఉన్నారా? అంటే ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరుతోపాటు తిరుపతి, నెల్లూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం లాంటి చోట్ల కూడా ఆర్ఎంలు లేరు. కీలకమైన ప్రాంతాల్లో ఇన్‌చార్జిలతోనే బండి నడిపిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం.. కనీసం 40డిపోల్లో డీఎంలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చిందంటే ఎంత దుస్థితిలో ఉందో అర్థమవుతోంది. డిపో మేనేజర్‌కు పని ఎక్కువగా ఉంటుంది. అటువంటి పోస్టుల్లోనూ ఇన్‌చార్జిలను నియమిస్తే ప్రయాణికులకు సేవ చేయడం సాధ్యమేనా? అని ఆర్టీసీ హౌస్‌లోనే ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఆర్టీసీ హౌస్‌లో ఇలా..

ఇక ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో పరిస్థితి మరీ అధ్వానం. పదేళ్లకు పైగా ఉద్యోగులు ఇక్కడే తిష్ట వేసుకు కూర్చున్నారు. వారిని బదిలీ చేసి అక్కడికి ఇంకొకరిని తీసుకొచ్చే ఆలోచన కూడా ఉన్నతాధికారులు లేరు. అటు విజయనగరంలో పనిచేసే ఉద్యోగులంతా విశాఖపట్నం నుంచే తిరుగుతున్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైన తర్వాత సిబ్బందిలోనూ అలసత్వం ఎక్కువైందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎక్కడ ఆగిపోతాయో తెలియని డొక్కు బస్సులు.. ఏది అడిగినా పట్టించుకోని సిబ్బంది.. వారిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఇన్‌చార్జిలు కావడం, పూర్తిస్థాయిలో పట్టులేకపోవడం.. ఫలితంగా ఆక్యుపెన్సీ రేషియో తగ్గిపోతోంది. ఎక్కడికక్కడ ఓల్వో బస్సులు ఆగిపోతుండటంతో ఆర్టీసీలో ప్రయాణమంటేనే ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు.

డ్రైవర్ లేరని బస్సు సర్వీసు రద్దు!

ఆర్టీసీ ఛైర్మన్ సొంత జిల్లాలో డ్రైవర్ లేక ఇటీవల శ్రీశైలం బస్సు సర్వీసును రద్దు చేశారు. మరొకరిని ఏర్పాటు చేయలేకపోయిన అక్కడి డీఎం.. ప్రయాణికులకు రిజర్వేషన్ డబ్బులు వాపసు చెల్లించారు. ఆ సమయంలో మరో ప్రైవేటు వాహనాల్లో వెళ్లలేక, ప్రయాణం రద్దు చేసుకోలేక ఇబ్బంది పడ్డవారు సోషల్ మీడియాలో ఆర్టీసీ సేవల్ని ఏకిపారేశారు. ఇలాంటివి ఆక్యుపెన్సీపై తీవ్ర ప్రభావం చూపుతాయి. డ్రైవర్ల కొరత ఉందని చెబుతోన్న యాజమాన్యం నియామకాలు చేసుకోదు. ఉన్న డ్రైవర్లకు అనారోగ్యమంటూ కొందరు అసోసియేషన్ల నేతలు 'స్వలాభం' కోసం ఓడీలు ఇప్పించే పనిలోనే ఉంటారు. ఆఖరికి ఆర్టీసీ సెక్యూరిటీ అధికారి కూడా డీజీపీ కార్యాలయంలో ఉంటారు. ఆర్టీసీ హౌస్‌లో విధులు నిర్వర్తించాల్సిన ఆయనకు అక్కడేంపని అని అడిగేవారు కూడా లేరు. విజిలెన్స్ విభాగం ఎంత మేర నిఘా పెట్టింది.. ఎంతమందిపై చర్యలు తీసుకున్నారని అడిగితే అసలు ఐపీఎస్ అధికారి లేక ఎన్నిసంవత్సరాలైందో అనే సమాధానం వస్తోంది. విజిలెన్స్ నివేదికపై చర్య తీసుకోవాల్సిన ఈడీ పరిధిలో ఆ విభాగం పని చేయడం మరో వింత. కొత్త సంవత్సరంలో అయినా కొత్త బస్సులు, అవసరమైన సేవలు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆనంద్ బీజేపీలో చేరిక

ఎలమంచిలి మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి సహా తొమ్మిది మంది డెయిరీ డైరెక్టర్లు కూడా...

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, ఆయన సోదరి అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి బీజేపీలో చేరారు. ఇరువురూ రాజమండ్రిలో రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో బుధవారం బీజేపీ కండువా కప్పుకున్నారు. వీరితో పాటు విశాఖ డెయిరీలో డైరెక్టర్లుగా కొనసాగుతున్న ఎస్వీవీ శంకరరావు, ఎస్.సూర్యనారాయణ, కోళ్ల కాటమయ్య, దాడి పవన్ కుమార్, ఆరంగి రమణబాబు, చిటికెల రాజకుమారి, రెడ్డి రామకృష్ణ, సుందరపు ఈశ్వర్, పరదేశి గంగాధర్ కూడా బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ విధానాలు నచ్చాయని, బీజేపీతోనే ఏపీ అభివృద్ధి సాధ్యమని భావించి ఆయన నాయకత్వంలో పనిచేయడానికి పార్టీలో చేరానన్నారు. పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తానన్నారు. పురందేశ్వరి మాట్లాడుతూ, 'పార్టీలో చేరిన తర్వాత సిద్ధాంతం, క్రమశిక్షణ అవలంబిస్తూ పార్టీ పురోభివృద్ధికి, బలోపేతానికి కృషి చేయాలి' అని అన్నారు.

ఏపీలో బీజేపీకి 25 లక్షల సభ్యత్వాలు

తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో నిర్వహించిన బహిరంగ సభలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామ సేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు సుమారు 10 వేల మందితో కలిసి బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వాల సంఖ్య సుమారు 25 లక్షలకు చేరుకుందని అన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, మారుమూల గ్రామంలో పెద్ద ఎత్తున చేరికలు ఆనందాన్ని కలిగించాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వీ సూర్యనారాయణరాజు, రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆడారి చేరికపై కూటమిలో చిచ్చు!

- బహిరంగంగానే స్పీకర్ అయ్యన్న అసహనం
- తెలిసీ ఎందుకు చేశారోనన్న చంద్రబాబు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌ను బీజేపీలో చేర్చుకున్న వ్యవహారం కూటమి పార్టీల మధ్య చిచ్చు రేపుతోంది. ఆయన్ను చేర్చుకోవడంపై టీడీపీ సీనియర్ నేత, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేరు పెట్టకుండా బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు. ఆడారి ఇటీవలి వరకూ వైసీపీలో ఉన్నారు. ఆ పార్టీ తరఫున విశాఖ పశ్చిమ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక విశాఖ డెయిరీలో ఆర్థిక అవకతవకలపై పలు ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. శాసనసభలోనూ చర్చ జరిగింది. ఈ ఫిర్యాదులపై విచారణకు సభాసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన ఏర్పాటైన సభాసంఘం ఇటీవల విశాఖ వెళ్లి డెయిరీ అధికారులతో సమావేశమైంది. ఈ క్రమంలో ఆడారి అప్రమత్తమయ్యారు. వైసీపీలో కొనసాగితే విచారణ ఇంకా లోతుగా జరుగుతుందన్న అంచనాతో కూటమిలోని పార్టీల్లో చేరడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ, జనసేనల్లో చేర్చుకోవడానికి ఆ పార్టీల నాయకత్వాలు సుముఖంగా లేకపోవడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని సంప్రదించినట్లు సమాచారం. ఆమె ఆమోదం తెలుపడంతో బుధవారం బీజేపీలో చేరిపోయారు. దీనిపై ఉమ్మడి విశాఖ జిల్లాలోని టీడీపీ, జనసేన నేతలు అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. 'నాకేమీ తెలియదు. చేరికకు ఒక రోజు ముందు పురందేశ్వరి నాకు ఫోన్ చేశారు. ఆడారిని చేర్చుకుంటున్నామని, ఆయన వచ్చి విమ్మల్ని కలుస్తాడని చెప్పారు. నన్ను కలవాల్సిన అవసరం లేదని చెప్పాను. చేర్చుకోవాలని నిర్ణయం తీసుకున్నాకే నాకు చెప్పారు' అని ఆయన తెలియజేశారు. ఈ చేరికపై ఒకరోజు ముందు ఒక బహిరంగ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. మంగళవారం సీఎం చంద్రబాబు వద్ద ఈ విషయం ప్రస్తావించారు. ఇలా చేర్చుకుంటే ఆయన అక్రమాలపై ఇక సభా సంఘం విచారణకు ఏం అర్థం ఉంటుందని ప్రశ్నించారు. సీఎం కూడా.. 'సమస్య వాళ్లకూ తెలుసు కదా! తెలిసి కూడా చేస్తే ఏమనాలి? నేను మాట్లాడతాను' అని హామీ ఇచ్చారు. ఆనంద్ బీజేపీలో చేరబోతున్నారని కొద్ది రోజుల ముందే టీడీపీ అధినాయకత్వానికి సమాచారం అందింది. తొందరపడవద్దని బీజేపీ నేతలకు సంకేతాలు పంపినట్లు ప్రచారం జరుగుతోంది. అయినా బీజేపీ నాయకత్వం చేర్చుకుంది.


ఆనంద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి. చిత్రంలో సోము వీర్రాజు, విష్ణుకుమార్‌రాజు, మాధవ్

అమరావతి.. ఆకర్ష!



ప్రైవేటు పెట్టుబడుల కోసం పీజీఎంసీ ఏర్పాటు

- కన్సల్టెంట్ కోసం టెండర్లు పిలిచిన సీఆర్‌డీఏ
- సేవా రంగాన్ని భారీగా పెంచే దిశగా ప్రణాళికలు
- విద్య, వైద్యం, పర్యాటక రంగాలకూ ప్రాధాన్యం
- విదేశాల్లోనూ ప్రమోషన్ కార్యక్రమాల నిర్వహణ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులతో పాటు ఆర్థికాభివృద్ధి సాధన దిశగా తీసుకోవాల్సిన చర్యలపైనా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రాజధానిలో ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ దిశగా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీజీఎంసీ) కోసం సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. ఈ సంస్థ నేతృత్వంలో రాజధానిలో ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణకు, తద్వారా ఉపాధి అవకాశాలను పరోక్షంగా పెంచడానికి కసరత్తు చేయనుంది. ప్రైవేటు పెట్టుబడిదారులు, సీఆర్‌డీఏ మధ్య పీజీఎంసీ ఒక వారధిలా పనిచేయనుంది. రాష్ట్రాభివృద్ధికి స్థూల విలువ జోడింపు(జీవీఏ)లో ప్రస్తుతం విశాఖపట్నం అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత రెండు, మూడు స్థానాల్లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు ఉన్నాయి. అమరావతి రాజధాని నగరాన్ని కూడా ప్రధానమైన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఆర్‌డీఏ లక్ష్యంగా పెట్టుకుంది. పొరుగున ఉన్న తెలంగాణకు అత్యధిక ఆదాయ వనరుగా రాజధాని హైదరాబాద్ ఉంది. ఏపీలో కూడా రాజధాని నగరం అమరావతి ఆ స్థాయిలో ఆర్థికాభివృద్ధిని సాధించే దిశగా భవిష్యత్తు ప్రణాళికలకు ఇప్పటినుంచే బీజం వేయాలని భావిస్తోంది. దీనిలో భాగంగా ప్రైవేటు పెట్టుబడుల సమీకరణ పూర్తి బాధ్యతలను ఎంపిక చేసిన కన్సల్టెన్సీకి సీఆర్‌డీఏ అప్పగించనుంది. అమరావతి రాజధాని, అమరావతి రాజధాని ప్రాంత పరిధి(అవుటర్)లో రెండు వేర్వేరు కేటగిరీల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి సారించింది. రాజధానిలో సేవల రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది. ఐటీ రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు నెలకొల్పడం ద్వారా విద్యా రంగానికీ సమ ప్రాధాన్యం ఇవ్వనుంది. అలాగే పర్యాటకం, వైద్య రంగాలకు కేంద్రంగా రాజధాని ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని యోచిస్తోంది.

రాజధాని పనులకు మరో పీజీఎంసీ

అమరావతి రాజధానిలో సంక్రాంతి నుంచి ప్రారంభం కానున్న పనులను పరుగులు పెట్టించేందుకు, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించడానికి మరో పీజీఎంసీ కోసం సీఆర్‌డీఏ తాజాగా టెండర్లు పిలిచింది. వివిధ పనుల కోసం నియమించిన ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కమిటీ (పీఎంసీ)లను సమన్వయం చేసుకుంటూ నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తయ్యేలా ఈ సంస్థ బాధ్యత వహించాలి. రాజధానిలో పనులు చకచకా పూర్తయ్యేందుకు ఎప్పటికప్పుడు ఆయా కాంట్రాక్టు సంస్థలకు ప్రణాళికలు అందించడం, కాంట్రాక్టర్లతో భేటీ అయి సమస్యలను గుర్తించడం వంటివి నిర్వహించనుంది. అమరావతిలో చేపట్టే పనులకు సంబంధించి ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిర్దేశించే లక్ష్యాలను కూడా నిర్ణీత సమయంలో ముందుకు తీసుకువెళ్లే బాధ్యత కూడా ఈ పీజీఎంసీదే.

పీజీఎంసీ బాధ్యతలు ఇవీ...

- అమరావతి భౌగోళిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరుల రీత్యా ఏ సేవా రంగాన్ని అభివృద్ధి చేయాలో నిర్ణయించి, దానికి అనుగుణంగా ప్రణాళికల తయారీ.
- మార్కెట్లో ఉన్న సంస్థలను భాగస్వామ్యం చేస్తూ రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సహించాలి.
- అమరావతిని పర్యాటకంగా తీర్చిదిద్దడానికి ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడానికి ప్రణాళికలు.
- విద్య, వైద్య రంగాలకు సంబంధించి రాజధానిలో ఉన్న అవకాశాలను, ప్రయోజనాలను ఆయా రంగాల్లో దిగ్గజాల దృష్టికి తీసుకువెళ్లి ఒప్పించాలి. ప్రభుత్వపరంగా సహాయ, సహకారాలను సీఆర్‌డీఏ దృష్టికి తీసుకురావాలి.
- రాజధాని పనుల నేపథ్యంలో బిజినెస్ టూర్లు, ఎక్స్‌పోలు నిర్వహిస్తూ ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షించాలి.
- ప్రముఖ దేశాల రాజధానుల్లో ఆర్థికాభివృద్ధి కోసం పాటిస్తున్న విధానాలను అమరావతిలో కూడా అందుబాటులోకి తీసుకొచ్చి, అమలు చేయడం.
- అమరావతిలో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించటానికి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ ప్రమోషన్ కార్యకలాపాలు నిర్వహించాలి.
- విదేశీ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో సమావేశాలు నిర్వహించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించాలి.

ఏపీ వైపు సౌదీ చూపు!



- బీపీసీఎల్‌తో కలిసి భారీ రిఫైనరీకి రెడీ
- రామాయపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ కం పెట్రో కాంప్లెక్స్
- జాయింట్ వెంచర్ కింద నెలకొల్పేందుకు సుముఖత
- త్వరలో దావో‌స్‌లో సౌదీ నేతలతో బాబు భేటీ!

(ఆంధ్రజ్యోతి - గల్ఫ్ ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లోకి చమురు రంగం నుంచి భారీ పెట్టుబడులు తరలి రానున్నాయి. దాదాపు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చేందుకు ప్రపంచ అగ్రగామి చమురు ఉత్పాదక సంస్థ 'సౌదీ అరాంకో' ఆసక్తితో ఉంది. భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌తో (బీపీసీఎల్) కలిసి ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ కం పెట్రో కాంప్లెక్స్ నిర్మాణానికి మొగ్గు చూపుతోంది. నిజానికి ఈ మెగా ఆఫర్‌ను అందుకోవడానికి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ ప్రయత్నించినా.. చివరకు ఏపీ దానిని దక్కించుకోవడం విశేషం. నిజానికి, ఆ రెండు రాష్ట్రాల్లో యూపీ బీజేపీ పాలిత రాష్ట్రం. అయినా.. కేంద్ర చమురు సంస్థ బీపీసీఎల్ ఏపీ వైపే మొగ్గింది. రామాయపట్నంలో 10 లేదా 12 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పాదక సామర్థ్యంతో 'సౌదీ అరాంకో'తో జాయింట్ వెంచర్ కింద నిర్మించేందుకు సిద్ధమైంది. 'ఇది నిజంగా అద్భుతమే'నసే వ్యాఖ్యలు పారిశ్రామిక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అయితే, ఈ అద్భుతాన్ని సాకారం చేయడంలో కొన్ని అంశాలు కీలకంగా పనిచేశాయని చెబుతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్‌పై సౌదీ మక్కువ!

రిఫైనరీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన నెల్లూరు జిల్లా రామాయపట్నం, శ్రీకాకుళం జిల్లా మూలపేట, కృష్ణా జిల్లా మచిలీపట్నం.. ఇలా మూడూ గ్రీన్ ఫీల్డ్ రేవు కేంద్రాలే. చంద్రబాబు స్వతహాగానే గ్రీన్‌ఫీల్డ్ విధానానికి గట్టి మద్దతుదారు. రాజధాని అమరావతి నిర్మాణం మొదలు భోగాపురం విమానాశ్రయంఏర్పాటు వరకు ఆయన ప్రభుత్వం ఇదే విధానాన్ని అనుసరిస్తోంది. మరోవైపు.. సౌదీ అరేబియా గ్రీన్ ఫీల్డ్ విధానానికి పెద్దపీట వేస్తోంది. 'సౌదీ అరాంకో' ప్రతినిధులతో భారత అధికారులు జరిపిన చర్చల్లో ఈ అంశం ప్రముఖంగా పరిశీలనకు వచ్చినట్టు సమాచారం. ఇదే అంశం ఏపీకి బాగా కలిసి వచ్చిందని చెబుతున్నారు.

మెప్పించిన బాబు హుందాతనం

బీపీసీఎల్‌తో జరిపిన పలు సంప్రదింపుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలను సీఎం చంద్రబాబు రిఫైనరీ కోసం సూచించారు. బందరు అయితే బాగుంటుంది అని ఆయన ప్రతిపాదించారు. కానీ, అక్కడే కావాలి.. అని స్థలం విషయంలో పట్టుబట్టలేదు. వచ్చేది ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు. అది ఏపీకి రావడమే ముఖ్యం అన్నట్టు చంద్రబాబు వ్యవహరించారు. ఆయన ప్రదర్శించిన హుందాతనం కేంద్ర మంత్రులు, ఆయా మంత్రిత్వ శాఖలను బాగా ఆకట్టుకున్నదని చెబుతున్నారు. కాగా, దావో‌స్‌లో త్వరలో జరిగే పెట్టుబడుల సదస్సులో చంద్రబాబు.. సౌదీ అరేబియా. ఇతర గల్ఫ్ నేతలతో ఈ దిశగా సమావేశం కానున్నారని తెలుస్తోంది.

కలిసొచ్చిన కేంద్రం సహకారం..

మహారాష్ట్రలోని రత్నగిరిని గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ఏర్పాటుకు తొలుత పరిశీలించారు. మరాఠా నాయకుల మధ్య గొడవల కారణంగా బీపీసీఎల్ వెనక్కి తగ్గింది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ (ప్రయాగ్‌రాజ్) పేరు తెరపైకి వచ్చింది. బీజేపీ పాలిత రాష్ట్రం కావడంతో దాదాపు అక్కడే రిఫైనరీ ఏర్పాటవుతుందని అంతా భావించారు. కారణం తెలియదుగానీ, కేంద్ర ప్రభుత్వమే అక్కడ నెలకొల్పేందుకు ఇష్టపడలేదు. మరోవైపు ఈ ప్రాజెక్టు కోసం చంద్రబాబు పలు సార్లు ఢిల్లీలో పర్యటించారు. ఈ క్రమంలో రిఫైనరీ గురించి భారతీయ అధికారులు అటు 'సౌదీ అరాంకో'తోను, ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబుతోను పలుదఫాలు చర్చలు జరిపారు. మోదీ కేబినెట్‌లో కీలక మంత్రులు పీయూశ్ గోయల్, హర్దీప్ సింగ్ పూరీ, ఎస్ జైశంకర్‌లు ఏపీకి ఈ ప్రాజెక్టు ఇవ్వడానికి పూర్తి సానుకూలత వ్యక్తం చేసినట్టు సమాచారం. పీయూశ్ గోయల్ ఇప్పటికే పలుసార్లు సౌదీ అరేబియాకు వెళ్లి అధికారులతో చర్చలు జరిపారు. త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ కూడ సౌదీ నాయకత్వంతో సమావేశం కానున్నారని, అందులో దీనికి సంబంధించి ఒక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు.

అందుకే.. ఆంధ్రా!

ఉక్రెయిన్‌తో యుద్ధం తర్వాత భారత్‌కు రష్యా చమురు ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. యుద్ధం కారణంగా భరించాల్సి వస్తున్న ఆర్థిక నష్టాలనుంచి, అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న ఆంక్షల నుంచి బయటపడేందుకు భారీ రాయితీలతో మనకు చమురు ఉత్పత్తులను రష్యా ఎగుమతి చేస్తోంది. సౌదీ అరేబియాను దాటుకుని మరీ మన చమురు మార్కెట్‌లోకి రష్యా దూసుకొచ్చింది. దీంతో అనివార్యంగా భారత్‌పై సౌదీ అరేబియా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారతదేశం గుండా ఆగ్నేయాసియా దేశాలకు చమురు సరఫరా చేయడానికి దీర్ఘకాలిక వ్యూహాలను సిద్ధం చేసుకొంటోంది. ఈ క్రమంలో బంగాళాఖాత తీరంలోని ఆంధ్రా తీరం అనువైన ప్రాంతంగా కనిపించింది. అందువల్లే.. చర్చల్లో భాగంగా భారతీయ అధికారులు.. ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన తీసుకురాగా, 'సౌదీ అరాంకో' సానుకూలంగా స్పందించినట్టు సమాచారం.

ఇది రెండో రిఫైనరీ!

రాష్ట్రంలో తొలి రిఫైనరీ విశాఖపట్నంలో ఏర్పాటైంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో అమెరికాకు చెందిన సంస్థ దీనిని ఏర్పాటుచేసింది. జాతీయాకరణలో భాగంగా ఈ రిఫైనరీ హిందుస్థాన్ పెట్రోలియం లిమిటెడ్ కార్పొరేషన్ యాజమాన్యం కిందకు వెళ్లింది. రామాయపట్నంలో ఇప్పుడు ఏర్పాటు చేసేది రెండో రిఫైనరీ అవుతుంది. బీపీసీఎల్ భారతదేశంలో ఇప్పటికే మూడు రిఫైనరీలను నిర్వహిస్తోంది. రామాయపట్నంలో తలపెట్టింది ఈ వరుసలో నాలుగోది కానుంది.

రాజధాని పనులు చకచకా!

- మొదలైన శాశ్వత సచివాలయ పనులు
- భారీ మోటర్లతో నీటిని తోడుతున్న అధికారులు
- ఐదేళ్లపాటు నీటిలో నానబెట్టిన జగన్ ప్రభుత్వం

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ప్రభుత్వ కార్యాలయాల శాశ్వత భవనాల పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి నిధులు విడుదల కావడంతో పనులు వేగం పుంజుకోనున్నాయి. 2019 ఎన్నికలకు ముందు ఆగిపోయిన రాష్ట్ర సచివాలయం శాశ్వత భవన సముదాయ నిర్మాణ పనులు తిరిగి మొదలు పెట్టేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు వేగవంతం చేశారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతుండగా, అది పూర్తయ్యేలోగా నిలిచి ఉన్న నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. రాష్ట్ర సచివాలయ భవనాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని భావించిన అప్పటి టీడీపీ ప్రభుత్వం 40 నుంచి 50 అంతస్తులు ఉండేలా 5 భవనాల (టవర్ల) సముదాయాన్ని నిర్మించాలని భావించింది. సీఎం చంద్రబాబు 2018 డిసెంబరు 27న నిర్మాణ పనులను ప్రారంభించారు. అత్యంత ఎత్తయిన ఐదు టవర్లతో డయా (రెండు వరుసల) గ్రిడ్ విధానంలో వాటిని నిర్మించేందుకు పనులు మొదలుపెట్టారు. అసెంబ్లీ భవన ప్రాంగణంలో 69.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వాటి నిర్మాణానికి రూ.4,890 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. మళ్లీ ఆరేళ్ల తర్వాత సరిగ్గా అదే సమయానికి ఇప్పుడు ముందస్తు పనులు మొదలు పెడుతుండటం విశేషం.

ర్యాఫ్ట్ ఫౌండేషన్ రికార్డు: భారీ భవనాలకు కీలకమైన పునాదుల నిర్మాణాన్ని కీలకంగా తీసుకున్న ప్రభుత్వం అరుదైన రికార్డులను సొంతం చేసుకుంది. నిర్మాణ సంస్థ అయిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఎన్‌సీసీ) మూడు రోజుల్లో, అంటే 72 గంటల్లో 10,816 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, దాన్ని 66 గంటల్లోనే పూర్తి చేశారు. ఒక కార్యాలయం కోసం దేశంలో నిర్మించిన అతిపెద్ద రాఫ్ట్‌గా సచివాలయ పునాదులు రికార్డులకెక్కాయి. డిసెంబరు 29న మొదలైన ర్యాఫ్ట్ నిర్మాణం 66 గంటలు నిర్విరామంగా సాగి డిసెంబరు 31కి పూర్తయింది. 13 అడుగుల లోతులో వేసిన ఈ ర్యాఫ్ట్ ఫౌండేషన్‌కు ప్రపంచ ప్రఖ్యాత ఫోస్టర్ అండ్ పార్టనర్ సంస్థ ప్రణాళిక రూపొందించింది. షాపూర్జీ-పల్లోంజి సంస్థ ఆ రికార్డును సాధించింది. అంతటి నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం నీటిపాలు చేసింది. జగన్ నిర్వాకంతో నీటిపాలైన సచివాలయ భవన సముదాయ పునాదుల పటిష్ఠతపై తాజాగా కూటమి ప్రభుత్వం అధ్యయనం చేయించింది. ఐఐటీ హైదరాబాద్ బృందం ఈ ఏడాది ఆగస్టులో నీటి లోపల ఉన్న పునాదులను పరిశీలించి. పునాదులకు ఎటువంటి ఢోకా లేదని, తదుపరి నిర్మాణానికి ఎటువంటి ఇబ్బంది ఉండదని నివేదికలో పేర్కొంది. దీంతో సచివాలయ టవర్ల పునాదులను వినిగేసిన నీటిని తొలగించే పనులను అధికారులు బుధవారం ప్రారంభించారు. మూడు ట్రాక్టర్ల ఇంజన్లతో భారీ మోటర్లను అనుసంధానించి నీటిని తోడుతున్నారు. ఆ నీటిని పాలవాగులో కలుపుతున్నారు. అక్కడినుంచి కృష్ణానదిలోకి వదిలేస్తారు.



భవన నిర్మాణ ప్రాంతాల్లో చేరిన నీటిని భారీ మోటర్లతో తోడుతున్న దృశ్యం

సాగునీటి సంఘాలన్నీ

ఏకగ్రీవం

- మొత్తం చుట్టేసిన కూటమి
- 245 డిస్ట్రిబ్యూటరీ, 18 మేజర్, 15 మీడియం ప్రాజెక్టు కమిటీలు కైవసం
- వైసీపీకి సున్నా.. జగన్ అసహనం
- నామినేషన్లు వేయనివ్వలేదని ప్రచారం

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రజాస్వామ్య పాలన ప్రారంభమైంది. సాగునీటి సంఘాల సమాఖ్యలన్నిటికీ ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. 2019-24 మధ్య సాగునీటి ప్రాజెక్టులకు జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిర్వహణకు కూడా పైసా ఇవ్వకుండా మొండిచేయి చూపింది. పైగా సాగునీటి సంఘాల ద్వారా 2014-19 మధ్యకాలంలో నీరు చెట్టుకింద చేపట్టిన పనులకు బిల్లులనూ చెల్లించలేదు. ముఖ్యమంత్రిగా జగన్ సాగునీటి సంఘాల పట్ల వ్యవహరించిన తీరుపై రైతులు, రైతు నేతల్లో తీవ్ర ఆగ్రహం గూడుకట్టుకుంది. దీని ఫలితంగానే ఇప్పుడు చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ నేతలు విజయఢంకా మోగించారు. రాష్ట్రంలోని మేజర్ ప్రాజెక్టుల పరిధిలోని 21,060, మీడియం ప్రాజెక్టుల పరిధిలో 3,192, మైనర్ ఇరిగేషన్ పరిధిలోని 21,768.. మొత్తంగా 49,020 టెరిటోరియల్ కమిటీలకు జరిగిన ఎన్నికలు వాటికి ఏకపక్షమయ్యాయి. అదేవిధంగా మేజర్ ప్రాజెక్టుల పరిధిలోని 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 18 మేజర్ ప్రాజెక్టు కమిటీలు, మీడియం ప్రాజెక్టుల పరిధిలోని 15 కమిటీలు కూటమి వశమయ్యాయి. వైసీపీకి ఒక్కటి కూడా దక్కలేదు. చివరకు జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల సహా... కడప జిల్లాలోనూ సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీకి వైసీపీ నాయకులెవరూ ముందుకు రాలేదు. తమ నామినేషన్లను సాంకేతిక కారణాలను చూపి తిరస్కరించారంటూ కొందరు నేతలు ఆరోపణలు చేస్తున్నా.. వాస్తవానికి చాలా మంది కావాలనే నామినేషన్లలో పూర్తి సమాచారాన్ని ఇవ్వలేదని తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు గాను పులివెందుల సహా 11 స్థానాలకే వైసీపీ పరిమితం కావడంతో ఆ పార్టీ నేతలు, శ్రేణులు పరాజయ భారం నుంచి ఇప్పటికీ బయటపడలేదు. అందుకే నీటి సంఘాల ఎన్నికలపై ఆసక్తి చూపలేదు. దీనిని మరుగుపరచి.. తమ వారిని నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని జగన్ ప్రచారం చేస్తున్నారు. అయితే సాగునీటి ఎన్నికల్లో ఎంతమంది వైసీపీ నేతలు నామినేషన్లు వేసేందుకు సిద్ధపడ్డారో ఆయన వెల్లడించాలని కూటమి పార్టీలు సవాల్ విసురుతున్నాయి. ఆయన అధికారంలో ఉన్నప్పుడు జరిగిన మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్షాలను నామినేషన్లు వేయనివ్వకపోవడం, వేసినా దొంగ సంతకాలతో ఉపసంహరణలు, అపహరణలు, దౌర్జన్యాలు, బెదిరింపులతో వాటిని కైవసం చేసుకున్న సంగతి గుర్తుచేస్తున్నాయి. కాగా.. ఎన్నికలు ఏకగ్రీవంగా ముగియడంతో ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణపై కమిటీలు దృష్టి సారించాయి ప్రధానమైన శ్రీశైలం, నాగార్జున సాగర్, ధవళేశ్వరం వంటి మేజర్ ప్రాజెక్టులతో పాటు మధ్యతరహా చిన్నతరహా నీటి వనరుల అభివృద్ధి పనులు వేగం పుంజుకోనున్నాయి.

విశాఖలో మరో ఫార్మా సెజ్

- నక్కపల్లి వద్ద 1,800 ఎకరాల్లో ఏర్పాటు
- 8న శంకుస్థాపన చేయనున్న ప్రధాని
- ధ్రువీకరించిన ఎంపీ సీఎం రమేశ్
- ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు, విశాఖ రైల్వే జోన్‌కూ పునాదిరాళ్లు
- పూడిమడక లేదా విశాఖలో బహిరంగ సభ!

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖకు మరో మణిహారం అమరనుంది. విశాఖ సమీపంలోని అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద కొత్తగా మరో ఫార్మా సెజ్ ఏర్పాటు కానుంది. ఆ జిల్లాలో ఇప్పటికే అచ్యుతాపురం వద్ద ఫార్మా సెజ్ ఉంది. ఇప్పుడు ఇంకో దానిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దానికి ప్రధాని మోదీ జనవరి 9న శంకుస్థాపన చేయనున్నారు. ఆయన పర్యటనను అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ధ్రువీకరించారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. నవంబరు 29వ తేదీనే ప్రధాని రావలసి ఉందని, ఆ సమయంలో వాతావరణం అనుకూలంగా లేక వాయిదా పడిందని.. ఇప్పుడు వచ్చే నెలలో వస్తున్నారని తెలిపారు. కాగా.. ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉండడంతో అనకాపల్లి జిల్లాలో కేంద్రం కొత్త సెజ్‌ను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్థలం ఎంపిక పూర్తి చేసింది. నక్కపల్లి వద్ద సుమారు 1,800 ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేయనున్నారు. సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా నేల చదును, రహదారుల నిర్మాణం, విద్యుత్, నీటి సదుపాయం, ఇతర వసతులను కేంద్రం తన ఖర్చుతో సమకూరుస్తుంది. పనుల నిర్వహణకు టెండర్లు కూడా పిలిచింది. దీనిపై కేంద్రం సుమారు రూ.1,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అంచనా. ఇది పూర్తయితే పెద్ద సంఖ్యలో ఫార్మా పరిశ్రమలు వస్తాయని భావిస్తున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలోకి నక్కపల్లి ప్రాంతం వస్తుంది. ఫార్మా సెజ్‌తోపాటు ప్రధాని మరో రెండు శంకుస్థాపనలు కూడా చేయనున్నారు. అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద రూ.75 వేల కోట్లతో ఏర్పాటవుతున్న గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రానికి శంకుస్థాపన చేస్తారు. దీనిని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌టీపీసీ ఏర్పాటు చేస్తోంది. సాధారణంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి భారీ స్థాయిలో స్వచ్ఛమైన నీరు కావాలి. కానీ ఎన్‌టీపీసీ సముద్రపు నీటితో హైడ్రోజన్ తయారు చేసే టెక్నాలజీని కనుగొంది. ఆ టెక్నాలజీ సాయంతో పూడిమడక వద్ద ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా గ్రీన్ హైడ్రోజన్‌ను వినియోగించే అవకాశం ఉంది. దీనితో పాటు విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌కు కూడా ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర విభజన హామీల్లో జోన్ ఉన్న సంగతి తెలిసిందే. స్థలం సమస్యతో జగన్ ప్రభుత్వ హయాంలో ఇది నెరవేరలేదు. కూటమి ప్రభుత్వం రాగానే సమస్యను పరిష్కరించి స్థలాన్ని రైల్వే శాఖకు అప్పగించింది. ఇందులో జోన్‌కు సంబంధించిన భవనాల నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఆయన పర్యటన సందర్భంగా పూడిమడక లేదా విశాఖలో బహిరంగ సభ నిర్వహించే అవకాశముంది. ప్రధాని సమయాన్ని బట్టి సభ వేదిక ఖరారవుతుందని, కొద్ది రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై నిర్ణయం తీసుకుంటారని సీఎం రమేశ్ చెప్పారు.

అనకాపల్లికి 2 లక్షల కోట్ల పెట్టుబడులు!!



అనకాపల్లి నియోజకవర్గానికి రూ.2 లక్షల కోట్ల పారిశ్రామిక పెట్టుబడులు రానున్నాయని ఎంపీ సీఎం రమేశ్ వెల్లడించారు. 'రూ.75 వేల కోట్లతో పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు ఇప్పటికే మంజూరైంది. ఇదే ప్రాంతంలో ఆర్సెలార్ నిప్పన్ కంపెనీల సంయుక్త భాగస్వామ్యంతో రూ.80 వేల కోట్లతో భారీ ఉక్కు కర్మాగారం కూడా రాబోతోంది. ముడి ఇనుప ఖనిజం సరఫరాపై ఎన్‌ఎండీసీతో ఒప్పందం పూర్తయ్యాక దీని శంకుస్థాపన జరుగుతుంది. ఫార్మా సెజ్‌లో కొన్ని ఫార్మా పరిశ్రమలు రానున్నాయి. పెద్ద అల్యూమినియం తయారీ కర్మాగారం కూడా రాబోతోంది. ఇవన్నీ వస్తే రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు అవుతాయి' అని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

స్నేహితుడిని కొట్టి తరిమేసి.. విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

- చెన్నై నడిబొడ్డున అన్నా వర్సిటీలో ఘోరం
- ఆపై యువతి నగ్న వీడియో చిత్రీకరణ.. నిందితుల్లో ఒకరి అరెస్టు

చెన్నై, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాజధాని చెన్నై నడిబొడ్డున ఉన్న అన్నా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై ఇద్దరు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ నెల 23న రాత్రి 8 గంటల సమయంలో వర్సిటీ క్యాంపస్ ప్రాంగణంలోని ఓ భవనం వెనుక ఆమె, తన స్నేహితుడితో మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన దుండగులు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ముందుగా ఆమె స్నేహితుడిని కొట్టి తరిమేసి, ఆమెపై లైంగిక దాడికి తెగబడ్డారు. ఘటనపై మంగళవారం రాత్రి ఆ యువతి స్థానిక కొట్టూర్పురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. అత్యాచారం అనంతరం తనను నగ్నంగా వీడియో తీసినట్లు ఆ యువతి ఫిర్యాదులో పేర్కొంది. యూనివర్సిటీ క్యాంపస్ హాస్టల్లోనే ఉండి చదువుకుంటున్న ఆ యువతి స్వస్థలం కన్యాకుమారి జిల్లా అని పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు, దర్యాప్తు ముమ్మరం చేసి, సాంకేతిక ఆధారాలతో వర్సిటీకి సమీపంలో ఉన్న కొట్టూర్పురానికి చెందిన జ్ఞానశేఖరన్(37)ను అరెస్టు చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడని, ఫుట్‌పాత్‌పై బిర్యానీ విక్రయించే ఇతడిపై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థిని అత్యాచార ఘటనను ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ ప్రాంగణంలో నిరసన తెలిపారు. కాగా, ఈ ఘటనపై రాష్ట్రంలోని ప్రతిపక్షాలన్నీ తీవ్రంగా మండిపడ్డాయి. ఈ ఘటన రాష్ట్రానికే సిగ్గు చేటు అని మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ తీరును ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనడానికి ఈ సంఘటనే తార్కాణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్యానించారు.

'పొరుగు' మద్యం.. అదే జోరు

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దు ప్రాంతాల్లోనూ పొరుగు మద్యం పూర్తిగా ఆగలేదు. ఇంకా ఏపీలో ధరలు కొంత ఎక్కువగానే ఉండటం కూడా ఎన్‌డీపీఎల్ రావడానికి ఓ కారణంగా చెబుతున్నారు. ఇటీవల హడావుడిగా ధరలు తగ్గించుకున్న బ్రాండ్లు.. నాణ్యతను కూడా తగ్గించాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

ఈ ఏడాదిలో భారీగా ఎన్‌డీపీఎల్ సీజ్

ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 1,89,686 లీటర్ల ఇతర రాష్ట్రాల మద్యాన్ని ఎక్సైజ్, పోలీసు శాఖలు సీజ్ చేశాయి. గతేడాది ఇదే సమయంలో 71,365 లీటర్ల మద్యం పట్టుబడింది. ఈ ఏడాది ఎన్‌డీపీఎల్ భారీగా పెరగడానికి సార్వత్రిక ఎన్నికలు కూడా ఓ కారణం. అయినప్పటికీ గతేడాది కంటే రెట్టింపు కన్నా ఎక్కువ కావడం గమనార్హం. ఇటీవల అనంతపురంలో దొరికిన సీసాలు కూడా కలిపితే ఈ ఏడాది పట్టుబడిన ఎన్‌డీపీఎల్ 2 లక్షల లీటర్లు దాటిపోతుంది. అలాగే ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లోకి పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం భారీగా వస్తోంది.

ఇంకా ఎందుకు వస్తోంది?: ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రావడానికి ప్రధాన కారణం మన రాష్ట్రంలో ధరలు అధికంగా ఉండటం. ఇక్కడి ధరలతో పోల్చినప్పుడు కొంత తక్కువకు వస్తుందంటే వినియోగదారులు ఎన్‌డీపీఎల్‌నే కొంటారు. అక్రమార్కులకు ఏపీలోని అధిక ధరలే కలిసివస్తోంది. పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా ధరలు పెంచినప్పుడు ఎన్‌డీపీఎల్ ప్రవాహంలా వచ్చింది. అయితే ధరలు తగ్గాక కొంతమేర తగ్గింది. కానీ మంచి బ్రాండ్లు లేకపోవడంతో మళ్లీ భారీగా ఎన్‌డీపీఎల్ వచ్చిపడింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకొచ్చినా మద్యం బ్రాండ్ల ధరలు అలాగే ఉన్నాయి. ఇటీవల ఓ పది బ్రాండ్లు ధరలు తగ్గించుకున్నాయి. మిగిలిన బ్రాండ్ల ధరలు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. దీంతో ధరల వ్యత్యాసం ఎన్‌డీపీఎల్ రావడానికి కారణమవుతోంది. ప్రభుత్వం క్వార్టర్ రూ. 99 మద్యం తెచ్చినా అది పూర్తిగా అందుబాటులో లేదు. డిమాండ్ భారీగా ఉండటంతో పరిమితంగానే సరఫరా చేస్తున్నారు. ఫలితంగా పక్క రాష్ట్రాల మద్యం వస్తోంది. అలాగే కేంద్రపాలిత ప్రాంతాలైన గోవా, యానాంలలో సాధారణంగానే మద్యం ధరలు తక్కువగా ఉంటాయి కాబట్టి అక్కడినుంచి వచ్చే ఎన్‌డీపీఎల్‌కు అడ్డుకట్ట పడట్లేదు.

నాణ్యతపై అనుమానాలు

ప్రభుత్వం నాణ్యమైన మద్యం పేరుతో రూ. 99 బ్రాండ్లు తీసుకొచ్చింది. మొత్తం అమ్మకాల్లో వాటి వాటా 30 శాతంగా ఉంది. మిగిలిన 70 శాతం బ్రాండ్లలో కొన్ని బ్రాండ్లపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇటీవల ధరలు తగ్గించుకున్న ఒకట్రెండు పాపులర్ మద్యం బ్రాండ్లు నాణ్యత విషయంలో రాజీ పడుతున్నాయనే వాదన వినియోగదారుల నుంచి వినిపిస్తోంది. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ప్రమాణాలు పాటిస్తున్నా, గతంలో ఉన్న స్థాయి నాణ్యత అక్కర్లేదనే భావనకు వచ్చినట్లు తెలిసింది. అయితే దీనిపై ఎక్సైజ్ శాఖ కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎక్సైజ్ శాఖ ప్రతి కంపెనీ తయారుచేసే మద్యాన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఉందా? లేదా? అని తనిఖీ చేస్తుంది. ముఖ్యంగా బ్లెండ్ ఉందా? లేదా? అని పరీక్షించి, అది ఉంటే అనుమతిస్తుంది. ఆ మేరకు ప్రమాణాలు ఉన్నప్పటికీ గతంలో ఇచ్చిన నాణ్యత విషయంలో కొంతమేర రాజీపడుతున్నారని సమాచారం. దీనివల్ల ఆల్కహాల్ శాతం అలాగే ఉన్నా రుచి, ఇతరత్రా అంశాల్లో కొంత వ్యత్యాసం కనిపిస్తోందని వినియోగదారులు అంటున్నారు.



పట్టుబడిన ఎన్‌డీపీఎల్ లీటర్లలో..

జిల్లా	2023 జనవరి-నవంబరు	2024 జనవరి-నవంబరు
కర్నూలు	20,457	24,890
చిత్తూరు	12,977	8,697
అనంతపురం	12,945	17,189
శ్రీసత్యసాయి	9,111	1,04,798
కాకినాడ	3,026	10,974
ఎన్టీఆర్	3,174	14,516
నంద్యాల	866	2,035
అన్నమయ్య	4,818	2,594
కోనసీమ	3,868	2,483
కృష్ణా	123	1,510

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.